
'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 34

బుధవారం 26-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గుజరాత్ ఘన విజయం

ఐపీఎల్ మ్యాచ్‌లో 55 పరుగులతో ఓడిన ముంబై ఇండియన్స్ - 12లో



మళ్లీ ఎన్నికల బరిలోకి..

మళ్లీ అధ్యక్ష బరిలోకి దిగుతున్నట్టు ప్రకటించిన జో బైడెన్ - 6లో



రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి

కేరళ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ కొచ్చి వాటర్ మెట్రోను, రాష్ట్రంలోనే మొట్టమొదటి వందేభారత్ రైలును ప్రారంభించారు.

- వివరాలు 6లో



గ్యాంగ్‌స్టర్‌ను వదిలేశారు!

ఐఏఎస్ అధికారిని హత్యచేసిన గ్యాంగ్‌స్టర్‌కు క్షమాభిక్ష ప్రసాదించడం ద్వారా నితీశ్ సర్కారు వివాదాస్పద నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 6లో



సూడాన్‌ను వీడిన భారతీయులు

భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్ సుమేధ' మొదటి విడతగా 278 భారతీయులతో మంగళవారం సూడాన్ పోర్టును వీడింది.

- వివరాలు 6లో



పాక్ ఠాణాలో భారీ పేలుళ్లు

పాకిస్తాన్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో భారీగా సంభవించిన పేలుళ్లతో 17 మంది చనిపోగా, మరో 70 మంది గాయాలపాలయ్యారు.

- వివరాలు 6లో

పండుగలా ప్లీనరీలు

మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రతినిధుల సభలు

- కేంద్రం... బీజేపీ వైఫల్యాలు, రాష్ట్ర ప్రభుత్వ విజయాలపై తీర్మానాలు
- 119 నియోజకవర్గ కేంద్రాలకు పోటెత్తిన పార్టీ శ్రేణులు.. అంతా గులాబీమయం
- 19 వేల జనావాసాల్లో పతాకావిష్కరణలు
- మంత్రులు, ఎమ్మెల్యేల నృత్యాలు, ర్యాలీలు
- నాలుగు లక్షల మంది హాజరైనట్లు బీఆర్ఎస్ వర్గాల అంచనా
- సిరిసిల్ల సభలో కేటీఆర్, సిద్దిపేట, గజ్వేల్‌లో హరీశ్‌రావు


సిరిసిల్లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: మినీ ప్లీనరీల పేరిట రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బీఆర్ఎస్ ప్రతినిధుల సభలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో రెండు రోజుల ముందు జరిగిన ఈ సభలకు వేల సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో నియోజకవర్గ కేంద్రాల్లో సందడి నెలకొంది. వీధులన్నీ గులాబీమయం అయ్యాయి. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నెల రోజులుగా నియోజకవర్గాల్లో పార్టీ కేడర్‌తో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్న భారత్ రాష్ట్ర సమితి.. మంగళవారం ప్రతినిధుల సభలు నిర్వహించింది. ఒక్కో నియోజకవర్గ కేంద్రంలో జరిగిన సభకు మూడు వేల నుంచి నాలుగు వేల మంది వరకు ప్రతినిధులు హాజరైనట్లు సమాచారం. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో జరిగిన సభలకు సుమారు నాలుగు లక్షల మంది పార్టీ క్రియాశీల నేతలు హాజరైనట్లు బీఆర్ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సందడే సందడి

ప్రతినిధుల సభలు పురస్కరించుకుని సుమారు 19 వేల జనావాసాల్లో పార్టీ పతాకాన్ని ఎగురవేసి బీఆర్ఎస్ శ్రేణులు జెండా పండుగ నిర్వహించాయి. చాలా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు డప్పు చప్పుళ్లతో ర్యాలీగా తరలివచ్చారు. ఆటపాటలతో సభలను హోరెత్తించారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు, అమరులకు, అమరుల స్తూపాలకు నివాళి వంటి కార్యక్రమాలు జరిగాయి. మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వయంగా భోజనాలు వడ్డించి పార్టీ కేడర్‌తో మమేకం అయ్యేందుకు ప్రయత్నించారు. పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు నృత్యాలతో సందడి చేశారు. మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి, ఘనపూర్‌లో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఇల్లందులో ఎమ్మెల్యే భానోత్ హరిప్రియ, కరీంనగర్‌లో మేయర్, కార్పొరేటర్లు ప్రతినిధుల సభా వేదికలపై చేసిన నృత్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి.

హాజరైన ముఖ్య నేతలు.. అసంతృప్తులు దూరం

సిరిసిల్ల సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పాల్గొనగా, సిద్దిపేటతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ సభలకు మంత్రి టి.హరీశ్‌రావు

మిగతా 3వ పేజీలో ▶

ఉరిమేసి.. కుమ్మేసి!

హైదరాబాద్‌లో భారీ వర్షం


ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం నందిగామ గ్రామంలో వడగళ్ల వాన

ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో దంచి కొట్టిన వాన.. అత్యధికంగా రాంచంద్రాపురంలో 7.9 సె.మీ వర్షపాతం

పలుచోట్ల 3 సె.మీకు పైగా నమోదు

వాగుల్ని తలపించిన ప్రధాన రహదారులు.. కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

కిలోమీటర్లకొద్దీ ట్రాఫిక్ జామ్.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుస్సేన్‌సాగర్‌లో అదుపు తప్పిన బోటు.. పర్యాటకులు సురక్షితం

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగండ్ల వాన.. పంటలకు నష్టం

5లో

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి.. నేడు, రేపు వర్షాలు: వాతావరణ శాఖ


మంగళవారం కురిసిన భారీ వర్షంతో ఎల్బీనగర్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

న్యూస్‌రీల్

కొత్త సచివాలయానికి నేటి నుంచి శాఖల తరలింపు



రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వశాఖల తరలింపు ప్రక్రియను 28లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కొత్త సచివాలయ భవన సముదాయంలోని ఒక్కో అంతస్తులో కనీసం 3 శాఖలకు స్థలం కేటాయించారు.

- వివరాలు 14లో

ఆర్టీసీలో గ్రాట్యుటీ గల్లంతు



ఆర్టీసీ చరిత్రలో తొలిసారి గ్రాట్యుటీకి గండిపడింది. రిటైర్డ్ ఉద్యోగుల హక్కుగా పొందే ఈ గ్రాట్యుటీని ఆర్థిక ఇబ్బందుల కారణంగా చూపి నిలిపేసింది. గత జనవరి నుంచి వీటి చెల్లింపుల్లో ప్రతిష్టంభన నెలకొంది.

- వివరాలు 14లో

తెలంగాణ రాష్ట్రంలోనే కడుపు 'కోత'లెక్కువ



దేశంలోకెల్లా తెలంగాణలోనే సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నట్లు హెచ్ఎంఐఎస్ తాజా నివేదికలో వెల్లడైంది. దీని ప్రకారం 2021–22లో సిజేరియన్ల జాతీయ సగటు 23.29 శాతంగా ఉండగా రాష్ట్రంలో అది ఏకంగా 54.09 శాతంగా నమోదైంది.

- వివరాలు 2లో

సమ్మె ప్రభావం లేదు



విద్యుత్ సంస్థలపై ఆర్టిజన్ల సమ్మె ప్రభావం లేదని, విద్యుత్ సరఫరాలో సైతం ఎలాంటి అంతరాయాలు లేవని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. 80 శాతం మంది ఆర్టిజన్లు మంగళవారం విధులకు హాజరయ్యారని వెల్లడించారు.

- వివరాలు 2లో

మున్సిపాలిటీల్లో మైనారిటీలకు కోటా
రాజ్యాంగ ఉల్లంఘనే

74వ రాజ్యాంగ సవరణలో మైనారిటీల ప్రస్తావనే లేదు



- రాజ్యాంగ విరుద్ధంగా మున్సిపల్ బిల్లులోని నిబంధనలు
- బిల్లును ఆమోదించి రాజ్యాంగానికి తూట్లు పొడవలేను
- రాజ్యాంగం ప్రకారం మైనారిటీ పదానికి నిర్దిష్ట నిర్వచనం తెలపండి... మున్సిపల్ బిల్లును ప్రభుత్వానికి తిప్పి పంపుతూ గవర్నర్ తమిళిసై కామెంట్లు

సాక్షి, హైదరాబాద్: మున్సిపాలిటీల్లో కో–ఆప్షన్ సభ్యులుగా మైనారిటీల నియామకానికి వీలు కల్పిస్తూ తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లు–2022ను తీసుకురావడం రాజ్యాంగ ఉల్లంఘనేనని రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం మైనారిటీ అనే పదాన్ని నిర్వచించడానికి అవసరమైన నిర్దిష్ట ప్రామాణికతను తీసుకురావాలని కోరుతూ మున్సిపల్ బిల్లును ప్రభుత్వానికి తిప్పి పంపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యతలో ఉండి అందుకు తూట్లు పొడిచే పనుల్లో భాగస్వామి కాలేనని ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

మైనారిటీల ప్రస్తావనే లేదు...

'మున్సిపాలిటీల పాలనా వ్యవహారాల్లో దేశవ్యాప్తంగా ఏకరూప విధానం కోసం కేంద్రం 74వ రాజ్యాంగ సవరణ తెచ్చింది. మున్సిపాలిటీల ఏర్పాటు, పాలకవర్గ సభ్యుల ఎంపిక, సీట్ల రిజర్వేషన్ల అంశాలపై రాజ్యాంగంలోని పేరా–9–ఏలో ఉన్న ఆర్టికల్ 243–పీ, 243–జీలలో స్పష్టమైన వివరణలున్నాయి. ఎక్కడా అందులో మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించాలని లేదు. ఎన్నికల ద్వారానే మున్సిపాలిటీల్లో సీట్ల నియామకం జరపాలని ఆర్టికల్ 243–ఆర్ పేర్కొంటోంది. పురపాలనలో అనుభవం, పరిజ్ఞానంగల వ్యక్తులను కో–ఆప్షన్ సభ్యులుగా నియమించడానికి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వార్డు కమిటీ చైర్‌పర్సన్లను మున్సిపాలిటీల్లో (ఎక్స్‌అఫిషియో) సభ్యులుగా నియమించడానికే మినహాయింపు ఉంది. రాజ్యాంగంలోని పేరా–9–ఏలో మైనారిటీల ప్రస్తావన లేదు. ప్రతిపాదిత మున్సిపల్ బిల్లులోని నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 9–ఏను ఉల్లంఘించేలా ఉన్నాయి' అని గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు.

ఖజానాపై భారమనే ఆ బిల్లు తిరస్కృతి

వైద్యవిద్య డైరెక్టర్, అదనపు డైరెక్టర్, వైద్య కళాశాల ప్రిన్సిపాళ్లు, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్ల

మిగతా 2వ పేజీలో ▶



చాకిరీ మాది... పదవులు మీకా?

టీపీసీసీ బీసీ నేతల ఆగ్రహం... గాంధీభవన్‌లో కీలక సమావేశం

- మేమెవరికీ వ్యతిరేకం కాదు... మా కోటా సీట్లు మాకివ్వండి
- ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మూడు అసెంబ్లీ సీట్లు బీసీలకు ఇవ్వాల్సిందే... రాష్ట్రంలో బీసీ కులాల ఓట్ల వివరాలు సోనియా, రాహుల్‌కు పంపాలని నిర్ణయం

- వివరాలు 3లో

బీజేపీ, బీఆర్ఎస్‌లవి లాలూచీ రాజకీయాలు

- అమిత్‌షా మైనార్టీ రిజర్వేషన్ల రద్దు ప్రకటనపై బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడదు?
- వరంగల్ పర్యటనలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క - 3లో

జూమ్‌లో.. కామ్‌గా
ఆధారాలు ధ్వంసం!

మార్గదర్శి యాజమాన్యం అర్ధరాత్రి 'మేనేజ్‌మెంట్'



- రికార్డులు డిలీట్ చేయండి... ఏ ఒక్కటీ దొరక్కూడదు
- చిట్స్ బ్రాంచీల సిబ్బందికి హైదరాబాద్ నుంచి ఆదేశాలు
- జూమ్ మీటింగ్‌లో ప్రాక్టికల్‌గా చూపించిన 'పెద్దలు'
- తమ వివరాలు ఏమవుతాయోనన్న ఆందోళనలో ఖాతాదారులు..
- ఇప్పటికే 2,3 నెలలుగా డబ్బులు అందక చిట్ పాటదారుల తిప్పలు
- ష్యూరిటీలు సహా రకరకాల కారణాలతో జాప్యం చేస్తున్న మార్గదర్శి.. ఇప్పటిదాకా 'సర్క్యులర్' వ్యాపారానికి అలవాటుపడ్డ వైనం
- కొత్త చిట్లు వస్తే.. ఆ సొమ్మును పాత చిట్లకు చెల్లిస్తున్న సంస్థ.. సగానికి సగం ఖాళీ ఉన్న చిట్లలో... అన్నీ ఫోర్‌మెన్ పేరిటే
- వాటికి తన తరఫున వాటా చెల్లించకుండానే కానిచ్చేస్తున్న తీరు.. డిసెంబరు నుంచి ఏపీలో కొత్త చిట్లే లేవు.. దీంతో నిధుల కొరత
- అందుకే చిట్లు పాడుకున్నవారికి చెల్లింపుల్లో అంతులేని జాప్యం.. తాజా పరిస్థితుల్లో తమ కష్టార్జితం ఏమవుతుందోనని చిట్‌దారుల ఆందోళన
- నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదంటున్న అధికారులు.. ప్రతి చిట్‌కూ ఓ బ్యాంకు ఖాతా ఉంటే.. జాప్యానికి అవకాశమే ఉండదు

- వివరాలు 10లో

ఇదండీ సంగతి



...ఎవరైనా అన్నన్ని వాగ్దానాలు ఇస్తారా..!



బాదల్ కన్నుమూత

- పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ అగ్రనేత ప్రకాశ్‌సింగ్ బాదల్(95) తుదిశ్వాస విడిచారు. చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మొహాలీలోని ఓ ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కన్నుమూశారు. - వివరాలు 6లో

కేసీఆర్.. గ్యాంగ్‌స్టర్లకే గ్యాంగ్‌స్టర్

అతీక్ అహ్మద్‌ను మించిన డేంజర్..

- పోలీసులను అడ్డుపెట్టుకుని దోచుకుంటున్నారు
- అకాల వానలతో రైతులు ఏడుస్తుంటే మంత్రులు డిస్కో డ్యాన్సులు చేస్తున్నారు
- కేటీఆర్‌ను బర్తరఫ్ చేసే దాకా ఉద్యమిస్తాం
- పాలమూరు నిరుద్యోగమార్చ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి


నిరుద్యోగ మార్చ్‌కు హాజరైన యువత, నిరుద్యోగులనుద్దేశించి ప్రసంగిస్తున్న బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'యూపీలో గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కంటే డేంజర్ సీఎం కేసీఆర్... అతీక్ అహ్మద్ గన్ పెట్టి బెదిరించి దోచుకుంటే.. కేసీఆర్ పోలీసులను అడ్డం పెట్టుకుని బెదిరిస్తూ ప్రజల భూములను, సొమ్మును దోచుకుంటున్నడు. గ్యాంగ్‌స్టర్లకే గ్యాంగ్‌స్టర్ కేసీఆర్.. అయినా భయపడే ప్రసక్తే లేదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, బండి సంజయ్ కుమార్ అన్నారు. నిరుద్యోగ గోస.. బీజేపీ భరోసా పేరిట మహబూబ్‌నగర్‌లో మంగళవారం చేపట్టిన నిరుద్యోగ మార్చ్‌కు అధిక సంఖ్యలో యువత, నిరుద్యోగులు పోటెత్తారు. ముందుగా బండిసంజయ్ న్యూటౌన్‌లోని తెలంగాణ అమరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీ ప్రారంభం కాగా..

మిగతా 2వ పేజీలో ▶

జైలు నుంచి షర్మిల విడుదల

- బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
- తెలంగాణలో తాలిబన్‌ల రాజ్యం నడుస్తోందంటూ షర్మిల ధ్వజం


మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

చంచల్‌గూడ: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. పోలీసులపై చేయి చేసుకున్న కేసులో అరెస్టయిన ఆమెకు మంగళవారం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అనంతరం జైలు నుంచి విడుదలైన ఆమె మీడియాతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న తనను పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధానికి యత్నించడం అమానుషమన్నారు. తెలంగాణలో తాలిబన్‌ల రాజ్యం నడుస్తోందనడానికి ఈ ఘటనే సాక్ష్యమన్నారు. సుపరిపాలన కోసం ప్రజలు కేసీఆర్‌కు అవకాశం ఇస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని మండిపడ్డారు. పోలీసుల దాడుల నుంచి తాను ఆత్మరక్షణకు ప్రయత్నిస్తే వారు మాత్రం తమకు అనుకూలంగా ఉన్న వీడియో లనే సామాజిక మాధ్యమాల్లో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

జూన్ 9న చేప ప్రసాదం పంపిణీ

బత్తిని సోదరుల వెల్లడి



పంజగుట్ట (హైదరాబాద్): కరోనా కారణంగా మూడేళ్ల నుంచి వాయిదాపడిన చేప ప్రసాదం జూన్ 9న నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఇవ్వనున్నట్లు బత్తిని సోదరులు ప్రకటించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బత్తిని అమర్‌నాథ్ గౌడ్, బత్తిని గౌరీశంకర్ గౌడ్ మాట్లాడుతూ..జూన్ 9న ఉదయం 8 గంటల నుంచి 10వ తేదీ ఉదయం 8 గంటల వరకు 24 గంటల పాటు చేప ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. ఆస్తమా, దగ్గు, ఉబ్బసం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు కొన్ని లక్షల మంది తమ చేప ప్రసాదం తీసుకుని వారి సమస్యలను శాశ్వతంగా తగ్గించుకున్నారన్నారు. ప్రభుత్వం తరఫున కొర్రమీను లైవ్ చేపలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని ఈ మేరకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రసాదం తీసుకునే నాలుగు గంటల ముందు, తీసుకున్న రెండు గంటలు ఏమీ తినకూడదని, 45 రోజులు పత్యం ఉండాలని చెప్పారు. ఉచితంగా చేప ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

రేపు ఈపీఎఫ్ నిధి ఆప్‌కే నికత్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 27న రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక సంస్థలు – ఉద్యోగుల సౌకర్యార్థం 'నిధి ఆప్‌కే నికత్-2.0 కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రీజినల్ కమిషనర్ అర్జున్ థక్రాల్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5.45 గంటల వరకు బర్కత్‌పురా పీఎఫ్ కార్యాలయంతో పాటు చర్లపల్లి ప్రభుత్వ మింట్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, సూర్యాపేటలోని వెంకటేశ్వర డిగ్రీ కాలేజీ, బీబీనగర్‌లోని హిందూవేర్ కంపెనీ, ఉప్పల్‌లోని ఐడీఏ శ్రీకృష్ణ ఫార్మా, వాడపల్లిలోని ఇండియా సిమెంట్స్ కార్యాలయాల ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

హైదరాబాద్-షోలాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్-షోలాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మే 14వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుంది. రోజూ ఉదయం 6 గంటలకు నాంపల్లి నుంచి బయలుదేరి.. అదేరోజు మధ్యాహ్నం 12.20 గంటలకు షోలాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు షోలాపూర్ నుంచి బయలుదేరి రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

'థైరోనార్మ్ మాత్రలు రీకాల్.. ఆ మందులు వాడొద్దు'

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్, తెలంగాణకు పంపిన థైరోనార్మ్ మాత్రల (హైపోథైరాయిడిజం చికిత్సలో వాడే) మొత్తం బ్యాచ్‌ను అబ్బాట్ ఇండియా లిమిటెడ్ ఫార్మా కంపెనీ మంగళవారం రీకాల్ చేసింది. బ్యాచ్ నెంబర్ ఏఈజే 0713 ఒక బ్యాచ్ థైరోనార్మ్ ట్యాబ్లెట్లను (థైరాక్సిన్ సోడియం) మార్చి 2023 తయారీ తేదీని స్వచ్ఛందంగా రీకాల్ చేసింది. బ్యాచ్ ఉండాల్సిన దాంతో పోలిస్తే తక్కువ మోతాదుతో తప్పుగా లేబుల్ చేసినట్లు తెలిపింది. బాటిల్‌లో 88 ఎంసీజీ టాబ్లెట్లు ఉన్నాయి. ఈ ఔషధం అధిక మోతాదులో వాడితే టెన్షన్, నిద్రలేమి, చేతిలో తేలికపాటి వణుకు, శరీర ఉష్ణోగ్రతలో స్వల్ప పెరుగుదల, రక్తపోటు పెరుగుదల, అతిసారం వంటి క్లినికల్ సంకేతాలకు కారణమవుతుంది. తీవ్రమైన సందర్భాల్లో ఇది కోమా, మూర్ఛ, సైకోసిస్‌కు కూడా దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. మార్చి 2023 తయారీ, గడువు తేదీ ఫిబ్రవరి 2025 ఉన్నటువంటి వాటిని కొనుగోలు చేసిన వాళ్లు ఎక్కడ కొనుగోలు చేశారో అక్కడే తిరిగి ఇవ్వాలని కోరింది.

1,008 బాలలకు 'దివ్య'మైన స్వామి దర్శనం

తమిళనాడుకి చెందిన దివ్యాంగులు, బధిర పిల్లలకు శ్రీవారి దర్శనం

సాక్షి చెన్నై/రేణిగుంట/తిరుమల: తమిళనాడుకు చెందిన దివ్యాంగ బాలబాలికలు శ్రీవారిని దర్శించుకున్నారు. టీటీడీ చెన్నై స్థానిక సలహా మండలి సహకారంతో బధిరులు, దివ్యాంగ పిల్లలను శ్రీవారి దర్శనానికి తీసుకువచ్చేందుకు చెన్నై ఫుడ్ బ్యాంక్, రాజస్థాన్ యూత్ అసోసియేషన్, (ఆర్‌వైఏ) మద్రాస్ మెట్రో ట్రస్ట్‌లు ప్రత్యేక రైలు ఏర్పాటు చేశాయి. 1,008 మంది దివ్యాంగ పిల్లలు, 300 మంది వలంటీర్లతో కూడిన ప్రత్యేక రైలును చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌కు ఈ రైలు చేరుకున్న అనంతరం అందులో ఉన్నవారంతా 31 ప్రత్యేక బస్సుల్లో తిరుమలకు చేరుకున్నారు. తిరుమల చేరుకున్నాక వృద్ధులు, దివ్యాంగుల క్యూలైన్ ద్వారా దర్శనానికి వెళ్లేందుకు వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనంతో వీరి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తమ మనోనేత్రంతో శ్రీవారిని దర్శించుకున్నామని పలువురు అంధులు పేర్కొన్నారు. వారి వెంట చెన్నై స్థానిక సలహా మండలి చైర్మన్ శేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

రాష్ట్రంలోనే


కడుపు 'కోత'లెక్కువ

2021-22లో తెలంగాణలో సిజేరియన్ కాన్పులు **54.09%**

జాతీయ సగటు 23.29 శాతంతో పోలిస్తే రెట్టింపుపైనే నమోదు

- ప్రైవేటు ఆస్పత్రుల్లో 61 శాతం.. ప్రభుత్వంలో 47 శాతం 'కోత'లే
- బిహార్‌లో అత్యంత తక్కువగా 5.66 శాతం సిజేరియన్లు
- కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలోని హెచ్ఎంఐఎస్ నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అమ్మకు కడుపు 'కోత'తప్పడంలేదు! దేశంలోకెల్లా తెలంగాణలోనే సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (హెచ్ఎంఐఎస్) తాజా నివేదికలో వెల్లడైంది. దీని ప్రకారం 2021-22లో సిజేరియన్ల జాతీయ సగటు 23.29 శాతంగా ఉండగా రాష్ట్రంలో అది ఏకంగా 54.09 శాతంగా నమోదైంది. అంటే జాతీయ సగటు కంటే రెట్టింపునకుపైగా ఉండటం గమనార్హం. అయితే తెలంగాణకన్నా ఎంతో వెనుకబడిన బిహార్‌లో మాత్రం అత్యంత తక్కువగా 5.66 శాతం సిజేరియన్లే జరుగుతున్నాయని నివేదిక తెలిపింది. ఆ తర్వాత జార్ఖండ్‌లో 9.13 శాతం, యూపీలో 9.51 శాతం, మధ్యప్రదేశ్‌లో 12.97 శాతం సిజేరియన్లు మాత్రమే జరుగుతున్నాయి. తెలంగాణ తరహాలో జమ్మూకశ్మీర్‌లో 48.97 శాతం సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ దేశంలోకెల్లా పదో స్థానంలో నిలిచింది.



నివేదికలోని ముఖ్యాంశాలు..

- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సూచనల ప్రకారం మొత్తం కాన్పుల్లో సిజేరియన్లు 10 శాతం నుంచి 15 శాతానికి మించకూడదు. ఆ లెక్క ప్రకారం చూసుకుంటే రాష్ట్రంలో అంతకు ఐదు రెట్లు ఎక్కువగా సిజేరియన్లు జరుగుతున్నాయి.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్ల జాతీయ సగటు 15.48 శాతం ఉండగా ప్రైవేటులో అది 37.95 శాతం ఉంది.
- తెలంగాణలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే కాన్పుల్లో 47.13 శాతం సిజేరియన్లు కాగా ప్రైవేటు ఆసుపత్రుల్లో 61.08 శాతం సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి.
- బిహార్‌లో అత్యంత తక్కువగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1.86 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి.



- 2021-22లో పుట్టిన శిశువుల్లో వివిధ కారణాల వల్ల తెలంగాణలో 2,171 మంది చనిపోయారు.
- బాలికలకు శానిటరీ నాప్కిన్స్ సరఫరాలో తెలంగాణ వెనుకబడి ఉంది. దేశవ్యాప్తంగా ఆ ఏడాది 4.21 కోట్లు సరఫరా చేయగా, అత్యధికంగా తమిళనాడులో కోటిన్నర, తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 1.16 కోట్లు సరఫరా చేశారు. తెలంగాణలో కేవలం 1,552 మాత్రమే సరఫరా చేశారు.
- 2021-22లో తెలంగాణలో 6.06 లక్షల మంది శిశువులు జన్మించారు. అందులో రెండున్నర కేజీల బరువుతో పుట్టినవారు 37,792 మంది ఉన్నారు. 4.89 లక్షల మంది గంటలోపు తల్లిపాలు తాగారు.
- 2021-22లో తెలంగాణలో 46.70 లక్షల కండోమ్‌లు పంపిణీ అయ్యాయి.

చూస్తుండగానే చంపేశారు!

కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దల నిరాకరణ

- కుమార్తెకు వేరే యువకుడితో వివాహం
- పెళ్లయ్యాక కూడా తన వద్దకు రావాలని ప్రియుడి వేధింపులు
- నిరాకరించడంతో యువతి అశ్లీల వీడియోలు విడుదల
- మనస్తాపంతో విడాకులిచ్చి భర్త ఆత్మహత్య
- దాంతో కక్షగట్టి యువకుడిని నరికి చంపిన యువతి కుటుంబీకులు



మహేశ్(ఫైల్)

సాక్షి ప్రతినిధి మంచిర్యాల/జైపూర్: వారిద్దరూ ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో యువతి తల్లిదండ్రులు అడ్డు చెప్పారు. తల్లిదండ్రుల మాట కాదనలేక వారు చూసిన వ్యక్తినే ఆమె పెళ్లి చేసుకుంది. కానీ ప్రియుడు తనతో రావాలని వేధించేవాడు. ఆమె నిరాకరించడంతో వారిద్దరూ కలిసి ఉన్న వీడియోలు, ఫొటోలు, యువతి నగ్నంగా చేసిన కాల్ రికార్డులను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇది తెలిసిన ఆమె భర్త ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. తమ కుమార్తె జీవితాన్ని నాశనం చేశాడన్న కక్షతో ఆమె తల్లిదండ్రులు, తమ్ముడు అదును చూసి యువతి సమక్షంలోనే నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా యువకుడిని కత్తితో నరికి, బండరాళ్లతో కొట్టి చంపేశారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ హత్యోదంతం కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇందారం గ్రామం నజీర్‌పల్లికి చెందిన మహేశ్(27) స్థానిక ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులో డంపర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. ఇదే గ్రామానికి చెందిన పెద్దపల్లి శృతితో చదువుకున్న రోజుల్లో ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది. నాలుగేళ్లపాటు ప్రేమించుకున్నారు. ఆ సమయంలో శృతి, మహేశ్‌లు రహస్యంగా వీడియో కాల్స్ చేసుకుంటూ దగ్గరయ్యారు. కానీ కులాలు వేరు కావడంతో శృతి ఇంట్లో వాళ్లు వివాహానికి ఒప్పుకోలేదు.

పెళ్లయ్యాక ఆ వీడియోలు బయటపెట్టి..

యువతి తల్లిదండ్రులు గత ఏడాది మే 25న శృతికి సీసీసీకి చెందిన పెంట శివతో వివాహం జరిపించారు. శివతో పెళ్లయ్యాక కూడా మహేశ్ తనతో రావాలని కోరగా ఆమె అంగీకరించలేదు. దీంతో కోపంతో తన దగ్గర ఉన్న వీడియో కాల్స్, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ విషయం తెలియడంతో శివ తన భార్య శృతికి పెళ్లయిన నెల రోజులకే విడాకులు ఇచ్చి మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రస్తుతం శృతి తల్లిదండ్రుల వద్దనే ఉండటంతో ఆమెను చూడాలని మహేశ్ తరచూ వారి ఇంటి మీదుగా తిరుగుతుండేవాడు. కాగా, తన కుమార్తెను ఇబ్బంది పెడుతున్నాడని మహేశ్‌పై జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో శృతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇందుకు ప్రతిగా తనను చంపేందుకు చూస్తున్నారని మహేశ్ కూడా వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్‌పై వెళ్తుండగా అడ్డగించి..

ఈ క్రమంలో మంగళవారం ఉదయం 8:10గంటలకు మహేశ్ తమ ఇంటి ముందు నుంచి బస్టాండ్ వైపు వెళ్తుండగా శృతి, ఆమె తల్లిదండ్రులు కనకయ్య, పద్మ చూశారు. చెల్లెలు శ్వేత, తమ్ముడు సాయితో కలిసి అడ్డగించి కత్తితో దాడికి పాల్పడ్డారు. అత్యంత కిరాతకంగా నరుకుతూ బండరాళ్లతో అందరూ చూస్తుండగానే తలపై మోది వారి ఇంటి ముందే చంపేశారు. అనంతరం ఆటోలో మంచిర్యాల వైపు వెళ్లిపోయారు. చంపుతున్నప్పుడు సెల్‌ఫోన్‌లో రికార్డు చేయడంతో ఆ వీడియోలు వైరల్‌గా మారాయి. దాడికి పాల్పడుతున్న సమయంలో కాపాడండి అంటూ మహేశ్ కేకలు వేశాడు. అయినప్పటికీ ఎవరూ ముందుకు రాలేదు. తీవ్ర రక్తస్రావమై మహేశ్ అక్కడికక్కడే చనిపోయాడు. రక్తపుమడుగులో శవమైన కొడుకును చూసిన మహేశ్ తల్లి రాజేశ్వరి మాకు కేసులు వద్దు, మా కొడుకును చంపిన వ్యక్తులను చంపేయాలంటూ పోలీసుల వద్ద రోదించింది.

ఐదుగురిపై కేసు

మృతుడు మహేశ్ తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఏ1గా పెద్దపల్లి కనకయ్య, ఏ2గా పద్మ, ఏ3గా శృతి, ఏ4గా సాయి, ఏ5గా శ్వేతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు, ఎస్సై రామకృష్ణ తెలిపారు.



మహేశ్‌పై బండరాయి, కత్తితో దాడి చేస్తున్న శృతి కుటుంబీకులు

మృతదేహంతో ధర్నా.. ఉద్రిక్తత

కనకయ్య కుటుంబాన్ని అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు, హతుడి బంధువులు నిందితుల ఇంటిపైకి దాడికి దిగారు. మహేశ్ మృతదేహంతో ఇంటి ముందు ఆందోళనకు దిగారు. అధికార పార్టీ నేతలు పోలీసులు శృతి కుటుంబానికి మద్దతు ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఇందారంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఏసీపీ నరేందర్ నిందితులను వదిలిపెట్టబోమని నచ్చజెప్పడంతో పాటు శ్రీరాంపూర్ సీఐ రాజు బాధితులకు ఎఫ్ఐఆర్ కాపీ అందించడంతో ఆందోళన విరమించి అంత్యక్రియలు చేపట్టారు.

సమ్మె ప్రభావం లేదు

- జెన్‌కోలో దాదాపుగా 100 శాతం ఆర్టిజన్లు విధులకు హాజరు
- ట్రాన్స్‌కో, డిస్కంలలో 80% హాజరు
- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థలపై ఆర్టిజన్ల సమ్మె ప్రభావం లేదని, విద్యుత్ సరఫరాలో సైతం ఎలాంటి అంతరాయాలు లేవని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు తెలిపారు. విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో 100 శాతం, సరఫరా (ట్రాన్స్‌కో), పంపిణీ సంస్థ (డిస్కం)ల్లో 80 శాతం మంది ఆర్టిజన్లు మంగళవారం విధులకు హాజరయ్యారని ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఆర్టిజన్ల (విద్యుత్ సంస్థల్లో విలీనమైన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు) సమ్మెకి తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం (హెచ్ 82) పిలుపునిచ్చిన నేపథ్యంలో దాని ప్రభావాన్ని అంచనా వేసేందుకు విద్యుత్ సౌధలో ఆయన సమీక్ష నిర్వహించారు. అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) కింద విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం అమల్లో ఉందని, దీనిని ఉల్లంఘించి సమ్మెకి దిగితే ఆర్టిజన్ల సర్వీసు నిబంధనలైన 'స్టాండింగ్ ఆర్డర్స్'లోని నిబంధన 34(20) ప్రకారం దుష్ప్రవర్తనగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవిరుద్ధంగా సమ్మెకి దిగిన 200 మంది ఆర్టిజన్లను ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల నుంచి తొలగించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని వినియోగదారులకు 24 గంటల విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగించే దుశ్చర్యలను ఉపేక్షించబోమని, ఈ మేరకు సీఎం కేసీఆర్ ఆదేశాలున్నాయని స్పష్టం చేశారు. బుధవారం ఉదయంలోగా విధులకు హాజరుకాని వారందర్నీ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు.

యూనియన్ నేతలు డిస్మిస్..

సమ్మె పిలుపు నేపథ్యంలో ఉద్యోగుల సంఘం (హెచ్ 82) ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిలు, నేతలు నరేష్, సత్యనారాయణ, వినోద్, సుభాష్‌లను సోమవారం పంజాగుట్ట పోలీసులు ఎస్మా చట్టం కింద అరెస్టు చేయగా, మంగళవారం కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది. మరో ఇద్దరు నేతలు బాల్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లును సైఫాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారని యూనియన్ నేతలు వెల్లడించారు. సమ్మెలో పాల్గొనడం, ఉద్యోగులను సమ్మెకి పురిగొల్పారనే ఆరోపణలపై ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్ 82) ప్రధాన కార్యదర్శి సాయిలును ఆర్టిజన్ గ్రేడ్-2 ఉద్యోగం నుంచి తొలగిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే ఆరోపణలపై యూనియన్ హెల్త్ సెక్రటరీ జె.శివశంకర్‌ను ఆర్టిజన్ గ్రేడ్-1 ఉద్యోగం నుంచి తొలగిస్తూ టీఎస్ఎస్పీడీసీఎల్ ఉత్తర్వులు జారీ చేసింది. మరి కొంతమంది యూనియన్ నేతలను కూడా ఉద్యోగాల నుంచి తొలగించినట్టు సమాచారం. కాగా, ట్రాన్స్‌కోలో 80 శాతంమంది, జెన్‌కో, డిస్కంలలో కలిసి 60 శాతం ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొన్నారని సాయిలు ఒక ప్రకటనలో వెల్లడించారు. బుధవారం మరింత మంది సమ్మెకి దిగుతార చెప్పారు.

..రాజ్యాంగ ఉల్లంఘనే

▶ మొదటి పేజీ తరువాయి

పదవీవిరమణ వయసును 61 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్ యాన్యుయేషన్) చట్ట సవరణ బిల్లు-2022ను గవర్నర్ తమిళిసై తిరస్కరించడం తెలిసిందే. 2019 జూలై 20 నుంచి ఈ మేరకు రిటైర్మెంట్ వయసు పొడిగింపును వర్తింపజేస్తూ 2022 సెప్టెంబర్ 12న బిల్లును ప్రభుత్వం తేవడంపట్ల గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 61 ఏళ్ల నిండి పదవీ విరమణ చేసిన నాటి నుంచి తిరిగి పునర్నియమితులయ్యే వరకు ఉన్న కాలంలో ఒక్కరోజూ పనిచేయకపోయినా వారికి ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు చెల్లించాల్సి వస్తుందని ఆరోపిస్తూ ఈ బిల్లును గవర్నర్ తిరస్కరించారు. ఈ బిల్లుతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి భారం పడదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొనడంపై సైతం గవర్నర్ స్పందించినట్లు సమాచారం. ఇప్పటికే రిటైరైన ఎందరికి దీనిద్వారా ప్రయోజనం కలుగుతుంది? ఎంత మేరకు రాష్ట్ర ఖజానాపై భారం పడుతుంది? వంటి అంశాలపై తమిళిసై ప్రభుత్వ వివరణ కోరినట్లు సమాచారం.

ప్రభుత్వ వర్సిటీలకు దిక్కులేదు.. ప్రైవేటువి కావాలా?

రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వర్సిటీల ఏర్పాటును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు-2022ను తీసుకురావడం సరికాదని గవర్నర్ తమిళిసై అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. ఈ విషయంలో ప్రభుత్వ వివరణ కోరినట్టు సమాచారం.

'ప్రీతి మృతి'పై కౌంటర్ వేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికో విద్యార్థి ప్రీతి మృతిపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రతివాదులైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైద్యారోగ్య ముఖ్యకార్యదర్శి, డీఎంఈ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేసింది. 'గత డిసెంబర్ 22న కాకతీయ యూనివర్సిటీ మెడికో ప్రీతి హానికారక ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే ఇది ఆత్మహత్యాయత్నం కాదని, ప్రీతికి బలవంతంగా విషపు ఇంజెక్షన్ చేశారని.. డెడ్ బాడీని హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేశారంటూ ప్రీతి తండ్రి, సోదరుడు తర్వాత ఆరోపణలు చేశారు. ఫిబ్రవరి 26న ప్రీతి బ్రెయిన్ డెడ్ అయి మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. ర్యాగింగ్, కుల వివక్షే ప్రీతి మృతికి కారణం. తన సీనియర్ సైఫ్ కులం పేరుతో వేధిస్తున్నాడని ఆమె ప్రిన్సిపాల్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు చర్యలు తీసుకోకపోవడంతో తల్లిదండ్రులకు చెప్పింది. ఫిబ్రవరి 21న సైఫ్, మరికొందరు ఆమెకు బలవంతంగా విషపు ఇంజెక్షన్లు ఇచ్చారు. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకొని ఆపై మృతిచెందింది. 1) ఈ కేసును ఐపీసీ 302, ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద విచారణ చేపట్టాలి. 2)సుప్రీం లేదా హైకోర్టు పర్యవేక్షణలో సీబీఐతో దర్యాప్తు చేయించాలి. 3) అనస్తీషియా విభాగం హెచ్‌ఓడీ, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి 4) కేఎంసీ ప్రిన్సిపాల్, అనస్తీషియా విభాగం హెచ్‌వోడీని అరెస్టు చేయాలి 5)విధిగా చార్జీషీట్లు వేసేలా చూడాలి. 6)చట్టప్రకారం దోషులకు మరణశిక్ష సహా అన్ని శిక్షలను ఖరారు చేయాలి. 7) బాధితురాలిపై ఆధారపడిన వారికి రూ. 10 కోట్ల నష్టపరిహారం, ఇతర సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి' అని కోరుతూ తెలంగాణ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.మల్లయ్య హైకోర్టుకు లేఖ రాశారు. ఈ లేఖను టేకెన్ అప్ పిల్‌గా హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టి ప్రతివాదులకు నోటీసలిచ్చింది.

కేసీఆర్.. గ్యాంగ్‌స్టర్లకే గ్యాంగ్‌స్టర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా క్లాక్‌టవర్ వద్దకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో బండి సంజయ్ మాట్లాడారు. 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్ నాశనానికి కారకులు కేసీఆర్ కుటుంబసభ్యులేనని.. ఆ కుటుంబ ప్రమేయంతోనే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకైందన్నారు. కేసీఆర్ కొడుకు కేటీఆర్‌ను బర్తరఫ్ చేసే దాకా, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపే దాకా, నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం ఇచ్చేదాకా ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

ఒక్క మార్క్ కోసం లీక్ చేస్తారా...

'నాకు జైలు కొత్తకాదు.. ఇప్పటికి తొమ్మిది సార్లు పోయిన'అని బండి చెప్పారు. మొన్న నిరుద్యోగుల పక్షాన కొట్లాడుతుంటే అర్ధరాత్రి అరెస్టు చేసి 8 గంటలు తిప్పారు.. నన్ను ఎటు తీసుకుపోతున్నరో అర్థం కాలేదు.. కేసీఆర్ ఫాంహౌస్ దగ్గరకు పోగానే అక్కడ నిమ్మకాయలున్నయ్.. కొంపదీసి నన్ను బలి ఇస్తారేమోననే అనే అనుమానం వచ్చింది.. అయినా భయపడలేదు. ఎవడైనా పదో తరగతి హిందీ పేపర్ లీక్ చేస్తారా.. 21 మార్కులొస్తే పాస్ అవుతారు.. అందులో 20 ఇంటర్నల్ మార్కులను టీచర్లే వేస్తారు.. ఒక్క మార్క్ కోసం ఎవడైనా లీక్ చేస్తాడా..'అని అన్నారు. ఒకవైపు రైతులు అకాల వర్షాలతో నష్టపోయి ఏడుస్తుంటే... మంత్రులు, ఎమ్మెల్యేలు డ్యాన్సులు చేస్తున్నారని బండి మండిపడ్డారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల సాయం చేస్తానని మాట చెప్పి మోసం చేశారని.. ఎకరాకు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

మీరంతా ఘర్ వాపసీ అక్కడికే: డీకే అరుణ

ప్రధాని ఘర్ వాపసీ కావాలని కేసీఆర్ మాట్లాడుతున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ధ్వజమెత్తారు. తెలంగాణను దోచుకున్నది చాలు.. ఇక దేశాన్ని దోచుకునేందుకు కేసీఆర్‌కు ఓటేయాల్నా అని ప్రశ్నించారు. దొంగ పాస్‌పోర్టులతో దుబాయ్ పంపుతానని మోసం చేసిన పాస్‌పోర్ట్ బ్రోకర్ కేసీఆర్ అని విమర్శించారు. మీరంతా ఘర్ వాపసీ అవుతారని, అక్రమంగా దోచుకున్న డబ్బులతో కర్ణాటక, బెంగాల్‌కు డబ్బులు పంపిస్తున్న మిమ్మల్ని కూడా ఆయా పార్టీల నేతలు మోసం చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ధ్వజమెత్తారు. ఇంటికో ఉద్యోగమిస్తానని కేసీఆర్ మోసం చేశారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి మండిపడ్డారు.



సభలో ప్రసంగిస్తున్న బండి సంజయ్. చిత్రంలో జితేందర్‌రెడ్డి, డీకే అరుణ తదితరులు

అరెస్టులకు షర్మిల భయపడదు

- ప్రజలు, నిరుద్యోగుల కోసం పోరాడుతుంది: వైఎస్ విజయమ్మ
- చంచల్‌గూడ జైల్లో షర్మిలకు పరామర్శ

చంచల్‌గూడ: పోలీసుల అత్యుత్సాహం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల జైలు పాలైందని ఆమె తల్లి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ మండిపడ్డారు. షర్మిల ఎవరికీ భయపడే వ్యక్తి కాదన్నారు, ఆడబిడ్డ అయినప్పటికీ 3,800 కి.మీ పాదయాత్ర నిర్వహించిందన్నారు. విజయమ్మ మంగళవారం చంచల్‌గూడ జైల్లో షర్మిలను ప్రత్యేక ములాఖత్‌లో కలిశారు. ఈ సందర్భంగా విజయమ్మ జైలు వద్ద మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించే వారి గొంతులు నొక్కుతున్నారని ధ్వజమెత్తారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో 30 లక్షల మంది నిరుద్యోగులు ఆందోళన చెందుతుంటే వారి కోసం పోరాడుతున్న షర్మిలను బంధించడం దుర్మార్గమన్నారు. గ్రూప్స్, టెన్త్ పరీక్ష పేపర్లు లీక్ అవుతుంటే అడగటం తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ సమావేశాలకు అనుమతిచ్చి షర్మిలను ఎందుకు ఇంట్లోంచి బయటకు రానివ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతుకల్ని అరెస్ట్ చేయడమే ప్రభుత్వ విధానంగా ఉందని, దీనిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. త్వరలో ప్రజలు కూడా తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించే రోజు వస్తుందన్నారు. ఆ పరిస్థితిని తెచ్చుకోవద్దని ప్రభుత్వానికి, పోలీసులకు హితవు చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయం దిశగా షర్మిల పోరాటం చేస్తోందని చెప్పారు.



చంచల్‌గూడ జైలు వద్ద విజయమ్మ తదితరులు

జైలు నుంచి షర్మిల విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల చేశారని ధ్వజమెత్తారు. తనను పరామర్శించడానికి వచ్చిన దివంగత సీఎం రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మతో కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. విజయమ్మను పోలీసులు బలవంతంగా వాహనం ఎక్కించే ప్రయత్నంలో పోలీసులపై అసహనం వ్యక్తం చేయగా.. దాడులు చేసినట్లు వక్రీకరిస్తున్నారన్నారు. తాను రాజశేఖరరెడ్డి బిడ్డనని, ఎంత అణగదొక్కాలని చూస్తే అంతే రెట్టింపు రోషంతో తెలంగాణ ప్రజల తరఫున పోరాడతానని చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి సతీమణిని అవమానించి, ఆయన బిడ్డను జైల్లో పెట్టిన కేసీఆర్ అనుభవిస్తాడన్నారు. గతంలో మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ పోలీసులను బూతులు తిట్టి, దాడులు చేశారని, అయినా అటువంటి వారిపై పోలీసులు కేసులు పెట్టరని దుయ్యబట్టారు. పోలీసులను గాయపరిచామని కమిషనర్ సీవీ ఆనంద్ చేసిన వ్యాఖ్యలను ఆమె తప్పుబట్టారు. వైఎస్సార్‌టీపీ అధ్వర్యంలో 'టీ-సేవ్' నిరుద్యోగ దీక్షను బుధవారం ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్నట్టు షర్మిల తెలిపారు. ఈ దీక్షలో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొంటాయన్నారు.



షర్మిలకు దిష్టి తీస్తున్న దృశ్యం

ఐటీ తగ్గేదేలే..

'మైత్రి' హీరోల బ్యాంకు ఖాతాలపై నజర్

- మైత్రి మూవీస్ కేసులో ఐటీ స్పీడు
- హవాలా మార్గంలో పెద్దమొత్తంలో డబ్బు చెల్లింపులపై కీలక ఆధారాల సేకరణ

సాక్షి, హైదరాబాద్: అక్రమ మార్గాల్లో పెట్టుబడులు తీసుకోవడం, పన్ను ఎగవేత వంటి ఆరోపణలపై మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కార్యాలయం, ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ ఇళ్లలో ఇటీవల తనిఖీలు చేపట్టిన ఐటీ అధికారులు ఇప్పుడు విచారణలో స్పీడ్ పెంచారు. తనిఖీల్లో లభించిన పత్రాలను ఆధారంగా చేసుకుని దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు తెలిసింది. మైత్రి మూవీ మేకర్స్ సంస్థతో కలిసి పనిచేసిన హీరోలకు భారీ మొత్తంలో చెల్లింపులపైనా దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. సదరు హీరోల బ్యాంకు లావాదేవీలను పరిశీలించనున్నట్టు సమాచారం. భారీ బడ్జెట్ సినిమాల పెట్టుబడుల కోసం విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్దమొత్తంలో డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఐటీ అధికారులు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే.

ముంబైలో కూడా తనిఖీలు

ముంబైకి చెందిన ఓ ఫైనాన్సియర్ హవాలా మార్గంలో తెచ్చిన డబ్బులను సినీ రంగంలో పెట్టుబడులకు వినియోగిస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఐటీ అధికారులు ముంబైలో తనిఖీ చేశారు. అందులో లభించిన ఆధారాల మేరకు టాలీవుడ్‌లోనూ పన్ను చెల్లింపుల్లో అక్రమాలపై అధికారులు దృష్టి పెట్టినట్టు సమాచారం. పెద్ద మొత్తంలో రెమ్యునరేషన్లు, అందుకు తగినట్టుగా పన్ను చెల్లింపులు చేయకపోవడం వంటి అంశాలపై ఆరా తీస్తున్న ఐటీ అధికారులు ప్రముఖ హీరోల లావాదేవీలను పరిశీలించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, తమ సంస్థలో తనిఖీల సందర్భంగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతల్లో ఒకరైన ఎర్నేని నవీన్ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

క్లుప్తంగా...

అమిత్‌షా ప్రకటనపై అంత గగ్గోలు ఎందుకు?

విపక్షాలకు బీజేపీ నేత కె.లక్ష్మణ్ ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మతపరమైన రిజర్వేషన్లు తొలగించి ఎస్సీ,ఎస్టీ, బీసీలకు పెంచుతామని కేంద్రహోం మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన పట్ల ఇతర రాజకీయపక్షాలన్నీ గగ్గోలు పెడుతూ బీఆర్ఎస్‌కు ఎందుకు వంతపాడుతున్నాయో అర్థం కావడం లేదని బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన బీఆర్ అంబేడ్కర్ మతపరమైన రిజర్వేషన్లు చెల్లవని చాలా స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. కేవలం ఓటుబ్యాంక్ రాజకీయాల కోసమే సీఎం కేసీఆర్ వంటి వారు కొనసాగిస్తున్న మతపరమైన రిజర్వేషన్లనే అమిత్‌షా తొలగిస్తామని చెప్పారని మంగళవారం ఓ ప్రకటనలో వివరించారు. తెలంగాణలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 34% ఉన్న రిజర్వేషన్లను కేసీఆర్ 12% దాకా తగ్గిస్తే ఇప్పుడు గగ్గోలు పెడుతున్న ప్రతిపక్షాలు నాడు నోరెందుకు మెదపలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌తో సహా మిగతా పార్టీలు ఓటుబ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీల పట్ల కపట ప్రేమ ప్రదర్శించడాన్ని ఖండిస్తున్నామన్నారు.

బీఆర్ఎస్‌కు మహారాష్ట్ర ప్రజల మద్దతు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి మహారాష్ట్ర ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తోందని హోంమంత్రి మహమూద్ అలీ చెప్పారు. మహారాష్ట్రలోని యావత్ మాల్ జిల్లా పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు మంగళవారం హోంమంత్రిని కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మహమూద్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలా మహారాష్ట్ర కూడా అభివృద్ధి చెందాలనే అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అందుకే వారు బీఆర్ఎస్‌లో చేరాలని చూస్తున్నారని అలీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆస్తుల పరిరక్షణకు కమిటీ: టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఆస్తులను పరిరక్షించేందుకు త్వరలోనే రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని టీపీసీసీ నిర్ణయించింది. ఏఐసీసీ కార్యదర్శి నితిన్ కుంభల్కర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం గాంధీభవన్‌లో సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆస్తుల వివరాల సేకరణకు త్వరలోనే జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించాలని, రాష్ట్ర స్థాయి కమిటీ ఆధ్వర్యంలో ఆ వివరాలను ఏఐసీసీకి పంపాలని నిర్ణయించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు కోదండరెడ్డి, నిరంజన్, కుమార్‌రావు, గడ్డం ప్రసాద్‌కుమార్, అడ్వకేట్ రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బండి సంజయ్ బెయిల్ రద్దు చేయండి..

పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదన

వరంగల్ లీగల్: పేపర్ లీకేజీ కేసులో బండి సంజయ్‌కి హనుమకొండ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని ప్రాసిక్యూషన్ పక్షాన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎం.సత్యనారాయణ గౌడ్ మంగళవారం నాలుగో మున్సిఫ్ కోర్టు జడ్జి మట్ట సరిత ఎదుట వాదనలు వినిపించా రు. బెయిల్ జారీ చేసిన సందర్భంగా కేసు విచారణ నిమిత్తం పోలీసులకు సహకరించాలని షరతు ఉన్నప్పటికీ సంజయ్ ఉల్లంఘిస్తు న్నారని అన్నారు, విచారణ నిమిత్తం పోలీసులకు తన సెల్‌ఫోన్ అందజేయాలని నోటీసు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు ఇవ్వలేదని, ఇది షరతులను ఉల్లంఘించడమేనని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సెల్‌ఫోన్‌లో జరిగిన సంభాషణలే కేసులో కీలకమని, అది ఇవ్వని కారణంగా కేసు విచారణలో పురోగతి లేదని, అందుకే బెయిల్ రద్దు చేయాలని కోరారు. అరెస్టు సందర్భంగా జరిగిన తోపులాటలో సంజయ్ సెల్‌ఫోన్ పోయిందని రిమాండ్ రిపోర్ట్‌లోనే పోలీసులు పేర్కొన్నారని, అది తన వద్ద లేదని సంజయ్ పక్షాన సీనియర్ న్యాయ వాది ఎల్.రవిచంద్ర కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తస్కరించిన సెల్‌ఫోన్ మీద సంజయ్ కరీంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారని, దానికి సంబంధించిన రసీ దును సైతం కోర్టులో దాఖలు చేశామని తెలిపారు. మరిన్ని వాదనల కోసం కేసును బుధవారానికి వాయిదా వేశారు.

మరో చరిత్రకు ముందడుగు

- పల్లెల ప్రస్థానం, చారిత్రక నేపథ్యంపై అక్షర యజ్ఞం
- 'మన ఊరి చరిత్రను మనమే తెలుసుకుందాం'తో కొత్త శకం
- బృహత్తర కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ శ్రీకారం

12,769 గ్రామాల చరిత్ర వెలికితీసే పనిలో

5,000 మంది విద్యార్థులు

వాళ్లంతా నల్లగొండ జిల్లా చిలుకూరు విద్యార్థులు. కోదాడ కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. తమ ఊరి చరిత్రను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఇటీవల గ్రామపెద్దలను కలిశారు. ఇక్కడ 1969లో ప్రారంభమైన గ్రంథాలయం ప్రజల్లో తెచ్చిన చైతన్యం గురించి తెలుసుకున్నారు. అదే ఊళ్లోని కాకతీయుల కాలం నాటి కోదాడ రామాలయ నిర్మాణం తీరును పరిశీలించారు. అందులోని కోనేరులో ఆలయ అవసరాలతో పాటు వ్యవసాయం కోసం నిర్మించిన మోట బావి విశేషంగా ఉంది. ఈ కోనేరు ప్రత్యేకతను విద్యార్థులు పట్టుకోగలిగారు. చెన్నకేశవాలయంలో పురాతన శాసనం ఒకటి ఉంది. పాత చారిత్రక గ్రంథాలను తీసి పరిశోధించాల్సి ఉందనే విషయాన్ని తెలుసుకున్నారు.

సాక్షి, సిటీడెస్క్

'చరిత్ర మరిచిన మనిషి పూడ్చిపెట్టిన శవం లాంటి వాడు'.. వర్తమానం నుంచి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు చరిత్ర ఎంతగానో దోహదపడుతుంది. సమాజ పురోగమనానికి బాటలు వేస్తుంది. రాతలు, శాసనాలు, కట్టడాలు, పురాతన ఆధారాల స్వరూపమే చరిత్ర. ఇప్పటివరకు తెలియని, ప్రాచుర్యంలోకి రాని ఘట్టాలను తెలుసుకునే అన్వేషణలో భాగంగానే తెలంగాణ రాష్ట్రావిర్భావం అనంతరం ప్రస్తుతం మొదలైంది. ఓ యజ్ఞంలా ముందుకు సాగుతోంది. అటువంటి ఆలోచనే 'మన ఊరి చరిత్రను మనమే తెలుసుకుందాం'ప్రాజెక్టు సర్వే. దీని ద్వారా మరుగునపడ్డ గత కాలపు వైభవాలు, జ్ఞాపకాలు, విశిష్టత, చారిత్రక నేపథ్యం బయటపడుతున్నాయి. ఆ బాధ్యతను ఇప్పటికే భుజానికెత్తుకున్న రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సరికొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ విశేషాలపై ప్రత్యేక కథనం.



సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామస్తులతో మాటామంతీ

రాష్ట్రంలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో చదువుతున్న అయిదు వేల మందికి పైగా విద్యార్థులు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ నల్లగొండలోని నాగార్జున కళాశాల వేదికగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామాల్లో చరిత్ర మూలాల కోసం శోధన జరుగుతోంది. క్షేత్రస్థాయికి వెళ్లి గ్రామపెద్దలు,

సర్వే ఎవరు చేస్తున్నారు?

(గ్రామపె)ద్దలు, వయోవృద్ధులు, గ్రామ పురోహితులు, స్వాతంత్ర్య సమర యోధులు, రెవెన్యూ అధికారులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఉన్న కవులు, రచయితలు, సామాజికవేత్తలు, మేధావులతో జూలూరి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇండియన్ విలేజ్.. ఓ ప్రేరణ

చారిత్రక అన్వేషణకు స్ఫూర్తి నింపింది ఇండియన్ విలేజ్ పుస్తకం. 1950–51లో అప్పటి ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ దూబే 15 మంది విద్యార్థులతో శామీర్‌పేటలో పర్యటించి అక్కడి సామాజిక అంశాలపై 'ఇండియన్ విలేజ్'పుస్తకాన్ని ప్రచురించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. ఆ గ్రంథమే నేటికీ సామాజిక శాస్త్రాలకు, గ్రామీణ ప్రాంతాలపై పరిశోధనకు కొలమానంగా నిలిచింది. దీని ప్రేరణతో రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ తెలంగాణ సాహిత్య అకాడమీ పల్లె బాట పట్టింది. గ్రామ చరిత్రల నిర్మాణానికి తెలంగాణ సాహిత్య అకాడమీ ఓ ప్రశ్నావళి రూపొందించింది. దీనికి అనుగుణంగా గ్రామ నైసర్గిక స్వరూపం, ఎప్పుడు ఏర్పడింది? కాలానుగుణ మార్పులు, ఊరికి పేరురావడానికి ప్రత్యేక కారణాలున్నాయా? అలనాటి అవశేషాలు, సామాజిక వర్గాల జీవనం ఎలా తదితర వివరాలు సేకరిస్తున్నారు.

అద్భుతమైన ఉద్యమం



విద్యార్థులు తమ ఊరు చరిత్ర తామే రాయడం ఓ మధురానుభూతి. నిజాం కాలం నుంచి ఇప్పటివరకు తెలంగాణ పల్లెల ప్రస్థానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. ఈ పరిశోధనకు సంబంధించి ఓ పుస్తకాన్ని తెచ్చేందుకు సమాయత్తమవుతున్నాం. పల్లెల్లోని మట్టి మూలాలను జల్లెడ పట్టి ప్రపంచానికి పరిచయం చేసేందుకు శరవేగంగా అక్షర యాత్ర సాగిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్ర సాహిత్య అకాడమీ పూనుకోని అద్భుతమైన ఉద్యమానికి మేము తెరలేపాం. భావితరాలకు ఇది కచ్చితంగా ఉపయోగపడుతుందని భావిస్తున్నా. ఈ ప్రాజెక్టు సక్సెస్‌కు కళాశాల విద్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

–జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్

ఆనందంగా ఉంది

పూర్వం బూరుగడ్డ గ్రామాన్ని శాల్మీల కందపురంగా పిలిచేవారు. శాల్మీల కంద అనగా భృగు చెట్టు. పూర్వం భృగు మహర్షి తపస్సు చేసిన ప్రదేశం కావడంతో ఈ గ్రామానికి భృగు గడ్డ అనే పేరు వచ్చింది. కాలక్రమేణా బూరుగడ్డగా మారింది. ఇక్కడి శాల్మీల కందలో ఆది వరాహ లక్ష్మీ నరసింహ వేణుగోపాల స్వామి ఆలయాన్ని 1172లో నిర్మించారు. దీని గర్భగుడిలో ఒకే పీఠంపై వరాహస్వామి, లక్ష్మీ నరసింహ స్వామి, వేణుగోపాల స్వామి కొలువై ఉండటం ప్రత్యేకత. – విష్ణు, డిగ్రీ ఫైనల్ ఇయర్, కోదాడ

ఇదో గొప్ప అవకాశం



'మన ఊరు చరిత్ర మనమే తెలుసుకుందాం'లో భాగంగా ప్రాజెక్ట్ సూర్యాపేట జిల్లా సమన్వయకర్తగా ఉన్నాను. మా కాలేజీలోని ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఊరి చరిత్రను తెలుసుకోవడంలో భాగస్వాములయ్యారు. గ్రామాల రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పోరాట చరిత్రను వెలికితీసే క్రమంలో భాగస్వామ్యం కావడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను.

–డా. నిర్మల కుమారి, ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్, కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోదాడ

జాతీయస్థాయిలో యుద్ధం చేస్తున్నాం

- కేసీఆర్‌ను దేశమంతా ఆమోదిస్తుంది
- గోల్‌మాల్ గుజరాత్ కాదు.. గోల్డెన్ తెలంగాణ
- సిరిసిల్ల బీఆర్ఎస్ ప్లీనరీలో మంత్రి కె.తారకరామారావు



దేశపతి శ్రీనివాస్‌కు భోజనం వడ్డిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: 'జాతీయస్థాయిలో మనం ఇప్పుడు యుద్ధం చేస్తున్నాం. తెలంగాణలో అన్ని పార్లమెంట్ సీట్లు గెలిచి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలి'అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నాలుగు లక్షల నుంచి ఐదు లక్షలమంది కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీలు నిర్వహిస్తోందని, దేశమంతా సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ఆమోదిస్తోందని కేటీఆర్ అన్నారు. మహారాష్ట్రలో అంటుకున్న బీఆర్ఎస్ అగ్గి దేశమంతా వ్యాపించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను దహించి వేస్తుందన్నారు. 'రాష్ట్రంలో మాకు పోటీలేదు, పోటీ ఉంటే సమఉజ్జీలతో ఉండాలి కానీ, ఈ మరుగుజ్జులతో కాదు. ఒక్కరేమో బ్రెయిన్‌లేని బంటి, మరొకరేమో పార్టీలు మారే చంటీ'అంటూ ఎద్దేవా చేశారు. 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పెట్టడం, రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో దేశమంతా జై భీమ్ అంటోందన్నారు. 2010 నుంచి గుజరాత్ మోడల్ అంటూ.. నరేంద్రమోదీ ఉత్త ప్రచారం చేసుకున్నారని, గోల్‌మాల్ గుజరాత్ కాదు. రైతుబంధు, రైతుబీమాతో గోల్డెన్ తెలంగాణగా మారిందన్నారు.

తెలంగాణ పల్లెలకు జాతీయగుర్తింపు

దేశజనాభాలో 3 శాతం ఉన్న తెలంగాణ జాతీయ స్థాయిలో 30 శాతం అవార్డులు సాధించిందని కేటీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో అమలు చేసిన పల్లెప్రగతి, పట్టణప్రగతి, పంచాయతీరాజ్ చట్టం–2018తోనే ఇది సాధ్యమైందన్నారు. 75 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం ఎనిమిదేళ్లలో సీఎం కేసీఆర్ సాధించారని, ఫలితంగా తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శమయ్యాయన్నారు. మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశానికి బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, 'సెస్'చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

భారీవర్షంతో మధ్యలో ఆగిన ప్లీనరీ

సిరిసిల్ల ప్లీనరీలో 12 తీర్మానాలు ప్రవేశపెట్టాల్సి ఉండగా.. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో భారీ గాలి, వానతో కూడిన వర్షం పడటంతో 10 తీర్మానాలు మాత్రమే ప్రవేశపెట్టారు. గాలి, వానలోనూ సమావేశాన్ని కొనసాగిస్తుండగా సభావేదిక కిందకు వర్షపునీరు చేరింది. దీంతో వేదిక కుంగినట్లు కావడంతో సమావేశాన్ని మధ్యలో నిలిపివేశారు.

అమాత్యుడి మాటల్లో ఆంతర్యం ఏమిటో!

- తనకు రాజకీయాలంటే ఇష్టం లేదంటూ మంత్రి ఇంద్రకరణ్ వ్యాఖ్యలు



భావోద్వేగానికి గురైన మంత్రి అల్లోల

నిర్మల్: 'ఇంత వయసొచ్చినందున ఇక రాజకీయాలంటే ఇష్టం లేదు. భవిష్యత్తులో ఎవరైన వచ్చి నిల్చున్నా అభ్యంతరం లేదు'అంటూ బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ప్రతినిధుల సమావేశంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పనితీరు, పథకాల గురించి చెబుతూ నిర్మల్ రుణం తీర్చుకునేందుకు ఎన్నో పనులు చేశామన్నారు. ఈ క్రమంలో ఇంత వయసొచ్చినందున ఇక రాజకీయాలంటే ఇష్టంలేదని, రేపొద్దున ఎవరొచ్చి నిల్చున్నా తనకు అభ్యంతరం లేదన్నారు. దీంతో ఒక్కసారిగా స్టేజీపై, సభలో ఉన్న నాయకులు, కార్యకర్తలు 'ఐకేరెడ్డి జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. అందరూ స్టేజీ వద్దకు వెళ్లి మంత్రికి అండగా ఉంటామని చెప్పారు ఈ క్రమంలో కాసేపు ఇంద్రకరణ్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. కాగా, ఇటీవలే సీనియర్లు శ్రీహరి రావు, సత్యనారాయణగౌడ్ అసమ్మతివర్గంగా తయారు కావడం, కాంగ్రెస్ నేత మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరడం, మరోవైపు బీఆర్ఎస్ నుంచి జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడం, పలువురు కౌన్సిలర్లనూ బీజేపీ టార్గెట్ చేసిన నేపథ్యంలో మంత్రి ఇలా మాట్లాడి ఉంటారన్న చర్చ జరుగుతోంది.

బీజేపీ, బీఆర్ఎస్‌లవి లాలూచీ రాజకీయాలు

- అమిత్‌షా మైనార్టీ రిజర్వేషన్ల రద్దు ప్రకటనపై బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడదు?
- మౌనం వెనుక మతలబు ఏమిటో బీఆర్ఎస్, ఎంఐఎం చెప్పాలి
- వరంగల్ పర్యటనలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



విలేకరులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్, బీజేపీలు మళ్లీ అధికారంలోకి రావడానికి ఇప్పటినుంచే అడ్డదారులు తొక్కుతున్నాయని, అడుగడుగునా లాలూచీ రాజకీయాలకు పాల్పడుతున్నాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. 'ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తే.. వీరి కోటాను 12 శాతానికి పెంచుతామని ప్రకటించిన సీఎం కేసీఆర్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఎందుకు ఖండించడం లేదు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంతో బీఆర్ఎస్, ఎంఐఎంలకు ఉన్న ఒప్పందం ఏంటి?'అని భట్టి వ్యాఖ్యానించారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ ఇప్పటివరకు ఖండించకపోవడం దురదృష్టకరమని, ఇలా ప్రతీ సందర్భంలో బీజేపీతో బీఆర్ఎస్ లాలూచీ పడుతోందని మండిపడ్డారు. హాథ్‌సే హాథ్ జోడో పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం హనుమకొండలో కాకతీయ వర్సిటీలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన అనంతరం భట్టి విలేకరులతో మాట్లాడారు.

బర్రెలు, గొర్రెలు ఇస్తే సరిపోతుందా?

అమిత్ షా వ్యాఖ్యలపై కేసీఆర్ నోరు విప్పకపోవడం వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలు, ఆర్థిక దోపిడీ కారణాలని భట్టి ఆరోపించారు. కేసీఆర్ చేసిన తప్పిదాలు రాష్ట్ర అభివృద్ధికి గుదిబండగా మారాయని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులను కేంద్రం వద్ద గట్టిగా మాట్లాడలేకపోవడానికి ఈ తప్పిదాలే కారణమన్నారు. వందల సార్లు ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్ మనకు రావాల్సిన హక్కులను అడగకుండా స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర పునర్విభజన హక్కులను పణంగా పెడుతున్నారని ధ్వజమెత్తారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం పేర్ల మీద అప్పు చేసి పెట్టిన ఐదు లక్షల కోట్లతో రాష్ట్ర ప్రజలకు చిన్న ఫలితం కూడా రాలేదని ఆరోపించారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం నిధులు ఇవ్వకుండా బర్రెలు, గొర్రెలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? అని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన క్రమంలో తెలంగాణలో రెండో రాజధాని అయిన వరంగల్ అభివృద్ధి చెందుతుందని ఆశించామని, అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉందన్నారు.

కేసీఆర్ ఆకుపచ్చ చరిత్రను రాశారు

- బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం
- బీఆర్ఎస్ ప్లీనరీలో మంత్రి హరీశ్‌రావు ధీమా
- గవర్నర్ తీరు బాగాలేదని విమర్శ



మంత్రి హరీశ్‌రావుకు నాగలిని బహూకరిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సాక్షి, సిద్దిపేట/గజ్వేల్: చరిత్రను కొందరు సిరాతో, మరికొందరు రక్తంతో రాస్తే.. తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతు నాగలితో ఆకుపచ్చ చరిత్ర రాశారని.. దీనికి ప్రధానం కాళేశ్వరమని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్ సమీపంలో మంగళవారం నిర్వహించిన సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ప్లీనరీలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కనీసం మూగ జీవాలకు కూడా గ్రాసంలేని దుస్థితి ఉండేదని.. నేడు పది రాష్ట్రాలకు తిండిపెట్టే ధాన్యాన్ని తెలంగాణ రైతులు పండిస్తున్నారని చెప్పారు. మన రైతు బంధును కాపీ కొట్టి పీఎం కిసాన్‌నిధి పేరుతో కేంద్రం అమలు చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని ట్రిక్కులు చేసినా... రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

ఉదయం కేసు వేస్తే.. సాయంత్రం ఫైల్ వెనక్కి పంపుతారా?

యూనివర్సిటీల్లో నియామకాల కోసం ఉద్దేశించిన కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఫైల్ ఆమోదించకుండా ఏడు నెలలుగా తొక్కిపెట్టిన గవర్నర్.. సుప్రీంకోర్టులో కేసు వేస్తున్నారని తెలిసి సాయంత్రం బిల్లులు వెనక్కి పంపడంలో కుట్ర స్పష్టంగా బయటపడిందని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఫైల్‌ను వెనక్కి పంపడానికి గవర్నర్‌కు ఏడు నెలలు కావాలా? అని ప్రశ్నించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఫారెస్ట్రీ యూనివర్సిటీ ఫైల్‌ను సైతం ఆమోదించకుండా తొక్కిపెట్టి ఏడు నెలల తర్వాత వెనక్కి పంపడం అభివృద్ధిని అడ్డుకోవడం కాదా? అని మంత్రి నిలదీశారు.

పండుగలా ప్లీనరీలు..

▶ మొదటి పేజీ తరువాయి



హాజరయ్యారు. మిర్యాలగూడలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, బాన్సువాడలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో జరిగిన సభల సమాచారాన్ని పార్టీ వర్గాలు సేకరించాయి. తాండూరు, స్టేషన్ ఘనపూర్, రామగుండంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో అసంతృప్త నేతలు ప్రతినిధుల సభలకు దూరంగా ఉన్నారు. ఆహ్వానం అందలేదని కొందరు దూరంగా ఉండగా, ఆహ్వానం అందినా హాజరు కావడం ఇష్టం లేక మరికొందరు దూరంగా ఉన్నట్టు సమాచారం.

కేంద్రం, బీజేపీ తీరుపై ఘాటు విమర్శలు

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ప్రతినిధుల సభల్లో తీర్మానాలు చేశారు. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు, సచివాలయానికి ఆయన పేరు తదితర నిర్ణయాలను స్వాగతించారు. మరోవైపు తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్ష, బీజేపీ విధానాలు, వైఫల్యాలను ఎత్తి చూపుతూ తీర్మానాలు ఆమోదించారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని విపక్ష పార్టీల ప్రభుత్వాలను ఇబ్బంది పెడుతున్న తీరు, ఈడీ, సీబీఐ వంటి సంస్థల ద్వారా వేధించడం తదితరాలను ఖండిస్తూ తీర్మానాలు చేశారు. ప్రతినిధుల సభల్లో ఆరు అంశాలపై తీర్మానాలు చేయాలని కేటీఆర్ సూచించగా, స్థానిక పరిస్థితుల ఆధారంగా ఒక్కోచోట 10 నుంచి 15 వరకు తీర్మానాలు జరిగాయి. బీఆర్ఎస్ నేతలు తమ ప్రసంగాల్లో కేంద్రం, బీజేపీ తీరును తీవ్ర పదజాలంతో ఎండగడుతూ ఘాటు విమర్శలు చేశారు.

పార్టీ యంత్రాంగానికి కేటీఆర్ ధన్యవాదాలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రతినిధుల సభలను అద్భుతంగా నిర్వహించిన పార్టీ యంత్రాంగానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ సభలను ఆత్మీ య వాతావరణంలో, క్రమశిక్షణతో నిర్వహించిన పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ పరిశీలకులను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ రాష్ట్ర ప్లీనరీ తరహాలో పకడ్బందీగా ఒకేరోజు 119 నియోజకవర్గాల్లో దాదాపు నాలుగు లక్షల మంది కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం దేశ చరిత్రలోనే మైలు రాయి వంటిదని అన్నారు. ఈ సభల్లో చర్చించిన అంశాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

చాకిరీ మాది... పదవులు మీకా?

- టీపీసీసీ బీసీ నేతల ఆగ్రహం... గాంధీభవన్‌లో కీలక సమావేశం
- మేమెవరికీ వ్యతిరేకం కాదు... మా కోటా సీట్లు మాకివ్వండి
- ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో 3 అసెంబ్లీ సీట్లు బీసీలకు ఇవ్వాల్సిందే
- రాష్ట్రంలో బీసీల ఓట్ల వివరాలు సోనియా, రాహుల్‌కు పంపాలని నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న వీహెచ్, పొన్నాల, చెరుకు సుధాకర్, అనిల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యమివ్వడం ద్వారానే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, 51కి తగ్గకుండా తమకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని టీపీసీసీ బీసీ నేతల సమావేశం డిమాండ్ చేసింది. 'అగ్రవర్ణాల నేతలకు టికెట్లు ఇప్పటికే ఖరారయ్యాయి. వారంతా వారివారి నియోజకవర్గాల్లో పనిచేసుకుంటున్నారు. మరి, బీసీ నేతలకు టికెట్లు ఎప్పు డు ప్రకటిస్తారు? చాకిరీ మాది..సీట్లు, పదవులు మీకా? సమీకరణల పేరుతో ప్రతీసారి ఆఖరి నిమిషంలో టికెట్లు ఇస్తున్నారు. అలాకాకుండా 6 నెలల ముందే అభ్యర్థులను ప్రకటించాలి. అప్పుడే నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో పనిచేసుకునే అవకాశం లభిస్తుంది'అని సమావేశంలో పలువురు నేతలు వ్యాఖ్యానించారు. పార్టీలోని ఏ ఒక్క సామాజిక వర్గానికి తాము వ్యతిరేకం కాదని, కానీ జనా భా ప్రాతిపదికన తమ కోటా సీట్లు, పార్టీ పదవులు తమ కు ఇవ్వాల్సిందేనని ఉద్ఘాటించారు. పీసీసీ మాజీ అధ్య క్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీపీ సీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యల నేతృత్వంలో మంగళ వారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ బీసీ నేతల సమావేశం జరిగింది. ఇందులో 100 మందికిపైగా బీసీ నేతలు పాల్గొన్నారు.

1% జనాభా లేని వారితో సమానంగా టికెట్లా?: సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, పార్టీలో తమ వర్గాలకు ప్రాధాన్యమివ్వాలని అటు ఏఐసీసీ, ఇటు టీపీసీసీలను కోరారు. ప్రతి పార్లమెంటు స్థానంలో కనీసం 3 అసెంబ్లీ స్థానాల చొప్పున 51కి తగ్గకుండా మెజార్టీ కులాలకు టికెట్లు కేటా యించాలని ప్రతిపాదనలు చేశారు.రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో 30–32 సీట్లకే బీసీలను సరిపెడుతున్నారని, 1% జనాభా లేని వారితో సమానంగా టికెట్లు ఇస్తున్నార న్నారు. బీసీల గురించి మాట్లాడితే తొక్కేస్తారనే భయం ఇప్పటికీ పార్టీలో ఉందని, పార్టీ పదవుల కేటాయింపులో మార్పు రావాలని చెప్పారు.

జిల్లాల వారీగా సమావేశాలు: దేశవ్యాప్తంగా బీసీ కులాలకు ప్రాధాన్యమివ్వాలన్న పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఓబీసీల జనగణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తామని, పార్టీలో బీసీలకు తగిన ప్రాధాన్యమిస్తామని వెల్లడించిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపే తీర్మానాన్ని ఆమోదించారు. బీసీలకు పెద్దపీట వేసిన కాంగ్రెస్‌ను దెబ్బతీయాలన్న ఆలోచనతో రాహుల్ ఓబీసీలను కించపర్చారంటూ బీజేపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీసీల పట్ల కాంగ్రెస్ వైఖరిని ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. టీపీసీసీ ఆధ్వర్యంలో బీసీ గర్జన సభనిర్వహణపై మరోసారి సమావేశమై దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఉన్న బీసీ కులాల జనాభా, ఓట్ల వివరాలతో కూడిన నివేదికను సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గేలకు అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్, పార్టీ నేతలు శ్యాంమోహన్ పాల్గొన్నారు.

బ్రీతింగ్ ఎనలైజర్‌తో మందుబాబు పరారీ

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఆగని కారు.. కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

మిర్యాలగూడ అర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు మందుబాబులు చుక్క లు చూపించారు. కారులో ఉన్న వ్యక్తికి బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తుండగానే.. వాహనాన్ని వేగంగా ముందుకు నడిపడంతో.. ఆపడానికి ప్రయత్నించిన కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. మిర్యాలగూడ హనుమాన్‌పేట జంక్షన్ ఫ్లై ఓవర్ సమీపంలో ట్రాఫిక్ ఎస్‌ఐ కోటేష్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. వాహన చోదకులకు బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహిస్తూ.. మందుబాబులకు చలానా రాస్తున్నారు. ఇదే సమయంలో రోడ్డుపై వచ్చిన తెల్లని స్విఫ్ట్ డిజైర్ కారును ఆపి.. డ్రైవర్ సీట్లో కూర్చున్న వ్యక్తికి బ్రీతింగ్ ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేసేందుకు కానిస్టేబుల్ లింగారెడ్డి వెళ్లారు. ఈ క్రమంలో కారు లోని వ్యక్తి బ్రీతింగ్ ఎనలైజర్‌ను లాక్కొని కారును వేగంగా నడపడంతో.. అతన్ని పట్టుకునేందుకు కానిస్టేబుల్ లింగారెడ్డి కారు తలుపును వేలాడారు. కానీ కారు డ్రైవర్ వేగం పెంచి సుమారు 50 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లడంతో కిందపడిన లింగారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఇదంతా చూస్తున్న తోటి సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కారును పట్టుకునేందుకు వెంబడించగా.. గుంటూ రు వైపు వెళ్లింది. గాయపడిన కానిస్టేబుల్ లింగారెడ్డిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రధాన రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ పేర్కొన్నారు.



మౌనంగా ఉన్నాడని నిందిస్తారు, ఎక్కువ మాట్లాడుతున్నాడని నిందిస్తారు, తక్కువ మాట్లాడుతున్నాడని నిందిస్తారు. ఈ ప్రపంచంలో నిందలకు గురికాకుండా ఎవరూ ఉండరు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 26 ఏప్రిల్ 2023

జలపథంలో... తొలి పదం

దేశచరిత్రలోనే ఇది తొట్టతొలి ప్రయత్నం. మనిషికి ప్రాణావసరమైన జల వనరులు ఎక్కడెక్కడ, ఎంతెంత, ఎలా ఉన్నాయని లెక్కలు తేల్చిన ఘట్టం. మానవ తప్పిదాల వల్ల క్షీణిస్తున్న నీటి వసతులను ఎంత జాగ్రత్తగా కాపాడుకోవాలో మరోసారి గుర్తు చేసిన జలగణన యజ్ఞం. కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల విడుదల చేసిన భారత జలవనరుల తొలి గణన అనేక విధాల కీలకమైనది అందుకే. దేశంలో అటు ప్రకృతి సహజమైన, ఇటు మానవ కల్పితమైన చెరువులు, సరస్సులు, నీటి కుంటల సమగ్ర సమాచారాన్ని ఈ లెక్కలు తొలిసారిగా ముందుకు తెచ్చాయి. దేశంలో ఈ జల వనరులు ఏ మేరకు ఆక్రమణకు గురైనదీ తేల్చాయి. సమస్త జీవరాశి మనుగడ కొనసాగాలంటే... ప్రతి నీటి చుక్కా కీలక సమకాలీన సందర్భంలో కేంద్రశాఖ నిర్వహించిన ఈ జలవనరుల గణన ఆహ్వానించదగ్గ యత్నం.

ప్రతి ఇంటికీ సురక్షిత మంచి నీటిని అందిస్తామని పాలకులు పదే పదే సంకల్పం చెప్పుకుంటున్న వేళ ఈ నీటి వసతుల సమగ్ర సమాచారం ప్రాధాన్యం సంతరించుకుంది. చెరువులు, రిజర్వాయర్లు, సరస్సులు – ఇలా జలవనరులు వివిధ రకాలు. కాగా, వాగులు, నీటి చెలమలు, గృహ సముదాయాలు – ఇతర ప్రాంతాల నుంచి చేరిన వర్షపునీళ్ళు, ఏదైనా నది – వాగుల నుంచి దారి మళ్ళించడం ద్వారా నిల్వచేసిన నీళ్ళు, మంచు కరగడంతో ఏర్పడ్డ నీటి వసతి... ఇలాంటివన్నీ కూడా నీటి వనరులేనని ఈ తొలి జలగణన నివేదిక నిర్వచించింది. వ్యవసాయం, చేపల పెంపకం, ఆధ్యాత్మికత – ఇలా రకరకాల ప్రయోజనాల కోసం నీటిని నిల్వ చేసినవాటిని జాబితాకు ఎక్కించింది. 2018–19లో చేసిన ఈ గణన దేశం మొత్తం మీద 24 లక్షలకు పైగా జలవనరులు ఉన్నాయని తేల్చింది. వీటిలో 97.1 శాతం గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే, 2.9 శాతమే పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. నీటి వసతుల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న భారీ అంతరాలను ఈ జల నివేదిక ఎత్తిచూపింది.

ఈ లెక్కల్లో దేశంలోకెల్లా అత్యధికంగా 7.47 లక్షల జలవనరులతో పశ్చిమ బెంగాల్ ప్రథమ స్థానం దక్కించుకోగా, దేశంలోనే అత్యధిక జనాభాకు నిలయమైన ఉత్తర ప్రదేశ్ కేవలం 2.5 లక్షల నీటివనరులతో రెండో స్థానంలో నిలిచింది. బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా ఏకంగా 3.55 లక్షల నీటి వనరులతో దేశంలోనే ముందుంది. అలాగే, దేశంలోని నీటి వనరుల్లో దాదాపు 63 శాతం పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో నెలకొన్నాయి. బెంగాల్‌లో నీటి మడుగులు, రిజర్వాయర్లు, ఆంధ్రప్రదేశ్‌లో చెరువులు, తమిళనాట సరస్సులు ఎక్కువని ఈ నివేదిక తేల్చింది. అదే సమయంలో దాదాపు 1.6 శాతం మేర, అంటే 38 వేలకు పైగా వనరులు కబ్జాకు గురయ్యాయట. ఈ కబ్జాలో 40 శాతం వాటా యూపీదే అన్నది నివేదిక సారాంశం.

నిజానికి, 1986 నుంచి అయిదేళ్ళకోసారి కేవలం చిన్న నీటిపారుదల వసతుల లెక్కలను కేంద్రం చేపడుతూ వచ్చింది. అందులో ప్రధానంగా ప్రభుత్వ సంస్థల జనాభా లెక్కల నుంచి సేకరించిన డేటాను సంకలనం చేస్తూ వచ్చింది. అయితే, ప్రభుత్వాలు ఒకప్పుడు నీటి వసతులను కేవలం వ్యవసాయ, ఆర్థిక ప్రయోజనాల్లో భాగంగానే చూస్తూ వచ్చాయి. ఆ దృక్కోణం గత రెండు దశాబ్దాల్లో మారింది. మానవ, పర్యావరణ సంక్షేమానికి జలవనరుల ప్రాధాన్యాన్ని గ్రహించి, పాత తప్పును సరిదిద్దుకొనే పనిలో ప్రభుత్వాలు పడ్డాయి. 2005లోనే కాంగ్రెస్ సారథ్యంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం 'జలవనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ పథకం' చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువుల లాంటి సాంప్రదాయిక నీటివసతులకు మళ్ళీ ఊపిరిపోసే పని చేపట్టింది. అయితే, సమగ్ర సమాచార లేమి వల్ల ఈ పథకాల లక్ష్యాలు ఏ మేరకు సిద్ధించాయో చెప్పలేని పరిస్థితి. తాజా జలగణన ముఖ్యత్వం సంపాదించుకున్నది అక్కడే.

ఆఖరుసారి 2013–14లో చేసిన చిన్న నీటిపారుదల వసతుల సర్వేతో పోలిస్తే, తాజా గణనలో నీటి వసతుల సంఖ్య 5 రెట్లు పెరగడం విశేషం. పట్టణప్రాంత చెరువులు, కుంటల వివరాలపై పౌరసంస్థలు, విద్యాకేంద్రాలే గళమెత్తేవి. వాటి క్రియాశీలత వల్లే చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, శ్రీనగర్, అహ్మదాబాద్ లాంటి నగరాల్లో చెరువులు కనుమరుగవుతున్న తీరు కొంతైనా జనం దృష్టికి వచ్చింది. ఇప్పుడు నేరుగా ప్రభుత్వమే జలగణనతో రంగంలోకి వచ్చింది గనక పరిస్థితులు మరింత మెరుగవుతాయని చిన్న ఆశ. గమనిస్తే, ఒకప్పుడు పుష్కలంగా నీళ్ళున్న భారతావని ఇవాళ అధిక జనాభా, పట్టణీకరణతో నీటి కొరత దిశగా జారిపోతోంది. దీనికి తక్షణం పగ్గం వేయాలి.

ప్రపంచంలో 18 శాతం జనాభాకు నెలవైన మన దేశంలో ఉన్న నీటి వనరులు 4 శాతమే. అవసరాలు ఎక్కువ, అందుబాటులో ఉన్న నీరు తక్కువ గనక నీటి కోసం ఒత్తిడీ అధికమే. దానికి తోడు పర్యావరణ మార్పుల ప్రభావం నీటి వసతులు, వాటి నాణ్యత, నిర్వహణ పైన గణనీయంగా పడుతోంది. ఈ పరిస్థితుల్లో జనగణన లాగానే క్రమం తప్పకుండా జల వనరుల గణన చేయడం అవసరం. పదేళ్ళకోసారి చేసే జనాభా లెక్కల లాగా కాక, వీలైనంత తరచుగా ఈ నీటి లెక్కలు తీయాలి. ప్రతి సుస్థిర అభివృద్ధి లక్ష్యానికీ, నీటికీ లంకె ఉంది గనక దీంతో నీటి నిర్వహణను మెరుగుపరుచుకొనే వీలు చిక్కుతుంది. అలాగే పట్టణ నిర్మాణం, విస్తరణల్లో పాలకులు సరైన నిర్ణయాలు చేయడానికీ నీటి వసతుల వివరాలు దోహదపడతాయి. స్థానిక సంస్థలను, పౌరసమాజ బృందాలను కూడా ఈ జలగణనలో భాగస్థుల్ని చేస్తే మెరుగైన ఫలితాలొస్తాయి. ఆ దిశగా ఈ నివేదిక తొలి అడుగు. మేలైన ముందడుగు.

రష్యాపై ఎందుకీ తటస్థ వైఖరి?

విశ్లేషణ



జోస్ కబల్లెరో

రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని నిర్మించే ప్రయత్నాలు నిలిచిపోయాయి. ఒకప్పుడు ఉక్రెయిన్ అనుకూల వైఖరిని తీసుకున్న దేశాలు కూడా రష్యాకు అనుకూలంగానో, తటస్థంగానో మారిపోయాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలోని అలీనోద్యమం నుంచి ప్రస్తుత జాగరూకత, తటస్థ వైఖరి ప్రభావితమయ్యాయి. తమ నిబంధనల మేరకు వ్యవహరించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ అలీనోద్యమం ఒక మార్గం కల్పించింది. నిర్దిష్ట ఆర్థిక, రాజకీయ ప్రోత్సాహకాలు కూడా ఇందులో ప్రభావం చూపుతున్నాయి. అయితే, అలీన దేశాలకు మానవతా సాయం అందించాలన్న పాశ్చాత్య దేశాల నిబంధనల వెలుగులో ఈ తటస్థత అనేది ఒక 'గమ్మత్తయిన సంతులన చర్య'గా మారుతోంది.

ఉక్రెయిన్ యుద్ధం మొదలై ఏడాది దాటిన తర్వాత, రష్యాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని నిర్మించే ప్రయత్నాలు నిలిచిపోయినట్లు కనిపిస్తోంది. చాలాదేశాలు తటస్థతను ఎంచుకోవడమే దీనికి కారణం. కొన్ని ఆధారాల ప్రకారం, రష్యాను ఖండిస్తున్న దేశాల సంఖ్య కూడా ప్రస్తుతం తగ్గిపోయింది. ఉక్రెయిన్ అనుకూల వైఖరి నుండి బోట్స్‌వానా రష్యా పైవు మళ్లింది. దక్షిణాఫ్రికా, తటస్థత నుంచి రష్యా అనుకూల వైఖరి చూపుతోంది. రష్యా చర్యను ఖండించిన కొలంబియా ఇప్పుడు తటస్థ వైఖరి అవలంబిస్తోంది. అదే సమయంలో, చాలా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వడానికి అయిష్టత చూపుతున్నాయి.

ఆఫ్రికాను తీసుకుందాం. మాస్కో తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని ఆఫ్రికన్ యూనియన్ పిలుపునిస్తున్నప్పటికీ, అనేక ఆఫ్రికా ఖండ దేశాలు తటస్థంగానే ఉంటున్నాయి. ఇది ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి వామపక్ష అనుకూల ప్రభుత్వాల సంప్రదాయ ఫలితమేనని కొందరు పరిశీలకులు వాదిస్తు న్నారు. ఆఫ్రికా దేశాల అయిష్టతకు మూలం తమ అంతర్గత వ్యవహారాల్లో కొన్నిసార్లు రహస్యంగా, కొన్నిసార్లు బహిరంగంగా పాశ్చాత్య దేశాలు పాటించిన జోక్యందారీ చరిత్రలో ఉందని మరికొందరు చెబుతున్నారు.

రష్యాను ఖండించడానికి అయిష్టత చూపడం అనేది ఆఫ్రికాను దాటిపోయింది. రష్యా బేషరతుగా, తక్షణం ఉక్రెయిన్ నుంచి వెళ్లిపోవాలంటూ ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాన్ని 2023 ఫిబ్రవరిలో లాటిన్ అమెరికన్ దేశాల్లో చాలావరకు బలపర్చాయి. ఉక్రెయిన్ కి అనుకూలంగా ఐక్యరాజ్యసమితి చేసిన పలు తీర్మానాలను బ్రెజిల్ బలపర్చినప్పటికీ, అది రష్యాను నిర్ద్వంద్వంగా ఖండించలేదు. ఐక్యరాజ్య సమితిలో బొలీవియా, క్యూబా, ఎల్ సాల్వడార్, వెనిజులా దేశాల వైఖరిని చూద్దాం. పాశ్చాత్య దేశాల ఆంక్షలను రష్యా తిప్పికొట్టాలని అవి సూచించాయి. పైగా, బ్రెజిల్, అర్జెంటీనా, చిలీ దేశాలు ఉక్రెయిన్‌కు సైనిక సహాయం చేయాలన్న పిలుపును తిరస్కరించాయి. ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు అందించాలని జర్మనీ తీసుకున్న నిర్ణయాన్ని మెక్సికో ప్రశ్నించింది.

ఆసియాలోనూ ఇదే రకమైన విభజనలు కనిపిస్తున్నాయి. జపాన్, దక్షిణ కొరియా బహిరంగంగానే రష్యాను ఖండించాయి. కానీ ఆగ్నేయాసియా దేశాల కూటమి సామూహికంగా ఈ ఖండన చేయలేదు. ఇక చైనా విషయానికొస్తే – రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యం నెరపుతూనే, ఐక్యరాజ్యసమితిలో పెరుగుతున్న తన ప్రాభవం ద్వారా సమతుల్యత సాధించేలా వ్యవహరిస్తోంది. భారత్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యదేశంగా ఉన్నప్పుడు, ఉక్రెయిన్ ఘర్షణపై జరిగిన ఓటింగుకు గైర్హాజరైంది.

ప్రచ్ఛన్న యుద్ధకాలంలోని అలీనోద్యమం నుంచి ప్రస్తుత జాగరూకత, తటస్థ వైఖరి ప్రభావితమయ్యాయి. తమ నిబంధనల



మేరకు ఘర్షణతో పోరాడటానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు అలీనోద్యమం ఒక మార్గం కల్పించింది. అందువల్ల సోవియట్ యూనియన్, పాశ్చాత్య దేశాల ప్రభావ పరిధికి వెలుపల విదేశీ విధానంలో స్వయంప్రతిపత్తిని ఈ దేశాలు పొందగలిగాయి.

యూరోపియన్ యూనియన్ వైఖరిని బలపర్చడంలో ఇతర దేశాల అయిష్టత అనేది విదేశీ విధాన స్వతంత్ర కాంక్షకూ, పొరుగు దేశంతో విరోధం పెట్టుకోవడానికి అయిష్టతకూ సంబంధించినదిగా ఉంటోందని యూరోపియన్ యూనియన్ ఆంక్షల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పశ్చిమ దేశాలకూ, రష్యాకూ మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల్లో చిక్కుకుపోకుండా ఉండటానికి అలీన విధానం ఆయా దేశాలకు ఉపకరిస్తోంది. ఈ కారణం వల్లే, అనేక ప్రజాస్వామిక దేశాలు తటస్థ వైఖరికి ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంపోసా 'ఇరుపక్షాలతో మాట్లాడండి' అనడంలో దీన్నే మనం చూడవచ్చు. రష్యాను ఖండించడానికి వ్యతిరేకంగా ఉండాలని దేశాలు నిర్ణయించుకోవడంలో నిర్దిష్ట ఆర్థిక, రాజకీయ ప్రోత్సాహకాలు ప్రభావం చూపుతున్నాయి.

ఇండియాకు పెరిగిన రష్యా చమురు

ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో రష్యా, భారత్ ఒకే విధమైన వ్యూహాత్మక, రాజకీయ అభిప్రాయాలను పంచుకోవడం కొనసాగించాయని పరిశీలకులు ఎత్తి చూపుతున్నారు. 2000 సంవత్సరంలో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం నేపథ్యంలో బహుళ ధ్రువ గ్లోబల్ వ్యవస్థను నిర్మించాలన్నది రష్యా ఉద్దేశంగా ఉండింది. అమెరికాను భాగస్వామిగా చేసుకోవడం పట్ల జాగ్రత్తగా ఉండాలని భారతదేశాన్ని రష్యా అభ్యర్థించేది. అలాగే భారతీయ అణ్వాయుధ కార్యక్రమానికి రష్యా మద్దతునిచ్చింది, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా మారడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను రష్యా బలపరుస్తూ వచ్చింది.

భారత్ ఆయుధ వాణిజ్యంలో రష్యా కీలక భాగస్వామిగా ఉండటాన్ని రష్యా కొనసాగించింది. 1992 నుంచి 2021 వరకు భారత్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో 65 శాతం వరకు రష్యా సరఫరా చేసింది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి, భారత్‌కు చౌక ధరకు చమురు అందించే కీలకమైన సరఫరాదారుగా రష్యా మారిపోయింది. 2021లో రష్యా నుంచి రోజుకు 50 వేల బ్యారెల్స్‌ను భారత్ కొనుగోలు చేయగా, 2022 జూన్ నాటికి అది రోజుకు పది లక్షల బ్యారెల్స్‌కు పెరిగింది.

బ్రెజిల్, దక్షిణాఫ్రికా ప్రయోజనాలు

ప్రపంచంలోనే అత్యంత పెద్ద వ్యవసాయ ఉత్పత్తిదారుల్లో ఒక్కటిగా ఉన్న బ్రెజిల్ అత్యధిక ఎరువుల వినియోగదారు కూడా. 2021లో రష్యా నుంచి బ్రెజిల్ దిగుమతి చేసుకున్న దిగుమతుల విలువ 5.58 బిలియన్ డాలర్లు కాగా, వాటిలో 64 శాతం వాటా ఎరువులదే. తమ రెండు దేశాల మధ్య ఇంధన సంబంధాలను విస్తరించుకోవడంలో భాగంగా రష్యా గ్యాస్ సంస్థ గాజ్‌ప్రోమ్ బ్రెజిల్ ఇంధన రంగంలో పెట్టుబడులు పెడుతుందని 2023 ఫిబ్రవరిలో బ్రెజిల్ ప్రకటించింది. 2023 మార్చి నాటికి బ్రెజిల్‌కు రష్యా డీజిల్ ఎగుమతులు కొత్త రికార్డులను చేరుకున్నాయి. అదే సమయంలో రష్యన్ చమురు ఉత్పత్తులపై ఈయూ ఆంక్షలు కూడా పతాక స్థాయిని చేరుకున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై సంవత్సరం పూర్తయిన సందర్భంలో– రష్యా, చైనాలతో కలిసి దక్షిణాఫ్రికా సంయుక్త నౌకా విన్యాసాలను చేపట్టింది. నౌకాదళ నిధుల లేమితో ఉన్న దక్షిణాఫ్రికా ఈ విన్యాసాల నుంచి ప్రయోజనం పొందుతుంది. ఆఫ్రికా ఖండానికి అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారుగా రష్యా నిలుస్తోంది. అణుశక్తిని కూడా రష్యా సరఫరా చేస్తోంది. ఆఫ్రికా ఖండానికి 30 శాతం వరకు గోధుమ వంటి ధాన్యాలను కూడా రష్యా సరఫరా చేస్తోంది. రష్యా ఉత్పత్తుల్లో 70 శాతం వరకు ఆఫ్రికా ఖండానికి చేరుతున్నాయి.

మరొక ప్రజాస్వామిక వ్యవస్థ సమస్యల్లో చిక్కుకున్నప్పుడు మద్దతుగా నిలబడాలని అభ్యర్థనలు చేస్తున్నప్పటికీ, అలీన విధానం ఇప్పటికీ పాపులర్ ఎంపికగా కొనసాగుతోందని ఉక్రెయిన్ యుద్ధం ఎత్తి చూపింది. భారత్ వంటి దేశాలకు ముఖ్యమైన రాజకీయ ఉనికిగా అలీన విధానం చాలాకాలంగా కొనసాగుతూ వస్తోంది. ఇతర ఉదంతాలను చూస్తే, అధ్యక్షుడు జైర్ బొల్సొనారో హయాంలో ఇది మారినప్పటికీ, ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడమే బ్రెజిల్ వంటి దేశాల సంప్రదాయ విధానంగా కొనసాగుతోంది. ప్రత్యేకించి అలీన దేశాల్లో చాలావాటికి ప్రత్యక్ష మదుపులు, అభివృద్ధి, మానవతా సహాయాన్ని అందించడం అనే పాశ్చాత్య నిబంధనల వెలుగులో చూస్తే ఇది విరుద్ధ ప్రయోజనాల ఘర్షణకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో తటస్థత అనేది ఒక 'గమ్మత్తయిన సంతులన చర్య'గా మారుతోంది.

వ్యాసకర్త సీనియర్ ఆర్థికవేత్త
('ద కాన్వర్సేషన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పుడేంటి?



మత ఛాందసవాదులు, అతి జాతీయవాదులతో సమస్య ఏమిటంటే– గణితం, తత్వశాస్త్రం, సాహిత్యం, సైన్సు మీద వాళ్లు సమయం పెట్టకుండా, ఐదువేల ఏళ్ల క్రితం వాళ్ల పూర్వీకులు వీటన్నింటిలో ప్రవీణులని నిరూపించడానికి సమయం వెచ్చిస్తారు.

– పల్లవీ అయ్యర్, రచయిత్రి

కొత్త ట్రెండ్



'ఎల్జీబీటీక్యూఐ+ ఆల్ఫాబెట్' ఉద్యమానికి తర్వాత కలపవలసిన ధోరణి వయసుకు సంబంధించినది. పురుషులు, మహిళలు తమను తాము చిన్నపిల్లల్లా ఐడెంటిఫై అవుతున్నారు. ఇది జోక్ కాదు. ఇది వాస్తవం.

– ఓలి లండన్, రచయిత్రి

స్వీయ బలి



గత వారంలోనే, పాకిస్తాన్‌లో ముగ్గురి మీద దైవ దూషణ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అందులో ఒకరు మౌలిక వసతుల ఆధునికీకరణలో సాయం చేస్తున్న చైనా దేశీయుడు కూడా ఉన్నారు. పాకిస్తాన్ సృష్టించిన రాకాసి పాకిస్తాన్‌కే ఎదురు తిరుగుతోంది.

– హారిస్ సుల్తాన్, యాక్టివిస్ట్

శాంతి దూత



అసాధ్యమైన దాన్ని సాధ్యం చేసిన దేశం మాది. ఇజ్రాయిల్‌తో శాంతి నెలకొల్పాం. (యూఏఈ అధ్యక్షుడు) షేక్ మహమ్మద్ బిన్ జాయేద్‌ను దేవుడు దీవించుగాక!

– హసన్ సజ్వానీ, కామెంటేటర్

నియంత్రణ



చైనాలో వేలాది మంది 'వ్యవసాయ నిర్వహణ అధికారు'ల పనేమిటంటే – ప్రభుత్వ నిబంధనలకు లోబడే రైతులు పంటలు పండిస్తున్నారో లేదో తనిఖీ చేయడం! అంతగా చైనా నియంత్రణలు అమలు చేస్తోంది.

– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

ప్రకృతికి శిరమొగ్గి నిలిచిన 'శివుడు'!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"చరిత్రలో ఇంతవరకు కనీవినీ ఎరుగని ఎండలు, వేడి గాలులు ఆసియా దేశాల్ని పీల్చి పిప్పి చేస్తాయి. ఈ అసాధారణ పరిణామం భారత, చైనా దేశాలలో పెక్కుమంది ప్రజల దుర్మరణాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా ఏప్రిల్–మే నెలలు ఆసియా ఖండ చరిత్రలోనే విలయ తాండవంగా భావించవచ్చు. ఉత్తర, తూర్పు భారత రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు తగ్గవు. ఒకవేళ వేడి తీవ్రత తగ్గని పక్షంలో పరిణామాలు ప్రమాదకరంగా మారవచ్చు"

– మాక్సిమిలియానో హెరీరా, వాతావరణ శాస్త్రవేత్త
('గార్డియన్' పత్రిక; 20 ఏప్రిల్ 2023)

వాతావరణ శాస్త్రవేత్తల తాజా అధ్యయనం ప్రకారం, భూమిపై ఏకంగా 20 లక్షల ఏళ్లపాటు వర్షం పడిందన్న వార్త 'కలగుండు' పడినట్లయింది. అంటే సృష్టి, వినాశాల మధ్య భూమి, ప్రకృతి పబ్బం గడుపుకుంటూ వచ్చాయని భావించాలి. సృష్టి, వినాశాలు ప్రాకృతిక సహజాలు. పెరుగుతూ వచ్చిన సృష్టి రహస్యాల పరిజ్ఞానంతో మానవజాతి తన మనుగడను కాపాడుకుంటూ వస్తోంది. ఇదిలా ఉండగా, దక్షిణాసియా దేశాలకు దఫదఫాలుగా వినాశంగా పరిణమిస్తున్న ఇండో–పసిఫిక్ వాతావరణ మార్పులు ఒకసారి దుర్భరమైన వేడి గాలులకు (ఎల్‌నినో), మరోసారి అమితమైన చలి గాడ్పులకు (లానినా) కారణమవుతున్నాయి. 2009 నుంచి 2018 వరకు మన దేశంలో అసాధారణ వేడిగాడ్పులకు కారణమైనది ఎల్‌నినో. ఫలితంగా ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయి. ప్రతీ 2–7 సంవత్సరాలకు ఎల్‌నినో వరసగా దెబ్బతీస్తూనే వచ్చింది.

ప్రకృతి వైపరీత్యం ఎంత దెబ్బతీయకపోతే, లోకాల్ని శాసించే శివుడు సహితం చలికి తట్టుకోలేక హిమాలయాల్ని వదిలి భూమ్మీద చెట్ల నీడను ఆశ్రయించాల్సిన గతి పడుతుంది! (**'హరుడు కైలాస కుధర నాథాగ్ర వసతి విడిచి/ వటమూల తలముల విశ్రమించె'.**) ఈ సత్యాన్ని 'వైజయంతీ విలాసం' కావ్యం ద్వారా సారంగు తమ్మయ్య ప్రజలపై ప్రకృతి ప్రభావాన్ని తెలియ జెప్పడం కోసం ప్రకటించాడు. దుర్భాక రాజశేఖర శతావధాని తన 'రాణా ప్రతాప సింహ చరిత్ర'లో హల్దీఘాట్ కనుమ దగ్గర రాజపుత్రులకూ, మొగలాయిలకూ మధ్య జరిగిన యుద్ధాన్ని వర్ణిస్తూ, మధ్యాహ్నాన్నిలా చిత్రించాడు:

"మెండై ఎండలు నిండె, నల్దెసల గ్రమ్మెన్ నిప్పులన్ గుప్పుచు/ ద్దండ గ్రీష్మ సమీరముల్ నిఖిల జగంబుల్ కదున్ దస్సె బ్ర/హ్మాండబంఢు పొగల్ సెగల్ తటుములై వ్యాపించి మధ్యాహ్నమా/ర్తాండుండుజ్వల కాండుడై గగనమధ్యం బందు మెల్గొందగన్."

ఇదిలా ఉండగా నన్నెచోడుడు 'కుమార సంభవం' కావ్యంలో, పార్వతి మండుటెండలకు పంచాగ్ని మధ్యంలో

రెండో మాట



ఘోర తపస్సు చేస్తున్న సందర్భాన్ని వర్ణించాడు. 'లోకులు భయపడేంత'గా వడగాలి వీచడాన్ని, ఆ వడగాలికి ఏనుగుల తలలు పేలిపోయి లోపలి ముత్యాలు పేలాలుగా పటపటా చిట్లిపోయినట్లు, దప్పిక కోసం ఎదురు చూసే చెట్లు తమ నీడల్ని తామే తాగుతున్నట్లు చిత్రించాడు. ఇక విశ్వనాథ పగటి ఎండల తీవ్రతల వల్ల జిల్లేడు కాయల్లా, వడ్లగింజల్లా, సున్నపురాయిలా విరిగిపోయి భూమి కాస్తా కకావికలైపోయిందని వర్ణించాడు!

ఆధునికుడైన కవి కాకరపర్తి కృష్ణశాస్త్రి తన కాలంలోనే సముద్రం ఉప్పొంగడం, అది భూమిని ముంచేసిన ఘటనలను 'ప్రళయ సంరంభం' కవితలో కళ్లకు కట్టి చూపాడిలా:

"ఆకసమంటుచున్ ఘుమ ఘుమార్భటితో దిశలన్ స్పృశించుచునే/ భీకర లీల లేచి అతివేల జవంబున వచ్చి వచ్చియ/ స్తోక తరంగ మొందుపడు దుస్సహమై ధరముంచి వైచి తా/ నేక పయోధి సూత్రముగ ఎంతయు జేసి శమించెనంతటన్"!

ఆంధ్ర సామ్రాజ్య విచ్ఛిన్నానికి 'రాళ్లు' కూడా దుఃఖంతో ఎలా కరిగిపోయాయో కవి కొడాలి సుబ్బారావు ఎంతో ఆర్ద్రతతో గుండె చెరువై ఇలా వర్ణించాల్సి వచ్చింది:

"శిలలు ద్రవించి యేడ్చినవి, జీర్ణములైనవి తుంగభద్రలో/ పల గుడి గోపురంబులు, సభాస్థలులైనవి కొండ ముచ్చుగుం/ పులకు, చరిత్రలో మునిగి పోయిన దాంధ్ర వబంధరాధిపో/జ్జ్వల విజయ ప్రతాప రభ సంబొక స్వప్న కథావిశేషమై."

ఇంతకూ, సంభవించే ప్రకృతి వైపరీత్యాలకేమిగాని మానవ హృదయంలో సహజంగానే ప్రకృతిని చూసి ఆనందించే లక్షణం మాత్రం చచ్చిపోదని చెబుతూ ప్రసిద్ధ కళాకారుడు, కవి అడవి బాపి రాజు ఓ చిరంతన సత్యాన్ని ప్రకటించిపోయారు:

"అందరికీ ప్రకృతిని చూసి ఆనందించే లక్షణం ఉంది. ఆ ప్రకృతి భౌతిక రూపంగా, మనోమయ రూపంగా, బుద్ధి రూపంగా ప్రత్యక్షం అవుతూనే ఉంటుంది. అలాంటప్పుడు ఆ ప్రకృతిలో మనస్సుకుగాని, హృదయానికిగాని, బుద్ధికిగాని, ఆత్మకుగాని ఆనందం కల్గించే ఒక దృశ్యం, ఒక రూపం, ఒక జీవితం, ఒక భావం, కళాశక్తి కలిగిన రసజ్ఞునికి గోచరించినప్పుడు – తనలో ఉండే ఆ కళా శక్తి పైకి ఒక స్వరూపంగా జన్మించాలని ఆవేదన పొందడం చేత కళా స్వరూపం ఉద్భవిస్తున్నది. ఆ కళా స్వరూపంలో ఉన్న ముఖ్య లక్షణం ఆనందం. ఆ సృష్టి భాషా స్వరూపమైతే కవిత్వం, వర్ణ స్వరూపమైతే చిత్ర లేఖనం, మూర్తి స్వరూపమైతే శిల్పం, అంగ విక్షేప స్వరూపమైతే నృత్యం, భవన స్వరూపమైతే ఆలయం అవుతుంది"!

ప్రకృతిలో మనం భాగం కాబట్టి, అందులో దఫదఫాలుగా ఇదే మానవుడి చేష్టల వల్లనో, ప్రకృతి సహజంగానో పెల్లుబికి వచ్చే ఉపద్రవాలను భరిస్తూనే లోకయాత్ర సాగుతూండటం సహజ పరిణామం.

abkprasad2006@yahoo.co.in

సమాచార హక్కు 'ఆద్యుడు'

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

'విముక్తి' గురించి తెలుసుకొనే సమాచారం అందరికీ ఇవ్వాలి. ముక్తి మార్గం, భక్తి సాధనం, మంత్రోపదేశం, విజ్ఞాన సమాచారం అందరిదీ అని... వెయ్యేళ్ల కాలం కిందటే 'సమాచార హక్కు' అవసరమని చెప్పినవారు రామానుజుడు. జ్ఞానాన్ని అందరికీ చేర్చడం కోసం జీవితాన్ని అంకితం చేసిన గురువు ఆయన. రామానుజుడు తిరు మంత్రం తెలుసుకోవడానికి 18 సార్లు శ్రీరంగం నుంచి తిరుగోష్టీయూరు దాకా ప్రయాణించి గురువు గారిని అడిగేవారు. ప్రతిసారీ మళ్లీ రమ్మనేవారు. విసుగు లేకుండా, తిట్టుకోకండా ఓపికగా భక్తితో జాగ్రత్తగా వచ్చే వారు. 18 సార్లు తిరిగిన తరువాత గురువుగారు తిరు మంత్రం అంటే... అష్టాక్షర మంత్రం నేర్పారు. తర్వాతి కాలంలో ఈయన ఇటువంటి మంత్రాలనూ, ముక్తి మార్గాన్నీ అందరికీ తెలియచేసి అందరూ ముక్తి పొందడానికి అవకాశం కల్పించిన సంస్కర్త అయ్యారు.

రామానుజుడు తమిళనాడు శ్రీపెరుంబుదూర్‌లో 11వ శతాబ్దంలో జన్మించారు. నాథముని, యామునాచార్యుల తరువాత విశిష్టాద్వైతాన్ని ప్రసిద్ధం చేసిన సిద్ధాంత కర్త. బ్రహ్మ సూత్రాల వ్యాఖ్యానం – 'శ్రీ భాష్యం'; 'భగవద్గీతాభాష్యం', 'వేదాంత సంగ్రహ'మనేవి రామానుజుని ప్రధాన గ్రంథాలు. 'శరణాగతి గద్యం', 'శ్రీరంగ గద్యం', 'శ్రీ వైకుంఠ గద్యం' (గద్యత్రయం) ఇతర రచనలు.

మహమ్మదీయ రాజుల దాడులలో ధ్వంసమైన అనేక ఆలయాలను పునరుద్ధరించి, ఆ మత పాలకులతో వాదం జరిపి వారు ఎత్తుకుపోయిన విగ్రహాలను తిరిగి సాధించి ఆలయాల్లో నెలకొల్పిన ధీరుడు రామానుజుడు. ఆలయాలలో అన్ని కులాల వారికీ ప్రవేశం కల్పించి, అందరి కోసం చెరువులు తవ్వించి... విజ్ఞానం, మంత్రో పదేశం కొందరికే పరిమితం కాదనీ, అందరూ పొందాలనే సర్వసమతా సూత్రాన్ని బోధించి పాటించిన జగద్గురువు రామానుజుడు.

క్రీస్తు శకం 11–12 శతాబ్దాల మధ్య రామానుజాచార్యులు తమిళనాడు శ్రీరంగంలో పరమపదం పొందారు. ఆనాటి నుంచి అంటే వెయ్యేళ్ల కాలం నుంచి ప్రత్యేక లేపనాలను అద్ది ఆయన శరీరాన్ని భద్రపరుస్తున్నారు. శ్రీరంగంలోని 4వ ప్రాకారంలో ఉన్న రామానుజాచార్యులది ఒక విగ్రహం అనుకోవడం సాధ్యం కాదు. అలా అని దానిని మృత శరీరమనీ అనుకోరు. అదో దివ్య భావన కల్పించే మూర్తి. పద్మాసనంలో యోగ భంగిమలో కూర్చుని రామానుజులు కనిపిస్తారు.

జాతి, మత, కుల భేదాలు లేకుండా అందరికీ ఆలయ సమీపంలోని కూటములలో 'మధ్యాహ్న భోజనం' ఇవ్వాలనే ఆలోచనను మొదట అమలుచేసిన వాడు రామానుజుడు. ఇస్లాం మతవాదులైన ముస్లిం రాజులు కొల్లగొట్టిన హిందూ దేవతా మూర్తులను తన వాక్చాతుర్యంతో, వాదనా పటిమతో, సంప్రదింపుల నైపుణ్యంతో మర్యాదగా మాట్లాడి వారిని ఒప్పించి వందలాది దేవతా విగ్రహాలను మళ్లీ ఆయా దేవాలయాల్లో ప్రతిష్ఠించిన రామానుజుడు గోష్ఠీ సమరాంగణ సార్వభౌముడు, అహింసావాది. సంవాదం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చుననే ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానానికి తొలి కర్త, కర్మ, క్రియ రామానుజుడే. గాంధీ అహింసా సిద్ధాంతాన్ని వెయ్యేళ్ల కిందటే ఆచరించి చూపిన మార్గదర్శి.



శ్రీరంగంలోని రామానుజులు

ఊళ్లో చెరువు ఉండాలనీ, అది అందరికీ నీరివ్వాలనీ... నియమాలు పెట్టిన జగద్గురువు కూడా రామానుజుడే. తొండనూరులో ఆయన తవ్వించిన చెరువు వెయ్యేళ్ల నుంచి నీళ్లిస్తూనే ఉన్నది. మేల్కోటే తిరు నారాయణ పురం ఆలయంలో ప్రవేశించడానికి తమకెందుకు అర్హత లేదని అక్కడి హరిజన, గిరిజనులు అడిగితే ఇప్పుడే రండి అని ఆలయంలోకి తీసుకు వెళ్లిన మహానుభావుడు. హిందూ మతంలో అందరి సమానత గురించి ఆలోచించిన సంస్కర్త కేవలం రామానుజుడే అని బీఆర్ అంబేడ్కర్ ప్రశంసించాడని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల రామానుజ సహస్రాబ్ది తపాలా బిళ్లను ఆవిష్కరిస్తూ వివరించారు. రామానుజుని జీవితం మెదడున్న మనలను ఆలోచింపచేసే ఒక సిద్ధాంతం, ఒక ఆచరణ, ఒక సువిశాల సమతా మతం.

వ్యాసకర్త డీన్, స్కూల్ ఆఫ్ లా, మహీంద్ర యూనివర్సిటీ

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.11.10 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పునర్వసు పూర్తి (24గంటలు), **వర్జ్యం:** సా.5.29 నుండి 7.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.32 నుండి 12.23 వరకు, **అమృతఘడియలు:** రా.3.58 ఉండి 5.43 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.13.

క్లుప్తంగా...

చీమలపాడు బాధితులకు ఎక్స్‌గ్రేషియా మంజూరు

- మృతులకు రూ.10లక్షలు.. గాయపడ్డ వారికి రూ.2.5 లక్షలు
- బాధితకుటుంబాలకు చెక్కులను అందజేసిన మంత్రి పువ్వాడ



చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ నామా, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే రాములు నాయక్, కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. ఈమేరకు మరణించిన నలుగురి కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.2.5 లక్షల చొప్పున చెక్కులను ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం మంత్రి పువ్వాడ అందజేశారు.

పల్లెల ఆశలన్నీ బీఎస్పీపైనే: ప్రవీణ్



వృద్ధురాలితో ముచ్చటిస్తున్న ప్రవీణ్ కుమార్

అలంపూర్: రాష్ట్రంలోని పల్లెలన్నీ బీఎస్పీ వైపే చూస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర 212 రోజు మంగళవారం రాత్రి అలంపూర్‌లోని సంతోష్‌నగర్ కాలనీలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఒకే రోజు నాలుగు పరీక్షలు రాసేదెలా?

బండి సంజయ్‌కు నిరుద్యోగుల మొర

కరీంనగర్‌టౌన్: ''సార్.. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం కష్టపడి చదువుకుంటున్నం. అప్పోసప్పో చేసి కోచింగ్ తీసుకుంటున్నం. రూ.5 భోజనం తింటూ చదువుకుంటున్నం. కానీ..ఈనెల 30న ఒకే రోజు కానిస్టేబుల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, అసిస్టెంట్ ఇంజనీరింగ్ (ఏఈ), జూనియర్ లైన్‌మన్ (జేఎల్ఎం) పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆ పరీక్షలన్నీ ఒకేరోజు నిర్వహించడం వల్ల వాటిని రాయలేని దుస్థితి మాది. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారులు మాట వినడం లేదు. మీరైనా ఒత్తిడి చేసి మా భవిష్యత్తును కాపాడండి''అంటూ పలువురు నిరుద్యోగులు మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. వారి ఆవేదనపై సానుకూలంగా స్పందించిన సంజయ్ ప్రభుత్వానికి లేఖ రాస్తానని హామీనిచ్చారు.

ఉపాధ్యాయ దంపతుల గోడు వినండి

సాక్షి, హైదరాబాద్: పాఠశాలలు తెరిచేలోగానైనా ఉపాధ్యాయ దంపతుల సమస్యలు పరిష్కరించాలని బాధిత ఉపాధ్యాయులు కోరుతున్నారు. చివరి పనిదినమైన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద పిల్లలతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. పదహారు నెలలుగా తాము తీవ్ర అవస్థలకు గురవుతున్నామని స్పౌజ్ బాధితుల సంఘాధ్యక్షుడు వివేక్, ప్రధాన కార్యదర్శి కదీర్ వాపోయారు.

రేప్ కేసు తీర్పును సమీక్షించండి: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ గ్యాంగ్‌రేప్ కేసులో ఆరో నిందితుడిని మేజర్‌గా పరిగణిస్తూ పోక్సో కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని హైకోర్టు ఆదేశించింది. 2022, మే 28న స్నేహితులతో కలసి అమ్నేసియా పబ్ కేసులో ఫ్రెషర్స్ డే పార్టీకి వెళ్లిన బాలికపై గ్యాంగ్‌రేప్ జరగడం తెలిసిందే. దీన్ని బాలిక మీడియాకు తెలపడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు సాదుద్దీన్‌తోపాటు ఐదుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రమైన కేసు కాబట్టి నలుగురు మైనర్లను మేజర్లుగా పరిగణించాలంటూ పోక్సో కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన పోక్సో కోర్టు 2022 సెప్టెంబర్ 30న వారిని మేజర్లుగా పేర్కొంటూ తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై స్టే ఇవ్వాలని.. ఏ నివేదిక ఆధారంగా తమను మేజర్లుగా పేర్కొన్నారో దాని ప్రతి ఇచ్చేలా ఆదేశించాలని ఒక నిందితుడు (ఏ-6) హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి తీర్పును సమీక్షించాలని పోక్సో కోర్టును ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం బోనాల్‌లో కురుస్తున్న వడగండ్లు



బంజారాహిల్స్‌లో జలమయమైన రహదారి

ఉరిమేసి... కుమ్మేసి..!

హైదరాబాద్‌లో భారీ వర్షం

- ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో దంచి కొట్టిన వాన
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగండ్ల వాన.. పంటలకు నష్టం
- వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

సాక్షి, హైదరాబాద్, నెట్‌వర్క్: హైదరాబాద్‌లో వాన దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం మంగళవారం బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులన్నీ వాగుల్లా మారాయి. దీంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు, పలు బస్తీలు జలమయమయ్యాయి. 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడటంతో వాహనాలు ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల వరద కాలువల్లా మారిన రోడ్లపై ఉన్న ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు 150 ఫీడర్లు ట్రిప్ అయ్యాయి. భీకర గాలులకు హుస్సేన్‌సాగర్‌లో భాగమతి బోటు అదుపు తప్పింది. రాత్రి 9 గంటల వరకు రాంచంద్రాపురంలో 7.9 సె.మీ, గచ్చిబౌలిలో 7.7 సె.మీ, గాజులరామారంలో 6 సె.మీ వర్షపాతం నమోదయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ వడగండ్ల వాన కురిసింది. పంటలకు నష్టం వాటిల్లింది. వేర్వేరు ఘటనల్లో నలుగురు మరణించారు. కాగా బుధ, గురువారాల్లోనూ పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఉక్కపోత..కుండపోత

మంగళవారం సాయంత్రం వరకు వేడి, ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆ తర్వాత కొద్దిసేపటికే వాతావరణంలో మార్పులతో కొంత ఉపశమనం పొందారు. వాతావరణం చల్లగా మారిన కొద్దిసేపటికే వర్షం మొదలై ఊపందుకుంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు తోడయ్యాయి. దీంతో వాతవరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. నగర ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దంటూ జీహెచ్ఎంసీ హెచ్చరించింది. కాగా రాంచంద్రాపురం, గచ్చిబౌలిలో భారీ వర్షపాతం నమోదైంది. పంజాగుట్ట, అమీర్‌పేట, యూసఫ్‌గూడ, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, చార్మినార్, ఖైరతాబాద్, పటాన్‌చెరు, మల్కాజిగిరి, అల్వాల్, నేరేడ్‌మేట్, మూసాపేట, ఈసీఐఎల్, బాలనగర్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి ఉప్పల్ పరిధిలో, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, చింతల్‌బస్తీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కీసరలో ఈదురుగాలులతో రహదారుల వెంట ఉన్న చెట్లు నేలకొరిగాయి. ఎస్‌పీఆర్ హిల్స్‌లోని ఒక దేవాలయంలో గల మహావృక్షం నేలకూలడంతో చుట్టు పక్కల ఇళ్ల గోడలు కూలాయి. దీంతో ఒక చిన్నారి తీవ్రంగా గాయపడింది. రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రధాన రహదారుల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్‌లలో ప్రధాన రహదారులు వాగుల్ని తలపించాయి.

నేడు, రేపు వడగళ్ల వాన

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధ, గురువారాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగళ్ళతో కూడిన వర్షాలు కురవచ్చని హెచ్చరించింది. దక్షిణ /ఆగ్నేయ దిశల నుండి తెలంగాణ వైపు దిగువస్థాయి గాలులు వీస్తున్నాయని పేర్కొంది. రాగల ఐదు రోజుల్లో రాష్ట్రంలోని అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 40ని డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, కొన్నిచోట్ల 35ని డిగ్రీల కన్నా తక్కువగా కూడా నమోదు కావొచ్చునని తెలిపింది.

పలు జిల్లాల్లో వానలు..పంటలకు నష్టం

మంగళవారం ఆదిలాబాద్, జనగామ, నల్లగొండ, సిరిసిల్ల, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా మల్యాలలో 8 సె.మీ, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో 7 సెం.మీ, గంగాధరలో 5 సె.మీ, జనగామ జిల్లాలోని బచ్చన్నపేటలో 5 సె.మీ వర్షపాతం నమోదయ్యింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం నందిగామ గ్రామంలో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మొదలైన వడగళ్ల వాన సుమారు 45 నిమిషాల పాటు ఏకధాటిగా కురిసింది. పలు మండలాల్లో జొన్న, నువ్వులు, వేరుశనగ, కూరగాయల పంటలు నేలకొరిగాయి. నిర్మల్ జిల్లాలో కూడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్ల వర్షం కురిసింది. సారంగపూర్ మండలంలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. భైంసాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన మక్కలు తడిసిపోయాయి. నిజామాబాద్ మార్కెట్‌లో విక్రయించడానికి రైతులు తీసుకొచ్చిన పసుపు రాశులు తడిసిపోయాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి, సజ్జ, నువ్వ పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు కామారెడ్డి జిల్లాలో వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. జనగామ జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి బచ్చన్నపేట, జనగామ, నర్మెట, రఘునాథపల్లి, లింగాలఘనపురం మండల పరిధిలోని 25 గ్రామాల్లో 3,757 మంది రైతులకు చెందిన వరి, మామిడి, కూరగాయల పంటలకు (10,169 ఎకరాల్లో) నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది.

నలుగురి మృతి

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో మంగళవారం నలుగురు మృత్యువాత పడ్డారు. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన నీల పద్మ (38) చెట్టు కొమ్మ విరిగి మీద పడటంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది.



విజయ్‌కుమార్



నీల పద్మ

మంగళవారం రామాయంపేటలో పండ్లు అమ్ముకొని, మరొక వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళుతుండగా ఈదురుగాలులు వీయడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇదే జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన అంద్యాల పద్మ (45)పై ఇంటి రేకులు పడడంతో అక్కడికక్కడే మరణించింది. ఖమ్మం జిల్లా మధిర మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కనపర్తి విజయ్‌కుమార్ (38) పిడుగుపాటుకు గురై మరణించాడు. విజయ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయాల్లో కూలీకి వెళ్లేవాడు. మంగళవారం సమీప బంధువు మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి తిరిగివస్తుండగా వైరా నది సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజూరా గ్రామానికి చెందిన పాతకుంట మోహన్ (21) మంగళవారం పిడుగుపాటుతో మృతి చెందాడు.

నగరంలో వర్షం ఇలా..

ప్రాంతం	సెంటీమీటర్లు
రాంచంద్రాపురం	7.9
గచ్చిబౌలి	7.7
గాజులరామారం	6.0
కుత్బుల్లాపూర్	5.5
జీడిమెట్ల	5.3
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	5.0
బీహెచ్ఈఎల్	4.9
కేపీహెచ్‌బీ సీబీసీఐడీ కాలనీ	4.6
మల్కాజిగిరి	4.3
లింగంపల్లి	3.8
ప్రశాంత్‌నగర్	3.8
మాదాపూర్	3.8
కాప్రా	3.7

అదుపు తప్పిన భాగమతి

లుంబినీ పార్క్ నుంచి సందర్శకులను ఎక్కించుకుని హుస్సేన్‌సాగర్‌లో విహారానికి బయలుదేరిన భాగమతి బోటు భారీ వర్షంతో పాటు ఈదురుగాలులు రావడంతో ఒక్కసారిగా అదుపుతప్పింది. బోట్స్ క్లబ్ వైపునకు వెళ్లింది. బోటులోని సిబ్బంది సమాచారంతో స్పీడ్ బోట్లలో వచ్చిన ఇతర సిబ్బంది భాగమతి వద్దకు చేరుకుని తాళ్ల సాయంతో దానిని ఒడ్డుకు చేర్చారు.





హైదరాబాద్ బేగంపేటలో నిలిచిపోయిన ట్రాఫిక్

వణికిస్తున్న అకాల వర్షాలు

- గత నెలలో భారీయెత్తున పంటలకు నష్టం
- తాజా వర్షాలు, వడగండ్లతో లక్ష ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ప్రతి ఏటా రైతును కష్టాలపాలు చేస్తున్న వానలు
- గత ఏడాది దాదాపు 8 లక్షల ఎకరాలపై ఎఫెక్ట్
- పంటల బీమా లేకపోవడంతో అందని పరిహారం
- గత నెలలో జరిగిన నష్టానికి మాత్రం ఎకరానికి రూ.10 వేలు చొప్పున సాయం

సాక్షి, హైదరాబాద్: వదలకుండా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. లక్షలాది ఎకరాల్లో పంటలు నాశనం అవుతున్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు రైతు సంఘాలు అంచనా వేశాయి. వ్యవసాయ శాఖ మాత్రం 2.28 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసి, చివరకు 1.51 లక్షల ఎకరాల్లో పంట నష్టానికి సంబంధించి రైతులకు పరిహారం ప్రకటించింది. ఇలావుండగా మళ్లీ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వడగండ్లతో కూడిన వర్షాలు, ఈదురుగాలులతో దాదాపు లక్ష ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యాప్తంగా, ఇతర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. దీంతో వరి, మొక్కజొన్న.బొబ్బర్లు, మినప పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. మామిడి కాయలు 95 శాతం వరకు రాలిపోయాయి. కూరగాయల పంటలకూ నష్టం వాటిల్లింది. టమాటా, బీరకాయ, పచ్చిమిర్చి తోటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఈ యాసంగిలో 72.61 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అందులో వరి 56.44 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 6.48 లక్షల ఎకరాల్లో సాగయ్యింది. శనగ 3.64 లక్షల ఎకరాలు, వేరుశనగ 2.42 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అలాగే రాష్ట్రంలో 3.50 లక్షల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. తాజా వర్షాలతో కోతకు వచ్చిన వరి గింజలోకి నీరు చేరి రంగుమారే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మహ్మద్‌నగర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

ఏటా ఇదే పరిస్థితి...

ఏటా ఎండాకాలంలో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంటోంది. గతేడాది యాసంగి సీజన్‌లో కురిసిన వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్లకు దాదాపు 8 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మూడేళ్ల క్రితం వరకు రాష్ట్రంలో పంటల బీమా అమలయ్యేది. దానినుంచి బయటికొచ్చిన తర్వాత పంట నష్టాలకు పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. గత నెలలో దెబ్బతిన్న పంటలకు మాత్రం ఎకరానికి రూ.10 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. కొత్త పంటల బీమా విధానాన్ని తీసుకొస్తామని వ్యవసాయ శాఖ చెబుతున్నా అది అమలుకు నోచుకోవడం లేదు. కనీసం కసరత్తు కూడా చేయడం లేదు. దీనివల్ల పంట వేసిన తర్వాత అది చేతికొచ్చే వరకు అకాల వర్షాల వల్ల నష్టం జరిగితే పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. రైతుబంధుతో ఊరట పొందుతున్న రైతులకు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగితే మాత్రం పరిహారం అందడం లేదని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. పంటల బీమా వల్ల గతంలో రైతులు ఎంతోకొంత లాభపడ్డారని వ్యవసాయ శాఖ వర్గాలు సైతం అంగీకరిస్తుండటం గమనార్హం. రాష్ట్రంలో దాదాపు 65 లక్షల మంది రైతులు ఉన్నారు. గతంలో పంటల బీమా పథకాలు అమల్లో ఉన్నప్పుడు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది పంటలకు బీమా చేయించేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు, ఆ కంపెనీలను బాగు చేసేవిగా ఉన్నాయన్న అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం వాటినుంచి బయటకు వచ్చింది. కానీ మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.

పంట పోయిందని ప్రాణం తీసుకున్నాడు

కల్లెడలో మామిడి రైతు ఆత్మహత్య



లచ్చన్న (ఫైల్)

కడెం: అకాల వర్షాలకు పంట పోయిందన్న మనోవేదనతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కల్లెడ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై కె.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్పూరి లచ్చన్న (46)కు గ్రామంలో రెండున్నర ఎకరాల మామిడి తోట ఉంది. ఈ ఏడాది కాతే అంతంత మాత్రంగా ఉంది. ఉన్న కొద్దిపాటి కాయలు ప్రస్తుతం కోత దశకు వచ్చాయి. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు కాయలన్నీ రాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం జరిగింది. చేతికి వచ్చిన పంట నేలపాలవడంతో దిగాలు చెందిన లచ్చన్న సోమవారం రాత్రి బయటకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. గ్రామంలోని తన పాత ఇంటికి వెళ్లి అక్కడ ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం లచ్చన్న కోసం గాలించిన కుటుంబసభ్యులకు పాత ఇంట్లో విగతజీవిగా కనిపించాడు. లచ్చన్నకు భార్య రాజవ్వ, కొడుకు, కూతురు ఉన్నారు. రాజవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట నష్టంపై వివరాలు సేకరించండి

- బీజేపీ నేతలకు బండి సంజయ్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగండ్ల వానలతో పంట నష్టపోయి దెబ్బతిన్న రైతులకు బీజేపీ నేతలు, కిసాన్ మోర్చా శ్రేణులు అండగా నిలవాలని, పంట నష్టం వివరాలను సేకరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశించారు. పంటలకు వాటిల్లిన నష్ట వివరాలతో నివేదిక రూపొందించి గురువారం జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే స్పందనను బట్టి బీజేపీ నాయకత్వం పెద్ద ఎత్తున ఆందోళనకు కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. మంగళవారం పార్టీ జిల్లాల అధ్యక్షుల, ఇంచార్జిలు, కిసాన్ మోర్చా నాయకులతో సంజయ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'వడగండ్ల వానలతో రాష్ట్ర రైతాంగం కోలుకోని విధంగా దెబ్బతింది. చేతికొచ్చిన పంట చాలాచోట్ల పూర్తిగా కొట్టుకుపోయింది. గత నెల కురిసిన వర్షాలకు వేల ఎకరాల్లో పంట నష్టపోతే... ఎకరానికి రూ.10 వేలు సాయం చేస్తానని మాట ఇచ్చిన కేసీఆర్ ఇప్పటి వరకు నయాపైసా ఇవ్వలేదు. ఈసారి వడ్ల కొనుగోలు కేంద్రాలను సకాలంలో తెరిచి ఉంటే 30 నుండి 50 శాతం మంది ఈరోజు పంట నష్టపోయే వాళ్లు కాదు. ఈ పరిస్థితుల్లో మనమంతా రైతులకు అండగా నిలవాలి. వెంటనే పొలాలను సందర్శించి పంట నష్టం వివరాలను సేకరించండి.. రైతులకు భరోసా ఇవ్వండి'అని కోరారు.

సమన్వయంతో పనిచేస్తే రాష్ట్రం అగ్రగామి

పీఆర్‌శాఖ ముఖ్య కార్యదర్శి సుల్తానియా

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. నాలుగేళ్లుగా పీఆర్‌ఆర్‌డీ శాఖ ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలు మారాయని ఆయన చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. రాజేంద్రనగర్‌లోని టీఎస్ఐఆర్‌డీలో మంగళవారం డీపీవోలు, జెడ్పీ సీఈవోలు, డీఆర్‌డీవోలకు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పురస్కారాలు సాధించిన గ్రామ పంచాయతీల డీపీవోలు, జెడ్పీ సీఈవో, డీఆర్డీవోలకు పీఆర్‌శాఖ డైరెక్టర్ హనుమంతరావు ప్రశంసాపత్రాలను అందజేశారు.

'ధరణి'తో భూ సమస్యలు పెరిగాయి: హైకోర్టు

- ఎప్పటిలోపు పరిష్కరిస్తారని సీసీఎల్ఏకు హైకోర్టు ప్రశ్న
- నాలుగు వారాల్లో పరిష్కరిస్తామన్న అధికారి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ భూముల రెవెన్యూ రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ధరణి'పోర్టల్‌తో బ్రోకర్లే లబ్ధి పొందుతున్నారని, ప్రజల సమస్యలు మరింత పెరిగాయని హైకోర్టు అభిప్రాయపడింది. ఎప్పటిలోగా వీటిని పరిష్కరిస్తారని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ)ను ప్రశ్నించింది. నాలుగు వారాల్లో పరిష్కరిస్తామని సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ వ్యక్తిగతంగా హైకోర్టు హాజరై హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో తలెత్తుతున్న వివిధ సమస్యలపై ఉన్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై రెండు రోజుల క్రితం విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్.. మంగళవారం సీసీఎల్ఏను కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించిన విషయం తెలిసిందే. భూ రికార్డుల అప్‌డేట్ ప్రక్రియ, దిద్దుబాట్ల సమయంలో 2021, జనవరి 1న సీసీఎల్ఏ ఓ సర్క్యులర్ జారీ చేసింది. ఇందులోని మార్గదర్శకాల ప్రకారం పౌరులు ఈ-పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం, రికార్డుల్లో తప్పులు సరిదిద్దడం కోసం, ఇతర అన్ని భూ సంబంధ విషయాల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని అధికారులు వారం రోజుల వ్యవధిలో పరిష్కరించాలి. అలాగే నేరుగా ఇచ్చే దరఖాస్తులను 45 రోజుల్లోగా పరిష్కరించాలి. అయితే అధికారులు నిర్దేశిత సమయం పాటించడం లేదని, దీంతో కక్షిదారులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

'తిరస్కరించడమైనది'అనే ఒక్క పదంతో...

ఎలాంటి కారణం చూపకుండా 'తిరస్కరించడమైనది'అనే ఒక్క పదంతో దరఖాస్తులను తిరస్కరించడంపై న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక, వేలంలో కొనుగోలు చేసినవారికి బ్యాంకర్లు లేదా ఫైనాన్స్ సంస్థలు ఇచ్చే సేల్ సర్టిఫికెట్ కాపీలను సైతం పోర్టల్‌లో ఇవ్వడం లేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటినీ ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారని సీసీఎల్ఏను ప్రశ్నించారు. సీసీఎల్ఏ స్పందిస్తూ.. సమస్యల పరిష్కారానికి 4 వారాలు గడువు కోరారు. దీంతో న్యాయమూర్తి.. తదుపరి విచారణను జూన్‌కు వాయిదా వేశారు.

క్లుప్తంగా

పరువు నష్టం కేసు.. గుజరాత్ హైకోర్టుకు రాహుల్

అహ్మదాబాద్: పరువు నష్టం కేసులో స్టేకు సూరత్ సెషన్స్ కోర్టు నిరాకరించడాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం గుజరాత్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ విచారణకు రానుందని ఆయన తరఫు లాయర్ చెప్పారు. ఈ కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడటం, అనర్హత వేటు పడటం తెలిసిందే.

సీఎం యోగిని చంపుతానంటూ ఫోన్..

లక్నో: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను చంపేస్తానంటూ బెదిరింపు కాల్ రావడం కలకలం సృష్టించింది. తీరి అది తన ప్రేయసి తండ్రిని ఇరుకున పెట్టేందుకు ఓ యువకుడు చేసిన నిర్వాకమని తేలింది. 'త్వరలోనే సీఎం యోగిని చంపేస్తా' అంటూ పోలీసులకు మంగళవారం సెల్ సందేశం అందింది. అది లక్నోకు చెందిన సజ్జాద్ హుస్సేన్ ఫోన్‌గా తేలింది. తన ఫోన్ రెండు రోజుల క్రితమే పోయిందని అతడు విచారణలో తెలిపాడు. ఫోన్‌ను సజ్జాద్ కూతుర్ని ప్రేమిస్తున్న అమీన్ (18) ఎత్తుకెళ్లినట్లు పోరుగువారు తెలిపారు. తమ ప్రేమను అంగీకరించనందుకు సజ్జాద్‌ను తప్పుడు కేసులో ఇరికించేందుకు అమీన్ ఈ పని చేసినట్టు తేలింది. అతనిపై దొంగతనం సహా పలు కఠిన సెక్షన్ల కింద కేసులు పెట్టారు.

యూకేలో తొలి జగన్నాథాలయానికి రూ.250 కోట్ల విరాళం


లండన్: యూకేలోని లండన్‌లో తొలి జగన్నాథాలయ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది. ఇందుకు రూ.250 కోట్లిచ్చేందుకు భారత సంతతికి చెందిన ఫిన్‌నెస్ట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకుడు బిశ్వనాథ్ పట్నాయక్ ముందుకొచ్చారు. యూకేకు చెందిన శ్రీ జగన్నాథ సొసైటీ ఈ ఆలయాన్ని నిర్మించనుంది.

మన్ కీ బాత్ @100 జాతీయ సదస్సు నేడు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మోదీ మాసాంతపు 'ఆలిండియా రేడియో' ప్రాసంగిక కార్యక్రమం మన్ కీ బాత్ 100 ఎపిసోడ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార శాఖ జాతీయ సదస్సు నిర్వహించనుంది. దీన్ని బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రారంభించనున్నారు. సదస్సులో నాలుగు ప్రత్యేకచర్చా కార్యక్రమాలుంటాయి. వీటిలో నటులు అమీర్ ఖాన్, రవీనాటాండన్, తెలంగాణ నుంచి నిఖత్ జరీన్, పూర్ణ మలావత్‌లతో పాటు మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రస్తావించిన 100 మందికి పైగా ప్రత్యేక ఆహ్వానితులు హాజరుకానున్నారు. 'మన్ కీ బాత్' 100 ఎపిసోడ్‌లకు గుర్తుగా పోస్టల్ స్టాంప్, నాణేలను హోంమంత్రి అమిత్ షా విడుదల చేయనున్నారు.

తెలుగు ఐఏఎస్ అధికారిని పొట్టనబెట్టుకున్న...

గ్యాంగ్‌స్టర్‌ను వదిలేశారు!


ఆనంద్ మోహన్

నిబంధనలను మార్చేసి మరీ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌కు నితీశ్ సర్కారు రెమిషన్

సర్వత్రా విమర్శలు | ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్న మోహన్ | రేప్ కేసులున్న మాజీ ఎమ్మెల్యేలకూ క్షమాభిక్ష

పట్నా: అతనో పేరుమోసిన గ్యాంగ్‌స్టర్. మాజీ ఎంపీ కూడా. పేరు ఆనంద్ మోహన్. దాదాపు 30 ఏళ్ల కింద బిహార్‌లో ఏకంగా ఐఏఎస్ అధికారిపైకే మూకను ఉసిగొల్పి అత్యంత పాశవికంగా రాళ్ల దాడి చేయించి పొట్టన పెట్టుకున్నాడు. ఆ కేసులో 15 ఏళ్లుగా జీవితఖైదు అనుభవిస్తున్నాడు. అలాంటి వ్యక్తికి క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేస్తూ నితీశ్‌కుమార్ సర్కారు వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అందుకోసం ఏకంగా జైలు నిబంధనలనే మార్చేసింది! ఆనంద్‌తో సహా పలు తీవ్ర నేరాలకు పాల్పడి జీవితఖైదు అనుభవిస్తున్న మరో 26 మంది దోషుల విడుదలకు సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం పెరోల్ మీద ఉన్న అతడు ఆ సమయంలో తన కుమారుడైన ఆర్జేడీ ఎమ్మెల్యే చేతన్ ఆనంద్ నిశ్చితార్థ వేడుకను ఆస్వాదిస్తున్నాడు! నితీశ్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, బిహార్‌లోని రాజకీయ తదితర రంగాల ప్రముఖులంతా అందులో పాల్గొన్నారు. తనకు విముక్తి ప్రసాదిస్తున్నందుకు నితీశ్‌కు ఆనంద్ మోహన్ కృతజ్ఞతలు తెలిపాడు. త్వరలో డెహ్రాడూన్‌లో జరిగే కొడుకు పెళ్లిని కూడా దగ్గరుండి జరిపించుకుంటానంటూ హర్షం వెలిబుచ్చాడు. పెరోల్ ముగియడంతో మంగళవారం జైలుకు తిరిగి వెళ్లిన అతను బుధవారం రెమిషన్‌పై విడుదల కానున్నాడు. నితీశ్ సర్కారు నిర్ణయంపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎస్పీ, బీజేపీతో పాటు ఐఏఎస్ అధికారుల సంఘం కూడా దీన్ని తీవ్రంగా తప్పుబట్టగా అధికార జేడీ(యూ) మాత్రం సమర్థించుకుంది. క్షమాభిక్ష జాబితాలో మైనర్‌పై అత్యాచారం కేసులో దోషి ఆర్జేడీ మాజీ ఎమ్మెల్యే రాజ్ బల్లభ్ యాదవ్, పలు తీవ్ర క్రిమినల్ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న జేడీ(యూ) మాజీ ఎమ్మెల్యే అవధేశ్ మండల్ కూడా ఉన్నారు.

ఏం జరిగింది?


జి.కృష్ణయ్య

1994లో లాలుప్రసాద్ యాదవ్ హయాంలో బిహార్లో చోటా శుక్లా అనే కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్‌ను ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన గ్యాంగ్‌స్టర్ బ్రిజ్ బిహారీ ప్రసాద్ సానుభూతిపరులు దారుణంగా కాల్చి చంపారు. మండల్ రిజర్వేషన్లపై దేశమంతా అట్టుడుకున్న వేళ అగ్రవర్ణ భూమిహార్ అయిన శుక్లా హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. డిసెంబర్ 5న శుక్లా అంతిమ యాత్ర సందర్భంగా ఆనంద్ మోహన్ పిలుపు మేరకు వేలాది మంది రోడ్లపైకి వచ్చి విధ్వంసానికి దిగారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గోపాల్‌గంజ్ కలెక్టర్ అయిన తెలంగాణకు చెందిన దళిత ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్యను కార్లోంచి బయటికి లాగి రాళ్లతో విచక్షణారహితంగా కొట్టి పొట్టన పెట్టుకున్నారు. ఆనంద్ మోహన్ దగ్గరుండి మరీ వారిని ఈ దాడికి ప్రేరేపించినట్టు చెబుతారు. ఈ కేసులో జైల్లో ఉండగానే ఎంపీగా గెలిచాడు. 2007లో కింది కోర్టు మరణశిక్ష విధించింది. దాంతో స్వతంత్ర భారత చరిత్రలో మరణశిక్ష పడ్డ తొలి రాజకీయ నాయకునిగా రికార్డుకెక్కాడు. తర్వాత దాన్ని పట్నా హైకోర్టు జీవితఖైదుగా మార్చింది. అప్పట్నుంచీ అతడు జైల్లోనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారుల హత్యకు, అత్యాచారాలకు పాల్పడ్డవారికి రెమిషన్ మంజూరు చేయరాదన్న నిబంధనను నితీశ్ సర్కారు తాజాగా తొలగించింది. ఈ మేరకు రాష్ట్ర జైలు మాన్యువల్‌ను సవరిస్తూ ఏప్రిల్ 10న నిర్ణయం తీసుకుంది. ఇది కేవలం ఆనంద్ మోహన్ విడుదల కోసమేనని అప్పట్నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. నితీశ్‌తో అతని బంధం ఇప్పటిది కాదు. వారిద్దరూ సమతా పార్టీ సహ వ్యవస్థాపకులు.


సోమవారం ఆనంద్ మోహన్ కుమారుడు చేతన్ నిశ్చితార్థంలో ఆయనతో పాటు పాల్గొన్న నితీశ్, తేజస్వి

కృష్ణయ్య... అట్టడుగు నుంచి ఎదిగిన తెలుగు తేజం

మూక దాడికి బలైన ఐఏఎస్ జి.కృష్ణయ్య తెలంగాణలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నిరుపేద దళిత కుటుంబంలో పుట్టారు. ఇల్లు గడిచేందుకు తండ్రితో పాటు కూలి పనికి వెళ్లారు. జర్నలిజం కోర్సు చేసిన అనంతరం కొంతకాలం క్లర్కుగా, లెక్చరర్‌గా పని చేశారు. 1985లో సివిల్స్ ర్యాంకు కొట్టి ఐఏఎస్‌గా బిహార్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. పేదల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారు. రోజూ విధిగా ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకునేవారు. ఆయన దొరికిన తొలి పోస్టింగే బందిపోట్లకు, కిడ్నాపర్లకు స్వర్గధామంగా పిలిచే వెస్ట్ చంపారన్ జిల్లాలో! తన పనితీరుతో జిల్లాకున్న చెడ్డపేరుతో పాటు దాని రూపురేఖలనే సమూలంగా మార్చేశారని అక్కడ ఇప్పటికీ చెప్పుకుంటారు. తర్వాత నాటి సీఎం లాలు సొంత జిల్లా గోపాల్‌గంజ్ కలెక్టర్‌గా ఉండగా హత్యకు గురయ్యారు. అప్పుడాయనకు కేవలం 35 ఏళ్లు! ఈ దారుణంపై సీఎం హోదాలో లాలు పేలవ స్పందన తీవ్ర విమర్శలపాలైంది. కృష్ణయ్యకు నివాళులర్పించేందుకు వచ్చిన లాలును వెళ్లిపొమ్మని ఆయన భార్య ఉమా దేవి తెగేసి చెప్పడం అప్పట్లో సంచలనం సృష్టించింది. నేరగాళ్లను జైళ్లలోంచి విడుదల చేసి విచ్చలవిడిగా సమాజంపైకి ఉసిగొల్పే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఎక్కడుంటుందన్న ఆమె ప్రశ్న చాలాకాలం అందరి మనసులనూ తొలిచేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇప్పటికీ మాఫియా రాజ్యమే

కృష్ణయ్య భార్య ఉమ ఆవేదన



ఆనంద్ మోహన్ విడుదల వార్తతో దివంగత ఐఏఎస్ కృష్ణయ్య భార్య ఉమ షాకయ్యారు. తన గుండె పగిలిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కేవలం కొన్ని రాజ్‌పుత్ ఓట్ల కోసం ఒక దారుణమైన ఒరవడికి నితీశ్ సర్కారు శ్రీకారం చుట్టిందని దుయ్యబట్టారు. ''ఆనంద్ మోహన్ మరణశిక్ష ఇతర నేరగాళ్లకు ఓ హెచ్చరికలా, నికార్సైన అధికారులకు భరోసాగా ఉంటుందని ఆశపడ్డా. కానీ దాన్ని జీవితఖైదుకు తగ్గించారు. దానికే నేను తల్లడిల్లిపోతే ఇప్పుడేమో ఆ శిక్షనూ రద్దు చేస్తున్నారు. అప్పటికీ ఇప్పటికీ బిహార్లో మాఫియా రాజ్యమే నడుస్తోందని మరోసారి రుజువైంది. ప్రభుత్వాధికారులపై దాడులకు తెగబడేందుకు నేరగాళ్లకు ఇది మరింత ప్రోత్సాహమిస్తుంది. ఆనంద్ మోహన్ వంటి నేరగాళ్లు, వాళ్ల కుటుంబీకులే ఇంకా తమకు రాజకీయ ప్రాతినిధ్యం వహించాలా అన్నది రాజ్‌పుత్‌లు ఆలోచించుకోవాలి'' అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని ఈ నిర్ణయం రద్దయ్యేలా చూడాలని కోరారు. ''ఇలాంటి కేసుల్లో దోషులు జీవితాంతం జైల్లో గడపాల్సిందే. అందుకే నితీశ్ సర్కారు నిర్ణయంపై పట్నా హైకోర్టుకు, సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచన ఉంది. దీనిపై నా భర్త బ్యాచ్ ఐఏఎస్ అధికారులతో చర్చిస్తున్నా'' అని వెల్లడించారు. కృష్ణయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. తండ్రిని కోల్పోయేనాటికి వారికి పెద్ద కూతురు నిహారికకు ఏడేళ్లు, చిన్నమ్మాయి పద్మకు ఐదేళ్లు. వారిని తీసుకుని ఉమ హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా రిటైరయ్యారు. నిహారిక బ్యాంక్ మేనేజర్‌గా, పద్మ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు.

ఉడుకుతున్న పప్పులు

భగ్గుమంటున్న ధరలు, కేంద్రం అప్రమత్తం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పప్పుధాన్యాల ధరలు పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ళ వానల కారణంగా చాలా రాష్ట్రాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. ఈ ప్రభావం పప్పు ధాన్యాల ధరలపై పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు ప్రారంభించింది. పప్పు ధాన్యాల నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించాలని టోకు వ్యాపారులు, మిల్లర్లను ఆదేశించింది. అంతేకాకుండా దిగుమతులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. దేశంలో పప్పు ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 1.67 కోట్ల హెక్టార్లు కాగా, గత ఏడాది 1.27 కోట్ల హెక్టార్లకు పడిపోయింది. కంది, మినుము అధికంగా సాగయ్యే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో ఈ నష్టం మరింత పెరుగనుంది. ఫలితంగా ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది కందిపప్పు ఉత్పత్తి 36 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వాస్తవానికి ఇది గత ఏడాది ఉత్పత్తి కంటే 6 లక్షల మెట్రిక్ టన్నులు తక్కువ. మినప ఉత్పత్తితోనూ 3 నుంచి 5 శాతం తగ్గుదల కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గడిచిన నెల రోజులుగా పప్పుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. గ్రేడ్-1 కందిపప్పు ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో కిలో రూ.125 నుంచి రూ.135 దాకా పలుకుతోంది. మిగతా పప్పుల ధరలు సైతం 8 నుంచి 10 శాతం వరకూ పెరిగాయి. దేశీయ, విదేశీ మార్కెట్లలో పప్పుల లభ్యత, ధరలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం పప్పు ధాన్యాల స్టాక్ హోల్డర్లు, టోకు వ్యాపారులు, రిటైలర్లు, మిల్లర్లు తమ వద్ద ఉన్న నిల్వలను బహిర్గతం చేయాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా 28.66 లక్షల టన్నుల పప్పు ధాన్యాల నిల్వలు ఉన్నట్టు ప్రభుత్వం తెల్పింది. వివిధ పోర్టుల్లో ఉన్న నిల్వలను పరిశీలించింది. ఈ వివరాలను నాఫెడ్ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ఎక్కడైనా నిల్వలు తగ్గిపోతే మరొక చోటు నుంచి దిగుమతి చేసుకోవాలని సూచించింది. కంది, పెసర, మినప పప్పుల ధరలు పెరగకుండా చూడాలని అధికారులకు కేంద్ర ఆహార శాఖ ఆదేశాలు జారీ చేసింది.


వజ్రాలు పొదిగిన దంతాల సెట్ ఇది. ఓ కస్టమర్ ఆర్డర్ మేరకు సూరత్‌లో ఓ వజ్రాభరణాల సంస్థ దీన్ని తయారు చేసింది.

బాదల్ కన్నుమూత



చండీగఢ్/న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ అగ్రనేత ప్రకాశ్‌సింగ్ బాదల్ (95) ఇక లేరు. చాలారోజులుగా మొహాలీలోని ఓ ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయన ఏడాది జనవరిలో కరోనా బారినపడి కోలుకున్నారు. గ్యాస్ట్రైటిస్, బ్రాంకియల్ ఆస్తమాతో బాధపడుతూ గత ఏడాది జూన్‌లో మళ్లీ చికిత్స పొందారు.

ఐదుసార్లు పంజాబ్ సీఎం


బాదల్ 1927 డిసెంబర్ 8న పంజాబ్‌లోని అబుల్ ఖురానా గ్రామంలో జాట్ సిక్కు కుటుంబంలో జన్మించారు. లాహోర్‌లోని ఫార్మన్ క్రిస్టియన్ కాలేజీలో చదివారు. 1947లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. గ్రామ సర్పంచ్‌గా, బ్లాక్ సమితి చైర్మన్‌గా మొదలై 1957లో కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యే అయ్యారు. 1969లో శిరోమణి అకాలీ దళ్ టికెట్‌పై మళ్లీ గెలిచారు. 1986లో శిరోమణి అకాలీ దళ్ (బాదల్) పార్టీని స్థాపించారు. 1970-71, 1977-80, 1997-2002, 2007-2012, 2012-2017 ఇలా ఐదుసార్లు పంజాబ్ సీఎంగా చేశారు. గతేడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో 13వసారి పోటీ చేశారు. దేశంలోనే అత్యంత వృద్ధ అభ్యర్థిగా రికార్డుకెక్కినా ఓటమి పాలయ్యారు. ఏడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయనకిది రెండో ఓటమి. ఎంపీగా కూడా నెగ్గిన ఆయన కేంద్ర వ్యవసాయ, సాగునీటి పారుదల మంత్రిగా పనిచేశారు. ఆయన భార్య సురీందర్ కౌర్ 2011లో మరణించారు. కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పంజాబ్ ఉప ముఖ్యమంత్రిగా చేశారు.

గొప్ప నాయకుడు బాదల్: మోదీ

బాదల్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం తనకు వ్యక్తిగతంగా నష్టమన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన గొప్ప నాయకుడు, ఉన్నత రాజనీతిజ్ఞుడు అని కీర్తించారు. పంజాబ్ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. ఎన్నో సంక్షోభాల నుంచి పంజాబ్‌ను గట్టెక్కించారంటూ మోదీ ట్వీట్ చేశారు. బాదల్ నుంచి తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తదితరులు బాదల్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

మళ్లీ ఎన్నికల బరిలోకి

అమెరికా అధ్యక్షుడు బైడెన్ అధికారిక ప్రకటన ● మళ్లీ రన్నింగ్ మేట్‌గా ఉపాధ్యక్షురాలు కమల



వాషింగ్టన్: అసంపూర్తిగా ఉన్న బాధ్యతలను పూర్తి చేసేందుకు తనకు మరో అవకాశమివ్వాలని అమెరికా ప్రజలను అధ్యక్షుడు జో బైడెన్ (80) కోరారు. వచ్చే ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నికల బరిలో దిగుతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన మూడు నిమిషాల వీడియోతో ఎన్నికల ప్రచారానికి ఆయన అధికారికంగా శ్రీకారం చుట్టారు. భారత సంతతికి చెందిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌నే మరోసారి తన రన్నింగ్ మేట్‌గా ఎంచుకున్నారు. డెమొక్రటిక్ పార్టీకి చెందిన బైడెన్ అమెరికా చరిత్రలో అత్యంత ఎక్కువ వయసున్న అధ్యక్షుడు. ఇక కమల దేశ తొలి మహిళా వైస్ ప్రెసిడెంట్‌గారికార్డు సృష్టించారు.

బైడెన్‌పై ట్రంప్ ధ్వజం: బైడెన్ అమెరికా చరిత్రలోనే అత్యంత అవినీతిపరుడైన అధ్యక్షుడని ట్రంప్ ఆరోపించారు. ''ప్రపంచ వేదికపై దేశ పరువు ప్రతిష్ఠలను ఆయన పూర్తిగా మంటగలిపారు. తన చేతగానితనంతో అమెరికాను మూడో ప్రపంచ యుద్ధం ముంగిట నిలబెట్టారు'' అంటూ నిప్పులు చెరిగారు. బైడెన్ అధికార ప్రకటనకు కాస్త ముందు ట్రంప్ మీడియాతో మాట్లాడారు. అఫ్గానిస్తాన్ నుంచి వైదొలగడాన్ని అమెరికా చరిత్రలోనే అత్యంత సిగ్గుచేటైన విషయంగా అభివర్ణించారు.

రిపబ్లికన్ల అతివాదంపై పోరు

2024 ఎన్నిలను రిపబ్లికన్ల అతివాదంపై పోరుగా బైడెన్ అభివర్ణించారు. అబార్షన్ హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక భద్రత చట్రం వంటివి ఎన్నికల్లో ప్రధానాంశాలన్నారు. ''గత అధ్యక్ష ఎన్నికలను అమెరికా ఆత్మను పరిరక్షించేందుకు జరిగిన పోరు. అదింకా కొనసాగుతూనే ఉంది. మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, హక్కులు ముమ్ముందు మరింత వికసిస్తాయా, కుదించుకుపోతాయా అన్నది ఇప్పుడు మనందరి ముందున్న పెద్ద ప్రశ్న. రానున్న ఎన్నికలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పిడికిలి బిగించేందుకు తరానికి ఒక్కసారే వచ్చే అవకాశం. రండి అందరమూ కలిసికట్టుగా పని పూర్తి చేద్దాం'' అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో కలిసి రావాల్సిందిగా అనంతరం కమల కూడా ఒక ప్రకటనలో అమెరికన్లకు పిలుపునిచ్చారు. ''దేశ చరిత్రలో ఇది అత్యంత కీలక సమయం. స్వేచ్ఛ తదితర మౌలిక హక్కులపై రిపబ్లికన్ అతివాదుల దాడి నానాటికీ పెరిగిపోతోంది. మహిళకు తన శరీరానికి సంబంధించిన నిర్ణయాలపై హక్కులను హరించజూస్తున్నారు. ఓటు హక్కునూ వదల్లేదు. ప్రజల గొంతు నొక్కేందుకూ ప్రయత్నిస్తున్నారు. రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్న వాళ్లు దేశాన్ని తిరోగమనంలోకి నెట్టజూస్తున్నారు'' అంటూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. రిపబ్లికన్ల తరఫున అధ్యక్ష అభ్యర్థి రేసులో ట్రంప్ ముందున్న విషయం తెలిసిందే. భారత అమెరికన్లు నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి తదితరులు ఆయనకు పోటీదారులుగా ఉన్నారు.



ముస్లింలకు మే 9 దాకా కోటా

కర్ణాటక ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ/ధార్వాడ: కర్ణాటకలో రిజర్వేషన్లలో ముస్లింలకు 4 శాతం కోటాను మే 9వ తేదీ దాకా కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వారికి 4 శాతం కోటాను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కౌంటర్ దాఖలుకు గడువు కోరడంతో తదుపరి విచారణను మే 9వ తేదీకి వాయిదా వేసింది. విచారణ పూర్తయ్యేదాకా ముస్లింలకు 4 శాతం కోటాను నిర్ణయాన్ని అమలు చేయబోమని కర్ణాటక సీఎం బసవరాజ్ బొమ్మై చెప్పారు.

పాక్ ఠాణాలో భారీ పేలుళ్లు

18 మంది మృతి, 70 మందికి గాయాలు

పెషావర్: పాకిస్తాన్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో భారీగా సంభవించిన పేలుళ్లతో 18 మంది చనిపోగా, మరో 70 మంది గాయాలపాలయ్యారు. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని స్వాత్ జిల్లా కబాల్‌లోని కబాల్ ఉగ్ర వ్యతిరేక విభాగం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దీని వెనుక ఉగ్రకోణం లేదని, విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని పోలీసులన్నారు. మృతుల్లో ఒక చిన్నారి, 12 మంది పోలీసులు, ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులు సహా నలుగురు ఖైదీలున్నట్టు చెప్పారు. పేలుళ్ల తీవ్రతకు పక్కనున్న మసీదులు, ఇళ్లు, స్కూల్ భవనం గోడలు, పైకప్పు కూడా కూలిపోయాయి.

సూడాన్‌ను వీడిన 278 మంది భారతీయులు

న్యూఢిల్లీ: హింస, అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న సూడాన్ నుంచి భారతీయులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కావేరి' మొదలైంది. భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్ సుమేధ' నౌక తొలి విడతగా 278 భారతీయులతో మంగళవారం సూడాన్ పోర్టు నుంచి సౌదీ అరేబియాలోని జెద్దాకు బయలుదేరింది. విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి ఈ మేరకు ట్వీట్ చేశారు. వారిని భారత్ చేర్చేందుకు జెద్దాలో రెండు విమానాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు.

ఆక్రమణలో సూడాన్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్

జెనీవా: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని నేషనల్ హెల్త్ ల్యాబ్ ఆక్రమణకు గురైందని ఐక్యరాజ్యసమితి మంగళవారం వెల్లడించింది. వైరి పక్షాలైన ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్(ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్)లో ఒకరు ఈ ల్యాబ్‌ను ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపింది. 12 రోజులుగా ఆగని ఆధిపత్య పోరుతో సామాన్యులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న వేళ ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామమని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూడాన్ ప్రతినిధి డాక్టర్ నీమా సయీద్ అబిద్ అన్నారు. ల్యాబ్‌లో కలరా, మీజిల్స్, పోలియో తదితర వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాలున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ల్యాబ్‌కు అతి సమీపంలోనే ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్ భీకర పోరు సాగిస్తున్నాయి. సూడాన్‌లోని మూడో వంతు అంటే 1.6 కోట్ల మందికి తక్షణం సాయం అవసరమని ఐరాస అంచనా వేసింది.

కాలుష్యంతో శిశువుల్లో మానసిక సమస్యలు

న్యూఢిల్లీ: వాయు కాలుష్యం, నాణ్యత లేని గాలి కారణంగా భారత్‌లో రెండేళ్ల లోపు శిశువుల్లో మానసికంగా ఎదుగుదల సమస్యలు తలెత్తుతున్నట్లు అధ్యయనంలో తేలింది. సాధారణంగా రెండేళ్ల లోపు వయసున్న శిశువుల్లో మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ వయసులో స్పర్శ, అనుభవం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. జ్ఞానేంద్రియాలను పూర్తిగా ఉపయోగించుకుంటారు. కాలుష్యంతో కూడిన గాలిని పీల్చడం వల్ల మెదడు అభివృద్ధిలో వేగం మందగిస్తుందని, ఈ ప్రతికూల ప్రభావం జీవితాంతం ఉంటుందని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనంలో తేలింది. వాయు కాలుష్యం వల్ల శిశువుల్లో మానసికపరమైన ఎదుగుదలతో పాటు భావోద్వేగ, ప్రవర్తన సంబంధిత సమస్యలు తలెత్తుతాయని, ఇవి వారి కుటుంబాలపైనా తీవ్ర ప్రభావం చూపుతాయని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా పరిశోధకుడు ప్రొఫెసర్ జాన్ స్పెన్సర్ చెప్పారు.

రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి

కేరళలో వాటర్ మెట్రోను ప్రారంభించిన ప్రధాని మోదీ ● రాష్ట్రంలో మొట్టమొదటి వందేభారత్ రైలు కూడా..

తిరువనంతపురం: రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం వేగంగా పురోగతి సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. కేరళ పర్యటనలో ఆయన కోచి వాటర్ మెట్రోను, రాష్ట్రంలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం ప్రారంభించారు. రూ.3,200 కోట్ల విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో దిండిగల్-పళని-పాలక్కాడ్ సెక్షన్ విద్యుదీకరణ, దేశంలోనే మొట్టమొదటి డిజిటల్ సైన్స్ పార్క్ ఉన్నాయి. మోదీ కేరళ సంప్రదాయ దుస్తుతో కార్యక్రమంలో పాల్గొన్నారు. 'కేంద్రం సహకార సమాఖ్య విధానానికి పెద్దపీట వేస్తుంది. దేశం అభివృద్ధి పథంలో పయనించడానికి రాష్ట్రాల అభివృద్ధి కీలకమని విశ్వసిస్తోంది. కాబట్టే, కేరళ అభివృద్ధి చెందితేనే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది' అని చెప్పారు. అక్షరాస్యులు, కష్టపడే తత్వం ఉన్న మేధావులు, ప్రపంచ ఆర్థిక స్థితిగతులను గురించి అవగాహన ఉన్న వారంటూ కేరళీయులపై ప్రశంసలు కురిపించారు. 'అనేక దేశాలు సమస్యలతో సతమతమవుతున్న సమయంలో భారత్ అభివృద్ధి విషయంలో భారత్ చురుగ్గా ముందుకు వెళుతోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయి. దేశ పురోగతికి విదేశాల్లోని భారతీయులు ఎంతో సాయపడుతున్నారు. ఇదే అభివృద్ధిని కొనసాగించేందుకు అవసరమైన మౌలిక వసరుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10 లక్షల కోట్లను ప్రత్యేకించింది' అని ప్రధాని వెల్లడించారు. కనెక్టివిటీని మరింతగా పెంచేందుకు దేశీయ సాంకేతికతతో సెమీ-హైబ్రిడ్ ట్రెయిన్, రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం, రొ-రొ ఫెర్రీ, రోప్‌వే వంటివి చేపడతామన్నారు. అనుసంధానత ఫలితంగా ప్రాంతాల మధ్య దూరంతోపాటు ప్రజల మధ్య అంతరాలు కూడా సమసిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రసంగించారు. రాష్ట్రంలో వందేభారత్ రైలు వేగం 18-24 నెలల్లోపు 100 కిలోమీటర్లకు, 36-48 నెలల్లో 150 కిలోమీటర్లకు పెరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రధాని పలువురు ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో సమావేశమయ్యారు.

విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని

అంతకుముందు ఉదయం కొచ్చి నుంచి తిరువనంతపురం విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని..అక్కడిన నుంచి సెంట్రల్ రైల్వే స్టేషన్ వరకు ఆరు కిలోమీటర్ల మేర రోడ్ షో చేపట్టారు. రోడ్డుకిరువైపులా భారీ సంఖ్యలో నిలబడిన ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించి, 'మోదీ, మోదీ' అంటూ డోలు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. తన వాహనం ఫుట్‌బోర్డుపై నిలబడి చేతులు ఊపుతూ ప్రజలకు అభివాదం చేశారు. రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి తిరువనంతపురం-కాసర్‌గోడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఒక బోగీలో ఉన్న పాఠశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. రైలులో విద్యార్థుల తల్లిదండ్రులు, కొందరు టీచర్లు కూడా ప్రయాణించారు.


ప్రధాని ప్రారంభించిన వాటర్ మెట్రో. (ఇన్‌సెట్లో) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో చిన్నారులతో మోదీ

వాటర్ మెట్రో ప్రత్యేకతలు..

అత్యాధునిక వసతులు, భద్రతా ప్రమాణాలు కొచ్చి వాటర్ మెట్రో సొంతం. హైబ్రిడ్, బ్యాటరీతో నడిచే ఎయిర్ కండిషన్డ్ బోట్లు ఇందులో ఉంటాయి. వీటిని రైలు బోగీల మాదిరిగా తయారు చేశారు. మెట్రో రైలులో మాదిరిగానే ఇందులోనూ సేవలు ఉంటాయి. 10 సమీప దీవుల నుంచి కొచ్చికి రూపొందించిన ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1,136 కోట్లు. ఇది ఈ నెల 26న మొదలవుతుంది.

సాక్షి
కరీంనగర్

వైభవంగా ఎల్లమ్మతల్లి బోనాలు



కరీంనగర్‌కల్చరల్: డప్పుచప్పుళ్లు.. నెత్తిన బోనాలు.. పోతురాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. వెల్లివిరిసిన భక్తి పారవశ్యం నడుమ మంగళవారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నగరంలో ఎల్లమ్మతల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మాచర్ల ప్రసాద్, కిరణ్‌గౌడ్, కలర్ సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023

బీఆర్‌ఎస్‌తోనే బంగారు భవిత

కార్యకర్తలే బలం-బలగం.. వారిని కడుపుల పెట్టుకుంటాం



ప్లీనరీకి హాజరైన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

- మూడోసారి రాష్ట్రంలో అధికారం మనదే..
- చివరి రక్తపు బొట్టు వరకు ప్రజల కోసం పోరాటం
- మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తాం
- ప్లీనరీలో మంత్రి గంగుల కమలాకర్



బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తున్న మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న గంగుల, పక్కన మేయర్ సునీల్‌రావు తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కొత్తపల్లి(కరీంనగర్): బీఆర్‌ఎస్ పార్టీ పరిపాలనలోనే తెలంగాణకు బంగారు భవిష్యత్ ఉంటుందని బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కార్యకర్తలు లేకుంటే పార్టీ లేదని.. పార్టీకి బలం.. బలగం వారేనని, కడుపులో పెట్టుకొని చూసుకుంటామని తెలిపారు. తెలంగాణలో మూడోసారి అధికారం చేపట్టి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ సీతారాంపూర్‌లోని ఓ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ప్లీనరీ సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గంగుల మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో అందరూ సమానమేనని.. అందరి నాయకుడు కేసీఆర్ మాత్రమేనన్నారు. టీఆర్‌ఎస్ ఆవిర్భవించి 22 వసంతాలు పూర్తి చేసుకుని దిగ్విజయంగా 23వ వసంతంలోకి అడుగిడుతుండటం సంతోషదాయకమని చెప్పారు. ఇదే ఉత్సాహంతో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ 90కి పైగా అసెంబ్లీ సీట్లు సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తుందని, అదేవిధంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ పార్టీయే గెలుస్తుందని చెప్పారు. తనకు తల్లిదండ్రులు జన్మనిస్తే.. కార్యకర్తలు రాజకీయ జన్మనిచ్చారని.. సీఎం కేసీఆర్ కీర్తినిచ్చారని గుర్తుచేసుకున్నారు.

రాబోయే తరాల కోసం..!

రాబోయే తరాల భవిష్యత్తు అంధకారం కావద్దంటే బీఆర్‌ఎస్‌ను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిదన్నారు. సమైక్య పాలనలో దగాపడ్డ తెలంగాణను ప్రపంచస్థాయిలో నిలబెట్టిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌లకే దక్కిందన్నారు. అదేస్ఫూర్తితో కరీంనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచుతూ హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌ను రెండో నగరంగా నిలబెడతానని హామీ ఇచ్చారు. కరీంనగర్ అంటే ఇప్పుడు కళోత్సవాలు.. బ్రహ్మోత్సవాలు.. సినిమా ఉత్సవాలకు అడ్డాగా మారిందని, నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తే ప్రస్తుతం కోటి 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి పర్యాటకులను ఆకర్షించేలా కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్‌లను నిర్మించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ పార్టీలు అధికారంలోకి వస్తే తెలంగాణ ఆగమవుతుందని, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. మే నెలలో టీటీడీ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. నగర మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణిహరిశంకర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, ఎంపీపీలు, పిల్లి శ్రీలతమహేశ్, తిప్పర్తి లక్ష్మయ్య, జెడ్పీటీసీ, పిట్టల కరుణ, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ పి.శ్యాంసుందర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ ఫక్రుద్దీన్, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లీనరీలో చమక్కులు..!

- వేదిక మీద కళాకారులు పాటలు పాడుతున్న క్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు ఎడ్ల అశోక్ తదితరులు నృత్యాలు చేసి సందడి చేశారు.
- వేదిక మీద నుంచి వాకర్ సాయంతో నడుస్తూ.. మంత్రి గంగుల కమలాకర్ అన్నీ తానై వ్యవహరించారు.
- భోజనాల అనంతరం రాజశ్రీ గార్డెన్స్ గేట్లు తాళం వేసిన వాచ్‌మెన్ భోజనానికి వెళ్లడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది.

12 అంశాలపై తీర్మానం..

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ప్లీనరీలో భాగంగా 12 అంశాలపై చర్చించి తీర్మానించారు. పట్టణ ప్రగతిపై మేయర్ వై.సునీల్ రావు, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, వ్యవసాయం-రైతు సంక్షేమంపై పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యామ్‌సుందర్ రెడ్డి, మంద రాయమల్లు, బీసీ సంక్షేమంపై కౌన్సిలర్ వాసాల రమేశ్, ధన్యవాద తీర్మానాన్ని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ప్రవేశపెట్టారు. మొత్తం 12 తీర్మానాలకు ఆమోదం తెలిపారు.

న్యూస్‌రీల్

మత్తు డాక్టర్ లేక 4 గంటలు నిలిచిన ప్రసవాలు

- ఎంసీహెచ్‌లో తీవ్ర ఇబ్బందులు పడ్డ గర్భిణులు
- వైద్యులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగిన బంధువులు

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలోనే అత్యధిక ప్రసవాలు జరిగే కరీంనగర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మత్తు వైద్యుడు లేక మంగళవారం 4 గంటలపాటు సిజేరియన్ ప్రసవాలు ఆగిపోయాయి. గర్భిణుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 8 గంటలకు గర్భిణులకు సిజేరియన్ ప్రసవాలు చేసేందుకు రెడీ చేశారు. టేబుల్స్ మీదకు సైతం తీసుకెళ్లారు. ఎంతకీ మత్తు డాక్టర్ రాకపోవడంతో మళ్లీ వార్డుల్లోకి షిఫ్టు చేశారు. దీంతో గర్భిణులు పడుతున్న ఇబ్బందులు చూసి వారి బంధువులు ఆందోళనకు దిగారు. సిజేరియన్లకు సిద్ధం చేసిన గర్భిణులకు జాప్యం వల్ల ఏదైనా అనుకోని ఆపద ఎదురైతే ఎవరు బాధ్యులంటూ వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. సిజేరియన్ ప్రసవాలు నిలిచిపోయిన విషయం తెలుసుకున్న ఆసుపత్రి అధికారులు మరో వైద్యుడిని పిలిపించారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత మత్తు డాక్టర్ రావడంతో తిరిగి సిజేరియన్ ప్రసవాలు నిర్వహించారు. ఇదే విషయమై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాలను వివరణ కోరగా... విధులకు హాజరు కావాల్సిన మత్తు వైద్యుడు వ్యక్తిగత కారణాల వల్ల రాలేదని తెలిపారు. మరో మత్తు వైద్యుడిని పిలిపించి సిజేరియన్ సెక్షన్‌లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.

ఈదురుగాలులతో విద్యుత్ సంస్థకు నష్టం

కొత్తపల్లి(కరీంనగర్): ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి జిల్లాలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనట్లు టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. 33కేవీ విద్యుత్ స్తంభాలు 4, 11కేవీ విద్యుత్ స్తంభాలు 141, ఎల్‌టీ స్తంభాలు 216, ట్రాన్స్‌ఫార్మర్లు 25 చెడిపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. విద్యుత్ సంస్థకు సుమారు రూ.17 లక్షల వరకు నష్టం జరిగినట్లు, చెడిపోయిన వాటికి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఎస్‌ఈ పేర్కొన్నారు.

తగ్గిన పత్తి ధర

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గుతున్నాయి. సోమవారం క్వింటాల్‌కు రూ.7,800 కాగా మంగళవారం రూ.100 తగ్గి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,700 పలికింది. మార్కెట్‌కు 49 వాహనాల్లో 629 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.7,000 చెల్లించారు. గన్నీ సంచుల్లో ఆరుగురు రైతులు 14 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.5,800 పలికింది. కాగా మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలను సూపర్‌వైజర్లు లక్ష్మణ్, యాకయ్య పర్యవేక్షించారు.

పగలు ఎండ.. రాత్రి వాన

- మూడు రోజులుగా వింత పరిస్థితి
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న రైతులు
- ధాన్యం ఆరబోయడంలో ఇబ్బందులు



వర్షానికి తడవకుండా పరదాలు కప్పిన రైతులు



ఈ ఫొటోలో వడ్లు నేర్పుతున్న రైతు పేరు సిలివేరు రాంచంద్రం. వీణవంక మండలం బేతిగల్ గ్రామం. తనకున్న 3.20 ఎకరాలలో వరి సాగు చేశాడు. మూడు రోజుల క్రితం కోత కోశాడు. సుమారు వంద బస్తాల ధాన్యం దిగుబడి రాగా అకాల వర్షాలు రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందోననే భయంతో ఉదయం 6 గంటలకు వడ్ల వద్దకు వెళ్లి రాత్రి 7 గంటలకు ఇంటికి వస్తున్నాడు. ఉదయం వడ్లు ఆరబోయడం.. సాయంత్రం కుప్ప పోయడం. ఇలా మూడు రోజులుగా శ్రమిస్తున్నాడు. వడ్లు తడవకుండా ఉండేందుకు ఇంటిల్లిపాది అక్కడే ఉండాల్సిన దుస్థితి తలెత్తిందని సదరు రైతు వాపోయాడు. ఈ పాడు వాన ఎప్పుడు వస్తుందో తెలువడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పగలు ఎండకొట్టడం, రాత్రి వాన పడటం ఇదెక్కడి గోస అని వాపోయాడు.

వీణవంక: అకాల వర్షాలు రైతులు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. వరి కోసిన రైతులు, వరి కోయని రైతులు పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. వడ్లు ఆరబోయడం, మబ్బులు కమ్ముకోవడంతో కుప్పలు పోయడం రైతులకు తలకుమించిన భారంగా మారింది. మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా ఇదే దుస్థితి.

ఎండ.. వాన

జిల్లావ్యాప్తంగా మరో వారం రోజుల్లో వరి కోతలు పూర్తి కానున్నాయి. కానీ.. అకాల వర్షాలతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఎకరం వడ్లు ఆరబోయడానికి ఇద్దరు కూలీలు అవసరం. ఈ లెక్కన ఒక్కో కూలికి రూ.350 చొప్పున రోజుకు రూ.700 ఖర్చు చేయాల్సిందేనని రైతులు వాపోతున్నారు. ఈ దుస్థితి 40 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదని వీణవంక మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు వాపోయాడు. ఒక్కో పరదా కిరాయి రోజుకు రూ.20 వసూళ్లు చేస్తున్నారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ఎకరాకు ట్రాక్టర్‌మిషన్ నిర్వాహకులు రూ.3 వేలు వసూళ్లు చేస్తున్నారు.

తూకంలో జాప్యం..

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ తూకం వేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మిల్లులు అలాట్ అయినప్పటికీ బస్తాలు నిల్వ చేయడానికి స్థలం లేదని మిల్లర్లు చెప్తున్నారు. దీంతో ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం ఏర్పడింది. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించారు. అయితే.. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ధాన్యం ఆరబెట్టిన తర్వాతనే మిల్లులకు తీసుకురావాలని కేంద్రాల నిర్వాహకులు అంటుండడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా వరి సాగు వివరాలు..

వరి సాగు	95,382హెక్టార్లు
కోతలు పూర్తయినవి	51 వేల హెక్టార్లు
కోత దశలో ఉన్నవి	44, 382హెక్టార్లు
పంట దిగుబడి అంచనా	5,12,312మె.టన్నులు
కొనుగోలు కేంద్రాలకు వచ్చేవి	4,08,169 మె.టన్నులు
కొనుగోలు కేంద్రాలు	351

నష్ట పరిహారం కోసం రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన రుక్మాపూర్ రైతులు

చొప్పదండి: అకాల వర్షాలు, వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రుక్మాపూర్‌లో మంగళవారం రైతులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కరీంనగర్, రాయపట్నం రహదారిపై బైఠాయించారు. పోలీసులు రైతుల ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో దొంతిసారపు సంపత్, సత్తయ్య, కుమార్, శ్రీనివాస్, అనిల్, రాము, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు గుండెపోటు



గంగాధర: వడగండ్ల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. సోమవారం సాయంత్రం మండలంలో కురిసిన వడగండ్ల వర్షం ఓ రైతు ప్రాణం మీదకు తెచ్చింది. గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన మారాజు మల్లేశం 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేసాడు. అగ్గి, మెడవిరుపు తెగులు నివారణకు మందులు పిచికారి చేస్తూ పంటను కాపాడుకుంటూ వచ్చాడు. మరో రెండు మూడు రోజుల్లో వరి పంట చేతికొస్తుందనుకునే సమయంలో పెద్ద ఎత్తున వడగండ్ల వర్షం కురిసింది. మంగళవారం ఉదయం పంటచేను చూడటానికి వెళ్లిన మల్లేశం వడ్లు రాలిన పంట పొలాన్ని చూసి అక్కడే కుప్ప కూలాడు. చుట్టుపక్కల రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానికంగా ప్రాథమిక వైద్యం చేయించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పంట నష్టంపై కేసీఆర్‌కు పట్టింపులేదు

- ఎమ్మెల్యే ఈటల రాజేందర్



రెడ్డిపల్లిలో పంటను పరిశీలిస్తున్న ఈటల

వీణవంక: కేసీఆర్‌కు రాజకీయం తప్ప పంట నష్టంపై పట్టింపులేదని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. రైతుబంధు ఇచ్చి అన్నీ బంద్ పెట్టిన ఘనుడు కేసీఆర్ అని అన్నారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని రెడ్డిపల్లి, కోర్కల్ గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో నష్టంపై మాట్లాడారు. మార్చి, ఏప్రిల్ మాసంలో వడగండ్ల వానకు వేల ఎకరాలు దెబ్బతిన్నాయని, వరి ధాన్యం తడిచి మొలకెత్తిందని, ఎకరాకు రూ.10 వేలు ఇస్తానని సీఎం ప్రకటించి నెల దాటినా ఇంతవరకు రైతులకు చిల్లిగవ్వ ఇవ్వలేదని ఆరోపించారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతుంటే పక్క రాష్ట్రాలకు పోయి ఆబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అని మీటింగ్‌లు పెడుతున్నాడని కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని, ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కోర్కల్ గ్రామ ఉపసర్పంచ్ నేదురు మొగిళి అనారోగ్యంతో మృతి చెందగా అంతిమయాత్రలో పాల్గొన్నారు. హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లిలోనూ పంటలు పరిశీలించారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

- కలెక్టర్ కాళ్లు మొక్కిన కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి



కలెక్టర్ కాళ్లు మొక్కుతున్న పత్తి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: రెండు మూడు రోజులుగా కురుస్తున్న వడగండ్ల వానల వల్ల జిల్లా వ్యాప్తంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి కలెక్టర్ కాళ్లు మొక్కి రైతులను ఆదుకోవాలని ప్రాధేయపడ్డారు. పొన్నం మాట్లాడుతూ.. ప్రభుత్వం పార్టీ ప్లీనరీలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు.

గాలివాన బీభత్సం



మన్నెంపల్లిలో పంట వద్ద మహిళ రైతు

మానకొండూర్/తిమ్మాపూర్: మండలంలో సోమవారం, మంగళవారం కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. కల్లాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. మామిడి కాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తిమ్మాపూర్ మండలంలో వర్షానికి ధాన్యం తడిసింది. కూరగాయల రైతులకు సైతం భారీగా నష్టం కలిగింది.

కోసింది నీళ్ల పాలు.. కొయ్యంది నేల పాలు



నీట తడిసిన ధాన్యం

గంగాధర: రైతులపై ప్రకృతి పగ బట్టింది. మూడు రోజులుగా వర్షాలు వీడడం లేదు. దీంతో ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం అమ్ముకోవడానికి రైతులకు తంటాలు తప్పడం లేదు. ఇప్పటికే వరి పంటను కోసి కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన రైతులను, పంట పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట రైతులను వానలు, వడగండ్లు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే అకాల వర్షం అతలాకుతలం చేసింది. ఈదురు గాలుల వర్షంతోపాటు, వడగండ్లకు వడ్లు నీళ్ల పాలయితే, కోయని వరి చేన్లు నేల పాలయ్యాయి. జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాసులు కొట్టుకుపోయాయి. తడిసి ముద్దయ్యాయి. ధాన్యం రాశుల చుట్టూ నిలిచిన నీటిని తొలగించడానికి నానా తంటాలు పడ్డారు. రెండు మూడు రోజుల్లో కోతలకు వచ్చే పంట పొలాలు మొత్తం నేల పాలయ్యాయి. గంగాధర మండలంలోని కొండన్నపల్లి, న్యాలకొండన్నపల్లి, కురిక్యాల, ఉప్పరమల్యాల, గట్టుభూత్కూర్, కాసారం తదితర గ్రామాల్లోని పంటపొలాల్లో వరి గొలకలు మొత్తం రాలిపోయాయి.

30 శాతమే కోతలు...

మండలంలో 1,862 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా అందులో ఇప్పటివరకు 30 శాతం అంటే దాదాపు 5 వేల ఎకరాల్లోనే కోతలు పూర్తయ్యాయి. మిగితా వరి పొలాలన్నీ కోతకు వచ్చాయి. వారం పది రోజుల్లో కోతలు పూర్తయ్యే దశలో అకాల వర్షంతోపాటు, వడగండ్లు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి.

ఐదు వేల ఎకరాల్లో పంట నష్టం

ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం మండలంలో ఐదు వేల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. సోమవారం కురిసిన వడగండ్లు, వర్షాలకు 4,040 ఎకరాల్లో వరిపంట, 14 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. ఈనెల 22 కురిసిన వడగండ్లకు 1,171 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నది.

కోతకచ్చిన పంట పోయింది



నేను ఐదు ఎకరాల వ్యవసాయభూమిని కౌలు తీసుకొని వరిపంటను సాగు చేశా. నాలుగు నెల్లు గడ్డి మందు, తెగులు మందులు కొడుతూ కాపాడుకచ్చా. నీళ్లు పెట్టుడు బందు చేసి వారం రోజులయింది. మంగళవారం నాడు వరి కోత మిషిన్ వచ్చేది. అంతలోనే కాలం కన్నెర్ర చేసింది. సోమవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి వరి గొలక మొత్తం రాలిపోయింది. 60 వేల రూపాయల కౌలు, ఎకరాకు 20 వేల పెట్టుబడి పోయినట్టే. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మల్కాపురం రాజేశం, కౌలు రైతు, గట్టుభూత్కూర్

గడ్డి మిగిలింది



13 ఎకరాల్లో వరి పంటను సాగుచేసిన. ఊళ్లో రైతులందరి వరి చేన్లు కోతకు వచ్చాయి. మిషిన్ల కొరతతో కొద్దిగా ఆలస్యమయింది. రేపోమాపో కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాల్సిన వరి పంట వడగండ్ల వర్షానికి వడ్లు మొత్తం నేల పాలయ్యాయి. పంట చేనులో ప్రస్తుతం గడ్డి మాత్రమే మిగిలింది. ఇప్పుడు కోస్తే మిషిన్ డబ్బులు కూడా రావు.

– రేండ్ల శ్రీనివాస్, రైతు, కొండన్నపల్లి

క్లుప్తంగా

జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో బుధవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను డీఎంహెచ్‌వో డాక్టర్‌ లలితాదేవి ప్రకటించారు. కరీంనగర్‌ నగరంలో 2,3,9,23, 24,25,26, 34,38, 50,52,59వ డివిజన్‌లలో, హుజురాబాద్‌ పట్టణం 20వ వార్డు, అదే మండలంలోని సింగాపూర్‌, రాంపూర్‌లో శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 15వ వార్డు, అదే మండలం పాపయ్యపల్లి, మాచినపల్లి, వీణవంక మండలం మల్లన్నపల్లి, వల్బాపూర్‌, చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి, నవాబుపేట, చొప్పదండి మండలం ఆర్నకొండ, చిట్యాలపల్లి, ఇల్లందకుంట మండలం సీతంపేట, గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌, గట్టు బూత్కూర్‌, రామడుగు మండలం వెలిచాల, దత్తోజిపేట, కొత్తపల్లి మండలం చింతకుంట, ఖాజీపూర్‌, కరీంనగర్‌ రూరల్‌ మండలం దుర్శేడ్‌, మానకొండూరు మండలం గట్టుదుద్దెనపల్లి, అన్నారం, రంగంపేట, దేవంపల్లి, సైదాపూర్‌ మండలం జాగీర్‌పల్లి, రాయికల్‌, కేశవపట్నం మండలం గద్దపాక, ఇప్పలపల్లి, తిమ్మాపూర్‌ మండలం మొగిలిపాలెం, పోలంపల్లి, గొల్లపల్లి, గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్‌ స్టేషన్‌ తనిఖీ



తనిఖీ చేస్తున్న వెంకటేశ్వర్లు

విద్యానగర్‌(కరీంనగర్‌): కరీంనగర్‌ బస్‌ స్టేషన్‌ను మంగళవారం కరీంనగర్‌ జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ వి.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. స్టేషన్‌లో ప్రయాణికులకు చల్లటి తాగు నీరు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వాటర్‌ కూలర్లను పరిశీలించారు. ప్లాట్‌ఫారాలపై ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్టేషన్‌ మేనేజర్‌ అంజయ్యకు సూచించారు. తనిఖీలో ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ సెక్రెటరీ యుగంధర్‌రెడ్డి, సూపర్‌వైజర్‌ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్‌ యువర్‌ ఆర్‌ఎం

విద్యానగర్‌(కరీంనగర్‌): ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలోని ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి తమ సేవలను మెరుగుపరుచుకోవడానికి బుధవారం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు డయల్‌ యువర్‌ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కరీంనగర్‌ రీజనల్‌ మేనేజర్‌ ఖుస్రో షా ఖాన్‌ తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 25914 నంబర్‌కు కాల్‌ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

సమ్మెలో 27 మంది ఆర్టిజన్లు

కొత్తపల్లి(కరీంనగర్‌): విద్యుత్‌ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ తెలంగాణ విద్యుత్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో ఆర్టిజన్లు సమ్మెలోకి వెళ్లారు. టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌ కరీంనగర్‌, హుజురాబాద్‌ డివిజన్ల నుంచి 27 మంది ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొనగా, ట్రాన్స్‌కో నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 400 మంది ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొన్నట్లు తెలిసింది. ఆర్టిజన్లు సమ్మెకు వెళ్లడంతో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌ కరీంనగర్‌ సర్కిల్‌ ఎస్‌ఈ వి.గంగాధర్‌ మంగళవారం పలు డివిజన్లలో పర్యటిస్తూ పర్యవేక్షించారు. వినియోగదారులకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.

పంట నష్టంపై సర్వే

- తడిసిన ధాన్యం కొనుగోలు
- రైతులు అధైర్యపడొద్దు
- కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌

కరీంనగర్‌రూరల్‌/చొప్పదండి: భారీ వర్షాలు, వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులెవరూ అధైర్యపడొద్దని, సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ తెలిపారు. మంగళవారం కరీంనగర్‌ మండలం నగునూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, తడిసినప్పటికీ కొనుగోలు చేస్తారని చెప్పారు. ధాన్యం తడువకుండా టార్పాలిన్లను ఉపయోగించాలని సూచించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైసుమిల్లులకు పంపించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం వడగండ్లతో నష్టపోయిన రైతు దామరపల్లి బాపురెడ్డి వరి పంటను పరిశీలించారు. పంట నష్టం వివరాలను జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతువారీగా పంట నష్టం వివరాలను సేకరించి నివేదికను రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ శ్రీధర్‌, కరీంనగర్‌ సింగిల్‌విండో డైరెక్టర్‌ సాయిల్ల మహేందర్‌, ఏవో సత్యం, ఏఈవో జాఫరుల్లా తదితరులు పాల్గొన్నారు.



నగునూరులో నేలకొరిగిన వరిపంటను పరిశీలిస్తున్న కలెక్టర్‌ కర్ణన్‌

పంటల నష్టాన్ని సర్వే చేయండి

వానకు దెబ్బతిన్న పంటలను సర్వే చేయాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. చొప్పదండి మండలంలోని చాకుంటలో మంగళవారం దెబ్బతిన్న వరి, పచ్చి మిర్చి పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ చిలుక రవీందర్‌, తహశీల్దార్‌ అంబటి రజిత, ఏవో వంశీక్రిష్ణ, పెద్ది శంకర్‌ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కొత్తపల్లి(కరీంనగర్‌): వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలను అక్రమంగా అరెస్టు చేసి కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కరీంనగర్‌ కోర్టు చౌరస్తాలో పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్‌, రాష్ట్ర అధికార ప్రతినిధి డా.నగేశ్‌ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతున్న షర్మిలపై సీఎం కేసీఆర్‌ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండటాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. అలాగే షర్మిలపై కేసులకు సీఎం బాధ్యత వహించాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో నియంత, దుర్మార్గపు పాలన సాగుతోందని, ప్రజాబద్ధంగా ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం పోలీసులచేత అక్రమ అరెస్టులు చేయించడం సరికాదన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్‌ లీక్‌పై షర్మిల పోరాటాన్ని తీవ్రతరం చేయడంతోనే కక్షకట్టి అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, రజితారెడ్డి, రాజేశ్వర్‌, జావెద్‌, బేగ్‌, శేఖర్‌, శ్రీనివాస్‌, రియాజొద్దీన్‌, కవిత, రాజ్‌కుమార్‌ వర్మ, రోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను అరెస్ట్‌ చేయడం సరికాదు

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వ అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తున్న వైఎస్‌ షర్మిలను అరెస్టు చేయడం సరికాదని వైఎస్సార్‌టీపీ నాయకులు అన్నారు. షర్మిల అక్రమ అరెస్టుకు నిరసనగా పట్టణంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కెనపల్లి కుమార్‌ మాట్లాడుతూ, షర్మిల ఉద్యమంతో సీఎం కేసీఆర్‌ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంపై చేస్తున్న ఉద్యమాన్ని అణగదొక్కాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, జావీద్‌, రాజ్‌కుమార్‌ వర్మ, రొడ్డవేని తిరుపతి, గణేశ్‌, ఆకాశ్‌, సాయి, నాగరాజు, మహేశ్‌, రంజిత్‌, బుర్ర మహేశ్‌, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

మహిళల ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌

- అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ అభియాన్‌ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్కుల వారు రక్తహీనత, పోషకాహార లోపం లేకుండా ఆకుకూరలు, మునగాకు, ఐరన్‌తో కూడిన బలవర్ధక పదార్థాలను తీసుకొని జాగ్రత్త వహించాలని సూచించారు. తక్కువ బరువు, పోషకాహారలోపంతో బాధపడుతున్న ముగ్గురు పిల్లలను అధికారులు గుర్తించి వారిని వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వాహనంలో కరీంనగర్‌కు తరలించి వైద్యం అందించాలని ఆదేశించారు. వేసవిలో రోజూ అంగన్‌వాడీ కేంద్రాలను తెరచి పిల్లలకు పోషకాహారం అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వో లలితాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, సర్పంచ్‌ కంకణాల శ్రీలత, జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి సాజిదాఅతారి, సీడీపీఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తర్వాత ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అదనపు కలెక్టర్‌ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మండలంలోని సీతంపేటలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. అలాగే ఇల్లందకుంట, సీతంపేటలో నర్సరీలను అదనపు కలెక్టర్‌ పరిశీలించారు. సీతంపేట నర్సరీలో గతేడాది మొక్కలు ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. తర్వాత సీతంపేటలో దళిత బంధు షాపులను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు.

మానేరువాగులో ఇసుక తవ్వకాలు ఆపాలి

- ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌

హుజూరాబాద్‌: మానేరు వాగులో ఇసుక తవ్వకాలు ఆపాలని లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ హెచ్చరించారు. మంగళవారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి కార్యాలయం చెప్పగానే జీవోలు ఇస్తున్నారని, ఎల్‌ఎండీ కింద ఇసుక వచ్చే ఆస్కారమే లేదని, కానీ మానేరు వాగును చెరబట్టారన్నారు. ముఖ్యమంత్రి సడ్డకుడు రవీందర్‌ రావు ఒక ఆంధ్ర కాంట్రాక్టర్‌ను తీసుకువచ్చి మానేరు వాగులో ఇసుక కాంట్రాక్టు ఇప్పించారన్నారు. చల్లూరు, నర్సింహులపల్లి, కల్లుపల్లె, కొండపాక తదితర గ్రామాల్లో ఇసుక తవ్వకాలు వెంటనే ఆపాలని హెచ్చరించారు. వారాల తరబడి కొనుగోలు సెంటర్లు ప్రారంభం కాకపోవడంతో కల్లాల్లో ధాన్యం పోసుకొని ఎదురుచూస్తున్న రైతుల నోట్లో మట్టి కొట్టినట్టు వర్షం పాలైందని, ప్రభుత్వ జాప్యంతో రైతులను నష్టపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ధరణిపై హైకోర్టులో వేసిన కేసులో ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటి నిర్ణయం కోర్టు వెలువరించిందన్నారు. మూర్ఖపు, అనాలోచిత ముఖ్యమంత్రి నిర్ణయాల వల్ల ధరణితో లక్షల మంది రైతులకు నష్టం జరిగిందన్నారు. సొంత రాష్ట్రంలో రైతులు చస్తున్నా పట్టించుకోవడం లేదని, ఇక్కడ నష్టపోతున్నా సాయం చేయడం లేదు కానీ, ఎక్కడికో పోయి అబ్‌ కి బార్‌ కిసాన్‌ సర్కార్‌ అని తిరుగుతున్నారని విమర్శించారు. ఓడిపోయిన వాడు పైకి వచ్చాడని, గెలిచినవాడిని కింద పడేస్తున్నారని, అన్ని చిల్లర వేషాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు, సర్పంచ్‌ గోపు కోమురారెడ్డి, నాయకులు పోతుల సంజీవ్‌, నల్ల సుమన్‌, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్‌

మందుబాబులకు జైలు, జరిమానా

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌ నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన ఆరుగురిని ట్రాఫిక్‌ పోలీసులు కోర్టులో హాజరుపరచగా ఓ వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా, మిగతావారికి రూ.6,500 జరిమానా విధించారు. ఈసందర్భంగా రోజూ నగరంలో డ్రంకెన్‌ డ్రైవ్‌ స్పెషల్‌ డ్రైవ్‌లు ఉంటాయని, మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని కరీంనగర్‌ ట్రాఫిక్‌ పోలీసులు హెచ్చరించారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్‌క్రైం: అదనపు కట్నం కోసం భార్యను వేధించడం తోపాటు ఆమెపై అనుమానం పెంచుకొని రోకలిబండతో కొట్టి చంపిన నేరంలో భర్త మొగుళ్ళ పరశురాం (32)కు జీవిత ఖైదుతో పాటు రూ.17 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్‌ జిల్లా జడ్జి బి.ప్రతిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌ తెలిపిన కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన దయ్యాల కవితకు రామడుగు మండలం కిష్టరావుపల్లికి చెందిన మొగుళ్ల పరశురాంతో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. అనంతరం భార్యను అనుమానించడంతోపాటు అదనపు కట్నం కోసం వేధించగా కొంత డబ్బు చెల్లించినా అతడి తీరు మారలేదు. 2018 ఆగస్టు 14న సాయంత్రం ఇంట్లో భార్యతో గొడవపడిన పరుశురాం ఆమెను రోకలి బండతో తలపై కొట్టగా తీవ్ర గాయాలతో కవిత (25)చనిపోయింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఆశాలు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి రామడుగు ఎస్సై రవి కేసు నమోదు చేయగా అప్పటి రూరల్‌ ఏసీపీ ఉషారాణి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి ప్రతిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు.

ఓపెన్‌ టెన్త్‌, ఇంటర్‌ పరీక్షలు ప్రారంభం

కరీంనగర్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ టెన్త్‌, ఇంటర్‌ పబ్లిక్‌ పరీక్షలు జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరిగాయి. టెన్త్‌ పరీక్ష నాలుగు కేంద్రాల్లో జరుగగా 364 మంది విద్యార్థులకు గాను 314 మంది హాజరయ్యారు. ఇంటర్‌ 5 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించగా 889 మంది విద్యార్థులకు గాను 770 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జిల్లాలో టెన్త్‌ పరీక్ష ఒకే ఒక కేంద్రంలో జరుగగా ఒక్క విద్యార్థికి ఒక్కడే హాజరయ్యాడు. ఇంటర్‌ 4 కేంద్రాల్లో నిర్వహించగా 30 మంది విద్యార్థులకు గాను 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం ఉదయం 86.5 శాతం, మధ్యాహ్నం 81 శాతం నమోదు అయిందని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌ రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్‌ స్కూల్‌ కోఆర్డినేటర్‌ నాగేశ్వరరావు తెలిపారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారుల తనిఖీ

జమ్మికుంట(హుజూరాబాద్‌): రేషన్‌ బియ్యాన్ని (పీడీఎస్‌) రీసైక్లింగ్‌ చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు సివిల్‌ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్‌, టాస్క్‌ఫోర్‌ ఓఎస్‌డీ ప్రభాకర్‌ సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. వివరాలు.. పట్టణంలోని శ్రీశక్తి మిల్లు నుంచి రేషన్‌ బియ్యాన్ని రీసైక్లింగ్‌ చేసి వేరే మిల్లు ద్వారా ఏసీకేలు పంపుతున్నారని ఫిర్యాదు అందడంతో శ్రీశక్తి మిల్లులో తనిఖీలు చేపట్టారు. అప్పటికే లారీలు సివిల్‌ సప్లై గోదాంలకు వెళ్లాయనే సమాచారం మేరకు లారీ వద్దకు చేరుకున్నారు. 7 లారీల వివరాలు సేకరించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లారీలను ల్యాబ్‌ టెస్టుకు పంపాలని జిల్లా సివిల్‌ సప్లై డీఎం శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. ఆధారాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపినట్లు ఓఎస్‌డీ ప్రభాకర్‌ పేర్కొన్నారు. కాగా పట్టణంలోని శ్రీశక్తి ఇండస్ట్రీస్‌ రైస్‌ మిల్‌ నిర్వాహకులు సీఎంఆర్‌ ద్వారా ప్రభుత్వం అందించిన ధాన్యాన్ని బ్లాక్‌ మార్కెట్‌లో అమ్ముకున్నారని, రేషన్‌ బియ్యాన్ని రీసైక్లింగ్‌ చేసి, సివిల్‌ సప్లై గోదాంకు ఏసీకే ద్వారా అందిస్తున్నారని రాష్ట్ర సివిల్‌ సప్లై కార్పొరేషన్‌ కమిషనర్‌కు ఈ నెల 17న పట్టణానికి చెందిన కొండ్లే పాపయ్య ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి సివిల్‌ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్‌, టాస్క్‌ఫోర్స్‌ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న లారీలు

పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి

విద్యానగర్‌(కరీంనగర్‌): పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని ముకుందలాల్‌ మిశ్రా భవన్‌లో పశుమిత్రల జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది మహిళలు గత 8 సంవత్సరాలుగా మూగ జీవాలకు ఉచితంగా పశుమిత్ర కార్మికులుగా వైద్య సేవలు అందిస్తున్నారని, వీరికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే వారి సేవలను గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో పశుమిత్ర వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు జాడి లలిత, మనీషా, రేణుక, లిఖిత, కల్పన, రమ, స్వప్న, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ పరిశ్రమలో అగ్నిప్రమాదం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల కపిల్‌ ప్లాస్టిక్స్‌లో మంగళవారం ఉదయం షార్ట్‌ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలను చూసిన స్థానికులు ఫైర్‌ అధికారులకు సమాచారమందించగా, కరీంనగర్‌ ఫైర్‌ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. గోడలు తడిగా ఉండడంతో షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా మంటలు చెలరేగాయని గుర్తించారు. సుమారుగా రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఫైర్‌ అధికారులు అంచనా వేస్తున్నారు. కార్యక్రమంలో డివిజన్‌ ఫైర్‌ అధికారి వెంకన్న, స్టేషన్‌ ఫైర్‌ అధికారి పరమేశ్వర్‌, సిబ్బంది పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

రైతులకు న్యాయం చేయాలి

రామడుగు: వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం న్యాయం చేయాలని జిల్లా హ్యూమన్‌ రైట్స్‌ అధ్యక్షుడు పుల్లకం నరసయ్య డిమాండ్‌ చేశారు. రామడుగు మండలంలోని కుర్మపల్లిలో మంగళవారం వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించారు. అధికారులు తక్షణం సర్వే చేసి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. సర్పంచ్‌ మొగుళ్ల ఎల్లయ్య, నాయకులు మొగిలి సతీష్‌, ఎగ్గడి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న హ్యూమన్‌ రైట్స్‌ జిల్లా అధ్యక్షుడు పుల్లకం నరసయ్య

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కరీంనగర్‌: వడగండ్ల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష నష్ట పరిహారం ఇవ్వాలని బహుజన కార్మిక సంఘం రాష్ట్ర చీఫ్‌ కోఆర్డినేటర్‌ జక్కనపల్లి గణేశ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫ్యాక్స్‌ ద్వారా వినతిపత్రం పంపించారు. రైతుల నుంచి పంట కొనుగోలుకు గ్రామీణ స్థాయిలో కేంద్రాలు తక్షణమే ప్రారంభించాలన్నారు. ఆయన వెంట కన్నం లక్ష్మణ్‌, బోయిని కృష్ణబాబు, కల్లేపల్లి మనోజ్‌ కుమార్‌, ఎనగందుల అనిల్‌ తదితరులు ఉన్నారు.

పరిహారం చెల్లించాలి

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆల్‌ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎడవల్లి మసూద్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఎకరాకు రూ.20 వేల నష్ట పరిహారం ఇచ్చి, తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేశారు.

ఆర్టీసీ పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ మెడికవర్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆర్టీసీ వర్క్‌ షాప్‌లో ఆర్టీసీ పోలీస్‌ సిబ్బందికి మంగళవారం కార్డియో పల్మనరీ రెసిస్టేషన్‌ (సీపీఆర్‌)పై అవగాహన కల్పించారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న ఆకస్మిక గుండెపోటు మరణాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్డియాక్‌ అరెస్ట్‌తో వ్యక్తులు ఒక్కసారిగా కుప్పకూలినప్పుడు ఆ వ్యక్తికి దగ్గర ఉన్నవారు ఎలా స్పందించాలనే అంశంపై క్షుణ్ణంగా వివరించారు. చాతిపై రెండు చేతులతో నొక్కుతూ నోటిద్వారా కృత్రిమ శ్వాసను అందిస్తూ గుండె పనితీరును మెరుగుపరచే విధానంపై బొమ్మతో ప్రాక్టికల్‌గా చూపించారు. కార్యక్రమంలో కరీంనగర్‌, వరంగల్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, ఖమ్మం ఆర్టీసీ పోలీస్‌ సిబ్బందితో పాటు మెడికవర్‌ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌ గుర్రం కిరణ్‌, వైద్యులు డాక్టర్‌ ప్రవీణ్‌, డాక్టర్‌ రిత్విక్‌, చంద్రశేఖర్‌, ఆర్టీసీ ఆసుపత్రి సీనియర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మంజుల, ఆర్టీసీ కరీంనగర్‌ జోన్‌ విజిలెన్స్‌ అండ్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ రవీందర్‌, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

‘ఇంటెలిజెన్స్‌ సీఐ వేధింపులతోనే ఆత్మహత్య’

చొప్పదండి: భూపాలపట్నంలో ఆత్మహత్య చేసుకున్న రియల్టర్‌ బొడిగె శ్యాంది సెంట్రల్‌ ఇంటలిజెన్స్‌ సీఐ గోపాలక్రిష్ణ చేసిన హత్యగానే భావిస్తున్నట్లు పౌరహక్కుల సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని భూపాలపట్నంతోపాటు, చొప్పదండి పోలీస్‌ స్టేషన్‌లో వారు మంగళవారం పర్యటించి ఆత్మహత్యపై విచారణ జరిపారు. అనంతరం పలు వివరాలు వెల్లడించారు. భూమిపై పెట్టిన పెట్టుబడిపై అధిక మొత్తంలో లాభాల కోసం గోపాలక్రిష్ణ పలుమార్లు శ్యాంను బెదిరించడంతోనే ఆత్మహత్యకు దారితీసిందని తాము భావిస్తున్నామన్నారు. డైరీలో పది పేజీల సూసైడ్‌ నోట్‌ కూడా రాశాడని, చొప్పదండి సీఐతో చెప్పి కేసులు పెట్టిస్తానని బెదిరించారని పేర్కొన్నారు. ఈ ఆత్మహత్యపై తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి లిఖితపూర్వకంగా త్వరలోనే ఫిర్యాదు చేస్తామన్నారు. సెంట్రల్‌ సీబీఐ సీఐ గోపాలక్రిష్ణను వెంటనే అరెస్ట్‌ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వ ఆజమాయిషీలో పనిచేస్తున్న సీబీఐ, ఇతర పోలీసులు, తెలంగాణ రాష్ట్ర పోలీసులు రియల్‌ ఎస్టేట్‌లో చేస్తున్న వ్యాపారాల మాఫియాను అరికట్టాలన్నారు. బాధిత శ్యాం కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్‌, ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, గడ్డం సంజీవ్‌కుమార్‌, పోగుల రాజేశం, మోటపలుకుల వెంకట్‌, మార్వాడీ సుదర్శన్‌ తదితరులున్నారు.



చొప్పదండి ఠాణాలో పౌరహక్కుల సంఘం నాయకులు

కలెక్టరేట్‌ ఎదుట స్పౌజ్‌ బాధితుల ధర్నా



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న స్పౌజ్‌ బాధితులు

కరీంనగర్‌: రాష్ట్రంలోని 13 జిల్లాల్లో నిలుపుదలలో ఉంచిన ఎస్జీటీ, పండితుల, పీఈటీ, ఎస్‌ఏ, మిస్సింగ్‌ స్పౌజ్‌ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బాధిత ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. చేతిలో ప్లకార్డులతో భారీ ఎత్తున ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నా చేశారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మిగిలిన స్పౌజ్‌ బదిలీల ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పౌజ్‌ ఫోరమ్‌ కన్వీనర్‌ మండల ఆనందం, జావిద్‌, నాగరాజు, నిరంజన్‌, శ్రీనివాస్‌రెడ్డి, కేతిరి శ్రీనివాసరెడ్డి, వసంత, విజయలక్ష్మి, రాజమ్మ, కాంతమ్మ, కవితారెడ్డి, అర్కాల శ్రీనివాస్‌, మీసాల మల్లిక్‌, సంధ్యారాణి, షబానా, అల్లెంకి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శివపార్వతుల కల్యాణం



భగత్‌నగర్‌లోని హరిహర క్షేత్రంలో గల శివాలయంలో మంగళవారం మంగళపెల్లి రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో కొస్న కాంతారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

స్వామివారికి పుట్ట మన్ను



కొత్తపల్లి మండలం బద్దిపల్లిలోని శ్రీ అలివేలు మంగ శ్రీలక్ష్మీ సహిత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భాజా భజంత్రీల చప్పళ్లతో పుట్టమన్ను తీసుకొచ్చారు. అదే విధంగా ధ్వజారోహణం, బలిహరణం, తీర్థ ప్రసాద వితరణ, అగ్నిప్రతిష్ఠ అరిష్టక్షయణ హోమనిధి, బలిహరణం చేపట్టారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. - కొత్తపల్లి

చిత్ర కథ

ఇవేం కట్టడాలు



కరీంనగర్‌లోని తిరుమలనగర్‌లో స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా డ్రెయినేజీని నిర్మించారు. అయితే నిర్మించి నెల రోజులు కూడా గడవక ముందే సోమవారం రాత్రి కురిసిన వర్షానికి డ్రెయినేజీ పైకప్పు, సైడ్‌వాల్‌తో సహా కూలింది. చిన్న వరద తాకిడికి డ్రెయినేజీ కూలడంతో పనుల నాణ్యతపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

నర్సరీలకు వడగండ్ల దెబ్బ

- అకాల వర్షాలతో మొక్కలు ధ్వంసం
- ఈదురు గాలులకు కొట్టుకుపోయిన షెడ్ నెట్‌లు
- హరితహారానికి మొక్కలు కష్టమే

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణకు హరితహారం పథకంపై వడగండ్ల దెబ్బపడింది. హరితహారంలో భాగంగా ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతుండగా ఇటీవల ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి మొక్కలన్నీ దెబ్బతిన్నాయి. వేసవికాలంలో ఎండ తీవ్రత నుంచి మొక్కలను కాపాడేందుకు వేసిన గ్రీన్‌షెడ్లు ఈదురుగాలులకు కూలిపోయి మొక్కలపై పడటంతో నష్టం జరిగింది. నర్సరీల్లోని మొక్కలతోపాటు పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు సైతం గాలులకు విరిగిపడ్డాయి.

50వేల మొక్కలు ధ్వంసం

కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో మొత్తం 1.70 లక్షల మొక్కలు పెంచుతున్నారు. రాబోయే వర్షాకాలంలో 1.57 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ నర్సరీలో 10 వేల మొక్కల చొప్పున పెంచేందుకు ఉపాధిహామీ పథకం కింద అధికారులు చర్యలు చేపట్టారు. గత రెండు నెలలనుంచి ప్లాస్టిక్ సంచుల్లో మట్టిని నింపి విత్తనాలు వేసి ప్రతిరోజూ ఉపాధికూలీలు నీళ్లు పడుతుండటంతో మొక్కలు మొలకెత్తాయి. వేసవి ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించేందుకు వీలుగా అన్ని నర్సరీలకు గ్రీన్‌షెడ్లను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు ఫకీర్‌పేట, బహదూర్‌ఖాన్‌పేట, నగునూరు, చెర్లభూత్కూర్, చామనపల్లి, ఎలబోతారం, జూబ్లీనగర్ గ్రామాల్లోని నర్సరీల్లోని మొక్కలన్నీ దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు గ్రీన్‌షెడ్లు కూలి కింద పడటంతో దాదాపు 50 వేల మొక్కలు ధ్వంసమైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దెబ్బతిన్న మొక్కల స్థానంలో కొత్త మొక్కలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. నగునూరులో పలు మొక్కలకు సంబంధించిన నారును తెప్పించారు. అదే విధంగా ఫకీర్‌పేట, బహదూర్‌ఖాన్‌పేట, జూబ్లీనగర్ గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల్లోని చెట్లు గాలులకు విరిగిపడ్డాయి. ఉపాధికూలీలు, పంచాయతీ సిబ్బంది విరిగిన చెట్లతో పాటు కొమ్మలను తొలగించారు.



ఫకీర్‌పేటలోని నర్సరీలో ధ్వంసమైన మొక్కలు



బహదూర్‌ఖాన్‌పేట నర్సరీలో ..

కొత్త మొక్కలు పెంచేందుకు చర్యలు

అకాల వర్షాలకు నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు దెబ్బతిన్నాయి. గ్రీన్‌షెడ్లు కూలడంతో 50 వేల వరకు మొక్కలకు నష్టం జరిగింది. ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో దెబ్బతిన్న మొక్కలను తొలగించి కొత్త మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టాం.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

రైతాంగాన్ని వెంటాడుతున్న వాన



ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



శ్రీరాములపల్లెలో నేలరాలిన వరిగింజలు

కరీంనగర్‌రూరల్: యాసంగి రైతులను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. సీజన్ ప్రారంభంలో వరినాట్లేసిన వెంటనే పలు రకాల తెగుళ్లు దాడి చేయగా వేలాది రూపాయలను రైతులు ఖర్చు చేసి పంటలు కాపాడుకున్నారు. వరికోసే దశలో శనివారం నుంచి ప్రతిరోజూ సాయంత్రవేళల్లో కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పలు గ్రామాల్లో ఈదురు గాలులకు కోతకొచ్చిన వరిపంట నేలకొరిగిపోగా మరికొన్ని గ్రామాల్లో వడగండ్ల వాన దెబ్బకు వరిగింజలన్నీ నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో సరిపడే టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షం బారి నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ఒకవైపు పొద్దంతా ఎండ కాస్తుండటంతో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు సాయంత్రం కాగానే వర్షం కురుస్తుండటంతో మళ్లీ ధాన్యం కుప్పగా చేసి రక్షణగా టార్పాలిన్లు కప్పుతున్నారు.

1,190 ఎకరాల్లో రాలిన వరి గింజలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి వరి పంట నేలరాలింది. తొమ్మిది గ్రామాల్లో వరి గింజలు, మామిడి కాయలు నేలరాలినట్లు గుర్తించిన వ్యవసాయ అధికారులు ప్రాథమిక నివేదిక తయారు చేశారు. కొత్తపల్లిలో 580 ఎకరాలు, చింతకుంటలో 95 ఎకరాలు, రేకుర్తిలో 6, మల్కాపూర్‌లో 18, లక్ష్మీపూర్‌లో 20, బద్దిపల్లిలో 72, బావుపేటలో 36, కమాన్‌పూర్‌లో 126, ఎలగందులలో 252 ఎకరాల్లో వరిగింజలు నేలరాలగా.. చింతకుంటలో 5 ఎకరాలు, నాగులమల్యాలలో 8, కమాన్‌పూర్‌లో 8, కొత్తపల్లిలో 9 ఎకరాల మామిడి కాయలు రాలాయి. ఆరుగాలం శ్రమించిన పంట చేతికందే సమయంలో నేలరాలడంతో అన్నదాతలు ఆవేదనకు లోనవుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు

కరీంనగర్‌రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతోనే రైతులు కష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తీగలగుట్టపల్లి, నగునూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, టార్పాలిన్లు ఇవ్వడం లేదని పలువురు రైతులు తెలిపారు. వరద నీటిలో తడిసిన ధాన్యాన్ని చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, కాంతయ్య, శివరాం, కీర్తికుమార్, సత్యనారాయణరెడ్డి, షెహెన్షా, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

రైతువారీగా పంట నష్టం సర్వే

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయాధికారులు సేకరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని రైతువారీగా పంటల నష్టాన్ని మోఖాపై వెళ్లి పరిశీలిస్తున్నారు. శనివారం కురిసిన వడగండ్ల వానకు మొత్తం 4,004 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేసి నివేదిక ఇచ్చారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి మండల వ్యవసాయాధికారి బి. సత్యం ఆధ్వర్యంలో ఏఈవోలు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో రైతువారీగా పంట నష్టం పరిశీలిస్తున్నారు. మంగళవారం మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, జూబ్లీనగర్, చామనపల్లి, నగునూరు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించారు. 451మంది రైతులకు సంబంధించిన 908 ఎకరాల పంట నష్టాన్ని నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు వారీగా సర్వే మే 1వరకు నిర్వహించనున్నట్లు ఏవో సత్యం తెలిపారు.



వరిపంటను పరిశీలిస్తున్న ఏవో సత్యం

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు

ఈదురుగాలులతో కూడిన వర్షాల మూలంగా విద్యుత్ సరఫరాకు ఫ్లెక్సీలు ప్రతిబంధంగా తయారవుతున్నాయి. వేగంగా వీస్తున్న ఈదురు గాలులకు నగరంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు విద్యుత్ స్తంభాలపై పడుతున్నాయి. ఫ్లెక్సీల మూలంగా విద్యుత్ స్తంభంపై నిప్పురవ్వలు ఏర్పడుతూ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ ఫ్లెక్సీల తొలగింపు విద్యుత్ సిబ్బందికి ప్రమాదకరంగా పరిణమించింది. కరీంనగర్‌లోని శాస్త్రిరోడ్‌లో గల విద్యుత్ స్తంభంపై మంగళవారం రాత్రి ఫ్లెక్సీ పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే ఫ్లెక్సీల ఏర్పాటుపై ఆలోచించాలని విద్యుత్ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. - కొత్తపల్లి



క్లుప్తంగా

శంకరాచార్యుల జయంతి



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో మంగళవారం ఆదిశంకరాచార్యులు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బండ సత్తయ్య, ఉప్పుల రాజేశం, గుండ రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై శిక్షణ



విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ జోన్ పరిధిలోని సెక్యూరిటీ సిబ్బందికి మంగళవారం కరీంనగర్ ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరీంనగర్ జిల్లా ఫైర్ అధికారులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి ఎం.రవీందర్, జోనల్ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ మంజుల, డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వప్న కుమారి, విజిలెన్స్ ఆఫీస్ సిబ్బంది రమణ, దామోదర్, కరీంనగర్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ప్లాంటేషన్‌కు స్థలపరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్, ఇరుకుల్ల, చెర్లభూత్కూర్, ఎలబోతారం, నగునూరు గ్రామాల్లో మంగళవారం ఇరిగేషన్ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటే ప్రాంతాలను ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ఎస్సారెస్పీ కాలువగట్లు, చెరువులు, కుంటల కట్టలు, శిఖం స్థలాలను పరిశీలించి మొక్కలు నాటేందుకు ఎంపిక చేశారు. ఆయా స్థలాల్లో 4వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఎంపీడీవో వెంట ఎస్సారెస్పీ ఏఈ మౌనిక, ఈజీఎస్ ఈసీ పద్మ తదితరులున్నారు.

సర్టిఫికెట్లు పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ

శాతవాహనయూనివర్సిటీ: కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ సంస్కృత–వారసత్వం సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి వారసత్వానికి సంబంధించిన ప్రత్యేకమైన ఈ సర్టిఫికెట్ కోర్స్ నెల రోజులపాటు నిర్వహించి విద్యార్థులకు భారతీయ కళలు, సంస్కృతి, సాహిత్యం అంశాలతో పాటు చరిత్రను అవగాహన కల్పించినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, విభాగాధిపతి సుధాకర్ రామకిషన్, జి. రాజేందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఓదెలుకుమార్, డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ బిక్షపతి, కొమురయ్యలు పాల్గొన్నారు.

పరమేశ్వరుడి దక్షిణామూర్తి అవతారమే శంకరాచార్యులు

విద్యానగర్(కరీంనగర్): సాక్షాత్తు కైలాసదీశుడైన పరమేశ్వరుడే దక్షిణామూర్తి అవతారంగా జగద్గురు శంకరాచార్యుల రూపంలో అవతరించారని శ్రీదుర్గా భవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా నాల్గో రోజు మంగళవారం ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శంకరాచార్యులకు విశేషపూజ. మహారుద్ర పూర్ణాహుతి, భాష్యపారాయణాలు, సౌందర్యలహరి, శివానందలహరి పారాయణాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అధ్యాత్మిక ప్రసంగం చేస్తూ సనాతన వైదిక ధర్మం దారి తప్పుతున్న తరుణంలో అవతరించి వేదవ్యాసుల హృదయాన్ని ఆవిష్కరించిన మహామనిషి ఆదిశంకరాచార్యులన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహేశ్వరశర్మ

భక్తిశ్రద్ధలతో భగవద్రామానుజుల జయంతి



భగవద్రామానుజులకు పూజలు చేస్తున్న అర్చకులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలో పలు చోట్ల, విశిష్టాద్వైతపరుల సాంప్రదాయుల గృహాల్లో మంగళవారం భగవద్రామానుజాచార్యుల జయంతిని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించుకున్నారు. మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో శ్రీవైష్ణవవైదిక సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్దనగిరి శశికిరణ్ ఆచార్య, కాండూరి వేంకటేశ్వర్లు, మాడభూషణి శ్రీనివాసాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు. వేదభవనంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో అధ్యక్షుడు గౌతమరావు, సంస్థ బాధ్యులు, కార్యకర్తలు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

బాలభవన్‌లో శిక్షణ తరగతులు ప్రారంభం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని బాలభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. తరగతులను బాలభవన్ సూపరింటెండెంట్ కట్ట మంజులాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపు జూన్ 8వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటల నుంచి 12.30 గంటల వరకు సంగీతం, నృత్యం, డ్రాయింగ్, మృదంగం, టైలరింగ్, ఆర్ట్‌క్రాఫ్ట్, అబాకస్, చెస్, యోగాలో శిక్షణ ఇస్తామని అన్నారు. తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించి తమ పిల్లలకు నచ్చి అంశాల్లో శిక్షణ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగం రాధాకృష్ణ, ఎస్.కృష్ణకుమార్, కె.శ్రీధర్, రాధిక, సుహాసిని, అనూప్, పి.మల్లిక తదితరులు పాల్గొన్నారు.



తరగతులను ప్రారంభిస్తున్న కట్ట మంజులాదేవి

అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా డాక్టర్ శ్రీనివాస్



ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీనివాస్

కరీంనగర్‌టౌన్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్‌గా 2023–24 సంవత్సరానికి కరీంనగర్ జిల్లాకు చెందిన డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ నియమితులైనట్లు అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పంకజ్ శ్రీవాత్సవ తెలిపారు. ఈమేరకు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో మంగళవారం జరిగిన కాన్ఫరెన్స్‌లో డాక్టర్ కుల్దీప్ సింగ్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. డాక్టర్ శ్రీనివాస్ నియామకంపై అలయన్స్ క్లబ్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి

శాతవాహనయూనివర్సిటీ: ప్రతీ విద్యార్థి సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలని, చదువుపై దృష్టి పెడుతూనే సేవ కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మీ అన్నారు. మంగళవారం కళాశాల లియో క్లబ్ ఆధ్వర్యంలో 2కే వాక్ నిర్వహించారు. విద్యార్థులు కళాశాల నుంచి తెలంగాణ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్ రాగి వందన్ , కళాశాల లియోక్లబ్ కోఆర్డినేటర్ ఎన్.సంగీతారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ హెల్పర్‌కు గాయాలు

తిమ్మాపూర్: మండలంలోని వచ్చునూర్‌లో కరెంటు షాక్‌తో ప్రైవేట్ హెల్పర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామశివారులో ఓ రైతుకు చెందిన విద్యుత్ వైర్లు సరి చేయడానికి గొల్లపల్లికి చెందిన రేణికుంట సబ్ స్టేషన్ ప్రైవేట్ హెల్పర్ నీలం శ్రీనివాస్‌రెడ్డి వచ్చాడు. తీగలు సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సబ్ స్టేషన్ సిబ్బంది, స్థానికులు ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా తప్పుడు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా లేదని ఫ్యూజ్ వైరు దగ్గరికి వెళ్లగానే షాక్ తగిలిందని స్థానికులు తెలిపారు.

ఘనంగా బీఆర్‌ఎస్ జెండా పండుగ



పతాకావిష్కరణలో పాల్గొన్న మేయర్, కార్పొరేటర్‌లు



జెండా ఆవిష్కరించిన చల్ల హరిశంకర్

కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో బీఆర్‌ఎస్ జెండా పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని 60 డివిజన్లలో మండలాల్లోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాలను ఎగురవేశారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు, డివిజన్ల, గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాజశ్రీ గార్డెన్‌లో జరిగిన ప్లీనరీ సమావేశానికి వెళ్లారు.

- కరీంనగర్/కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు సునీత, రాజశేఖర్‌రెడ్డి

మూడు గంటలు ప్రశ్నించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డిలను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సీబీఐ కార్యాలయానికి చేరుకున్న సునీత, రాజశేఖర్‌రెడ్డిలను రాత్రి ఏడుగంటల వరకు సీబీఐ అధికారుల బృందం పలు అంశాలపై ప్రశ్నించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఓసారి రాజశేఖర్‌రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట హాజరుకాగా, మంగళవారం మరోమారు హాజరయ్యారు. సునీత తొలిసారిగా కోఠిలోని సీబీఐ కార్యాలయానికి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వచ్చారు. వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత కుటుంబ పరిస్థితులు, ఇతర అంశాలపై వారి వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు నమోదు చేసినట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ–1) గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత.. తదుపరి విచారణను నేటికి (బుధవారానికి) వాయిదా వేశారు.

ఆత్మ గౌరవంతో 'లక్ష'ణంగా..


- జూన్ నాటికి లక్ష టిడ్కో ఇళ్ల పంపిణీ

సాక్షి, అమరావతి: పట్టణ పేదలు ఆత్మ గౌరవంతో సగర్వంగా జీవించేలా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి విడతగా ఇప్పటికే 48,416 టిడ్కో ఇళ్లను పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండో దఫాలో మరో 40 వేలకు పైగా యూనిట్లను పట్టణ పేదలకు అందచేసేందుకు సిద్ధమైంది. జూన్ నాటికి మొత్తం లక్ష టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించారు. దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో భారంగా గడిపిన బడుగు జీవులు అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన టిడ్కో గృహాలకు యజమానులుగా మారుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కావలి నుంచి మొదలయ్యే టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రక్రియ జూన్ చివరి వరకు కొనసాగనుంది. కావలి మున్సిపాలిటీలో అన్ని వసతులతో పూర్తి చేసిన 2,112 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ నెల 29వతేదీన శ్రీకాకుళంలో 1,280 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

జూమ్‌లో.. కామ్‌గా | ఆధారాలు ధ్వంసం!

మార్గదర్శి యాజమాన్యం అర్ధరాత్రి 'మేనేజ్‌మెంట్'

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చెరుకూరి రామోజీరావు (ఏ–1) కీలక ఆధారాలను మాయం చేసేందుకు విఫలయత్నం చేసినట్లు బహిర్గతమైంది. మార్గదర్శి బ్రాంచ్ కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను గుట్టు చప్పుడు కాకుండా ధ్వంసం చేసినట్లు తాజాగా సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారని, అందుకోసం ఫోర్‌మెన్‌లతో ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తేలింది. ఏ ఒక్కటీ ఆధారం దొరకకుండా రికార్డులు డిలీట్ చేయాలని మార్గదర్శి చిట్స్ బ్రాంచీల సిబ్బందిని ఆదేశించిన యాజమాన్యం జూమ్ మీటింగ్‌లో అర్ధరాత్రి దాకా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించినట్లు తేలింది. మరోవైపు గత డిసెంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమ లావాదేవీలు దాదాపు స్తంభించిపోవడంతో గొలుసుకట్టు తరహా మోసాలకు అలవాటుపడిన మార్గదర్శి యాజమాన్యం కొత్త చిట్టీలు లేకపోవడంతో దిక్కులు చూస్తోంది. పాడుకున్న చిట్టీల మొత్తం కోసం చందాదారులు మార్గదర్శి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా.. రశీదు రూపంలో డిపాజిట్లు చేసిన వారిలో ఆందోళన నెలకొంది. తమ వివరాలు ఏమవుతాయోనన్న ఆందోళన ఖాతాదారుల్లో నెలకొంది.



■ అడ్డదారిలో.. గుట్టుగా

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమ వ్యవహారాల కేసులో తిమ్మిని బమ్మిని చేసేందుకు రామోజీరావు బరి తెగించారు. నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు పెట్టినట్లు తేలడంతో కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు అడ్డదారులు పట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను ధ్వంసం చేయించారు. దర్యాప్తులో ఉన్న కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయకూడదన్న నిబంధనను అతిక్రమించారు. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమంగా రూ.2,600 కోట్ల డిపాజిట్లు వసూలు చేసినట్లు 2006లో బయటపడింది. నాడు రిజర్వు బ్యాంకు ఆదేశాలతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు నమోదు చేసింది. దీంతో డిపాజిట్లు వసూలు చేయడం తమ తప్పిదమేనని రామోజీరావు అంగీకరించారు. ఆ కేసు దర్యాప్తులో ఉండగానే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆయన హఠాత్తుగా మూసివేశారు. ఇప్పుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో కూడా అదే తరహాలో రికార్డులను నాశనం చేసే ప్రక్రియను గుట్టు చప్పుడు కాకుండా ముగించారు.

■ అర్ధరాత్రి విధ్వంసం.. జూమ్‌లో పర్యవేక్షణ

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలను సీఐడీ అధికారులు విస్తృతం చేయడంతో బెంబేలెత్తిన రామోజీరావు తనకు అలవాటైన రీతిలో ఆధారాలను ధ్వంసం చేసేందుకు సిద్ధపడ్డారు. అందుకోసం బ్రాంచి కార్యాలయాల మేనేజర్లతో (ఫోర్‌మెన్) మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. అక్రమ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, రికార్డులు, ఇతర ఆధారాలను ఎలా ధ్వంసం చేయాలో వారికి క్షుణ్నంగా వివరించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారు. ప్రధాన కార్యాలయానికి మళ్లించిన చందాదారుల నగదు వివరాలు, భారీగా నిధుల తరలింపు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల వసూలు, పాట పాడిన చందాదారులకు చిట్టీ మొత్తం ఇవ్వకుండా కొంత మొత్తాన్ని అక్రమ డిపాజిట్‌గా అట్టిపెట్టడం, యాజమాన్య వాటా కింద అట్టిపెట్టిన చిట్టీల టికెట్లు, వాటిపై చందా చెల్లించకుండానే చెల్లించినట్టుగా మాయ చేయడం.. వీటన్నింటికి సంబంధించిన రికార్డులు, పత్రాలను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ ఎలా ధ్వంసం చేయాలో మార్గదర్శి ప్రధాన కార్యాలయ అధికారులు బ్రాంచి మేనేజర్లకు వివరించారు. ఆధారాల ధ్వంసం ప్రక్రియను ప్రధాన కార్యాలయం నుంచే అర్ధరాత్రి వరకూ పర్యవేక్షించారు. సీఐడీ అధికారులు తాజాగా నిర్వహించిన సోదాల్లో ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో తీవ్రంగా పరిగణిస్తున్నారు. ధ్వంసం చేసిన ఆధారాలు, ఆన్‌లైన్ రికార్డులను సీఐడీ విభాగం రిట్రీవ్ చేసింది.

డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు లేవు

మార్గదర్శి అక్రమ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో కొత్త చిట్టీలు వేసేందుకు చందాదారులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో ఆర్థిక కార్యకలాపాలు 2022 డిసెంబర్ నుంచి దాదాపుగా స్తంభించిపోయాయి. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చిట్ రిజిస్ట్రార్ స్పష్టం చేస్తుండగా రామోజీరావు ఆ చట్టాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. దీంతో కొత్త చిట్టీలు ఆగిపోయాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సోదాల్లో బయటపడిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మార్గదర్శి 37 బ్రాంచి కార్యాలయాల్లో రూ.273 కోట్ల వేలం టర్నోవర్‌తో 2,357 చిట్టీలను నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా రూ.6.29 కోట్లు వేలం టర్నోవర్ విలువ ఉన్న 148 కొత్త చిట్టీలను ప్రారంభిస్తారు. వాటిపై మార్గదర్శి యాజమాన్యానికి కమీషన్ రూపంలోనే రూ.31.45 లక్షల వస్తాయి. డిసెంబర్ నుంచి చందాదారులు ముందుకు రాకపోవడంతో ఏకంగా 1,200కుపైగా కొత్త చిట్టీలు ప్రారంభం కాలేదు. రూ.51 కోట్ల వేలం టర్నోవర్ ఉన్న చిట్టీలు నిలిచిపోయాయి. ఆ మొత్తాన్ని మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లతోపాటు తమ సొంత సంస్థల్లో పెట్టుబడిగా మళ్లించేందుకు సాధ్యం కావడం లేదు. ఇక కమీషన్ రూపంలో రూ.2.55 కోట్ల మేర మార్గదర్శి యాజమాన్యానికి రాకుండా పోయింది. కొత్త చిట్టీల కోసం చందాదారులను రప్పించేందుకు బ్రాంచి మేనేజర్ల ద్వారా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

చందాదారుల ప్రదక్షిణలు... డిపాజిట్‌దారుల్లో ఆందోళన

గతేడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు ప్రారంభం కాకపోవడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మనీ సర్క్యులేషన్ నిలిచిపోయింది. పాత చిట్టీల చందాదారులు చెల్లించిన మొత్తాన్ని రామోజీరావు అక్రమంగా తమ సొంత సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించేశారు. రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్లను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. కొత్త చిట్టీలు ప్రారంభమైతే ఆ చందాదారులు చెల్లించే మొత్తాన్ని పాత చిట్టీలు పాడిన వారికి చెల్లిస్తుంటారు. గడువు తీరిన అక్రమ డిపాజిట్ల విత్‌డ్రాయల్స్ మొత్తంగా చెల్లించడం, వడ్డీలు చెల్లించడం మొదలైన వ్యవహారాలు నిర్వహించేవారు. ప్రతి చిట్టీలోనూ యాజమాన్యం వాటా కింద అట్టిపెట్టుకున్న టికెట్ల చందా మొత్తాన్ని కూడా అవే నిధుల్లో చెల్లించినట్టు రికార్డుల్లో మాయ చేసేవారు. ఈ గొలుసు కట్టు తరహా మోసాన్ని దశాబ్దాలుగా చేస్తున్నారు. ఇప్పుడు కొత్త చిట్టీలు లేనందున మార్గదర్శి లావాదేవీలు నిలిచిపోయాయి. పాత చిట్టీలు పాడిన చందాదారులకు సకాలంలో చెల్లించడం లేదు. తాము ష్యూరిటీ సంతకాలన్నీ చేయించినా చిట్టీ మొత్తం చెల్లించకపోవడంతో చందాదారులు ఆందోళన చెందుతున్నారు. మార్గదర్శి కార్యాలయాల చుట్టూ మండుటెండల్లో ప్రదక్షిణలు చేస్తున్నారు. విజయవాడలోని లబ్బీపేట, విశాఖపట్నంలోని సీతంపేట, గుంటూరు అరండల్‌పేట బ్రాంచి కార్యాలయాలకు వచ్చి రిక్త హస్తాలతో వెనుదిరుగుతున్నారు. దీనిపై కొందరు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులు కూడా చేస్తుండటం గమనార్హం. మరోవైపు గతంలో చిట్టీలు పాడిన మొత్తాన్ని వారికి చెల్లించకుండా రశీదు ఇచ్చి అక్రమంగా డిపాజిట్లు సేకరించారు. మార్గదర్శి అక్రమాలు బయటపడటంతో ఆ డిపాజిట్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని, వడ్డీ లేకపోయినా అసలైనా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. బ్రాంచి కార్యాలయాల నుంచి సరైన స్పందన లేకపోవడంతో వారిలో ఆందోళన తీవ్రమవుతోంది. కొందరు సీఐడీ అధికారులను కూడా సంప్రదించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నమ్మి తమ కష్టార్జితాన్ని ధారపోసి నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ప్రతి చిట్‌కూ ఓ బ్యాంకు ఖాతా ఉంటే జాప్యానికి ఆస్కారమే ఉండదని, నిధుల మళ్లింపు జరగకుంటే చిట్‌దారులకు చెల్లింపులు ఆలస్యమయ్యేవి కావని అధికారులు పేర్కొంటున్నారు.

'ర్యాపిడో' బైకర్ వికృత చేష్టలు

- భయపడి బైక్ నుంచి దూకిన యువతి
- గాయాలు అవ్వడంతో ఆస్పత్రికి తరలింపు
- బెంగళూరులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

బనశంకరి: ర్యాపిడో బైకర్ లైంగిక వేధింపుల నుంచి తప్పించుకోవడానికి బైకు నుంచి కిందకు దూకిన యువతి గాయపడిన ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... బాధితురాలు (30) ప్రైవేటు ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 21న రాత్రి 11.30 గంటల సమయంలో ఇందిరానగర్‌కు వెళ్లడానికి ర్యాపిడో బైక్‌ను యాప్‌లో బుక్ చేసింది. యువతిని పికప్ చేసుకున్న బైకర్ ఆమె మొబైల్‌ను లాక్కుని, కౌగిలించుకుని వెకిలిచేష్టలు చేశాడు. వెళ్లాల్సిన చోటుకు కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్తుండగా యువతి అతడిని ప్రశ్నించింది. సమాధానం ఇవ్వకుండా మరింత వేగంగా బైక్‌ను పోనిచ్చాడు. పైగా అతడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. భయాందోళనకు గురైన ఆమె బీఎంఎస్ ఇన్‌స్టిట్యూట్ వద్ద బైకు నుంచి దూకడంతో గాయపడింది. ఒక స్నేహితురాలికి, అలాగే పోలీసులకు కాల్ చేసి సాయం అడిగింది. అయితే పోలీసులు ఇది ప్రేమికుల గొడవ అనుకుని స్పందించలేదని బాధితురాలు తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చివరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ర్యాపిడో బైకర్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై కిడ్నాప్, వేధింపులు, లైంగికదాడికి యత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

శ్రీవారి ఆలయ పరిసరాల్లో హెలికాప్టర్ల చక్కర్లు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో మంగళవారం మూడు హెలీకాప్టర్లు చక్కర్లు కొట్టాయి. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, పరకామణి భవనం, బాలాజీనగర్ ఉపరితలంపై వెళ్లాయి. తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు వెళ్లకూడదనేది ఆగమశాస్త్ర నిబంధన. అందుకే రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి ప్రముఖులు, వివిధ దేశాల అధ్యక్షులు వచ్చే తిరుమలలో హెలిప్యాడ్ నిర్మించాలన్న ప్రతిపాదనల్ని కూడా పక్కనపెట్టి ఆగమ శాస్త్రానికే టీటీడీ పెద్దపీట వేసింది. ఆగమ పరంగానే కాకుండా భద్రత పరంగాను తిరుమలను నో ఫ్లైజోన్‌గా ప్రకటించాలని టీటీడీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో తిరుమలలో హెలికాప్టర్ల ప్రయాణంపై విజిలెన్స్ అధికారులు రేణిగుంటలోని విమానాశ్రయం ఏటీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

లోతు తెలియని ఈత !

- వేసవిలో చిన్నా, పెద్దా ఈదేందుకు ఉత్సాహం
- నీటిలో మునిగి ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యాలు
- ఈత రాక, జాగ్రత్తలు పాటించక మరణాలు
- ఏటా సెలవుల్లో అనేక మంది మృత్యువాత

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేసవి సెలవులను సరదాగా గడపాల్సిన రోజుల్లో 'ఈత ప్రమాదాలు' విషాదం నింపుతున్నాయి. ఏటా ఎండాకాలంలో రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, ప్రాణహిత, మానేరు నదులు, ఉప నదులు, చెరువులు, కాలువలు, వాగులు, బావులు, చెక్‌డ్యాంలు, ఎస్సారెస్పీ, గ్రామాల్లో సాగునీటి కాలువల్లో ఈతకు వెళ్లిన సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిన్న పాటి నిర్లక్ష్యంతో చిన్నా, పెద్దా తేడా లేకుండా అనేకమంది మృత్యువాత పడుతున్నారు. సరదా కోసం వెళ్లిన తమ బిడ్డలు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటుతున్నాయి.

లోతు తెలియని సరదా

చాలా ప్రమాదాల్లో చిన్నారులు, పెద్దలు ఈతకు వెళ్లే చెరువు, బావులు, వాగులు, నదుల్లో ఉండే లోతుల పై అవగాహన ఉండడం లేదు. ఎక్కడ ఎంత లోతు ఉంది.. చిన్నారులు, పెద్దలకు ఎంత వరకు క్షేమం అనే అంచనా వేయకుండా వెళ్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. చాలాచోట్ల ఈత రాకున్నా నీటిలో దిగే సాహసం చేస్తున్నారు. చెక్‌డ్యాం, చెరువులు, బావులు, నదులు, వాగుల్లో లోపల ఉండే గోతులు, పరిమాణం తెలుసుకోక ప్రమాదం బారిన పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం నీటిలో మట్టిని తీస్తే, గోతులను గ్రహించకలేపోతున్నారు. కొందరు పెద్దలు, చిన్నారులను భుజాలకు వేసుకుని నీటిలో దిగుతున్నారు. జారి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా పెద్దల పర్యవేక్షణ లేకుండా చిన్నారులే ఈతకు వెళ్తుండడంతో ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.

జాగ్రత్తలే లైఫ్ జాకెట్లు

నీటిలో దిగేవారు ఈత నేర్చుకుని ఉండాలి. ఎవరికైనా ఈత రాకపోతే పెద్దల సమక్షంలోనైనా నేర్చుకోవాలి. ఇందుకోసం లైఫ్ జాకెట్లు, ట్యూబ్స్, రక్షణకు ఉపయోగించాలి. చిన్నారులు, మహిళలు జాగ్రత్తగా ఉండాలి. శిక్షకుల సమక్షంలో ఈత నేర్చుకోవడం మంచిది. లోతు తెలియని, వాగులు, చెరువులు, కాలువల వద్ద జాగ్రత్తగా మెదలాలి. స్థానికులను అడిగి అక్కడి నీటిమట్టాన్ని తెలుసుకోవాలి. ఒకవేళ అనుకోని ప్రమాదం జరిగితే ఈత రాకున్నా నీటిలో దిగి కాపాడే సాహసం చేయొద్దు. ఒడ్డు నుంచే తాడు, కర్ర వారికి అందించి బయటకు లాగాలి. ఈత వస్తే నీట మునిగే వారిని తల, జుట్టు, చేతులు పట్టుకుని ఒడ్డుకు నెట్టుకురావాలి. అలాకాక, కాపాడే వారిని మునిగిపోయే వారు గట్టిగా పట్టుకుంటే ఇద్దరికి ప్రమాదం జరగొచ్చు. నీరు మింగినప్పుడు ఛాతీ, పొట్టభాగంలో చేతితో నొక్కి నీటిని బయటకు పంపాలి. వీలైనంత తొందరగా ఆసుపత్రికి తరలించాలి.



బావిలో ఈత కొడుతున్న బాలురు

ఈత రాకుంటే నీటిలో దిగొద్దు



చాలా చోట్ల పిల్లలు, పెద్దలు ఈత రాకుండానే నీటిలో దిగుతున్నారు. లోతు ఎక్కువగా ఉంటే మునిగిపోతారు. ఎవరైనా సరే, ఈత రాకుంటే నీళ్లలో దిగొద్దు. ప్రమాదవశాత్తు మునిగితే కాపాడడానికి టెక్నిక్స్ పాటించాలి. లేకపోతే కాపాడే వారికి కూడా ప్రమాదం ఉంటుంది. చిన్నారులు ఈత నేర్చుకునేప్పుడు తప్పనిసరిగా పెద్దలు ఉండాలి. లైఫ్ జాకెట్లు, ట్యూబ్స్ వాడాలి. –గుడ్ల బాలకృష్ణ, శిక్షకుడు, సింగరేణి స్విమ్మింగ్ పూల్, శ్రీరాంపూర్

సరదాగా వెళ్లి శవాలైన ఘటనలు

- సోమవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం తర్నం గ్రామానికి చెందిన దుర్గం హరీశ్(14) గ్రామ శివారు కడెం వాగు చెక్‌డ్యాంలో నీట మునిగి చనిపోయాడు. ముగ్గురు స్నేహితులతో సంతోషంగా ఈతకు వెళ్లిన బాలుడు వాగులో లోతు ఉన్న వైపు వెళ్లి ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు.
- ఈ నెల 2న గద్వాల జిల్లా అయిజకు చెందిన రాముడు(31) తన కొడుకు, కూతురుకు వ్యవసాయ బావిలో ఈత నేర్పే క్రమంలో కూతురు వెన్నెల(6)కు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నీట మునిగింది. పాపను కాపాడే ప్రయత్నంలో తండ్రి రాముడు సైతం ప్రాణాలు కోల్పోయాడు.
- ఈ నెల 14న రామగుండం ఎన్టీపీసీ పరిధి న్యూపోరట్‌పల్లికి చెందిన సోయం ఉమామహేశ్వర్(12), మామిడి విక్రం(13), మేకల సాయిచరణ్ (13) ఈత కోసం వెళ్లి మేడిపల్లి చెరువులో మునిగి చనిపోయారు. చిన్న వయస్సులోనే తమ పిల్లలను కోల్పోయిన తల్లితండ్రులు గుండెలు పగిలేలా విలపించారు.
- ఈ నెల 22న వనపర్తి జిల్లా ఆత్మకూరు గుంటిపల్లి క్రాస్ వద్ద జూరాల ప్రాజెక్టు కాలువలో స్నానం చేసేందుకు వెళ్లి మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన శ్రవణ్‌కుమార్(34), నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన రాజేంద్ర ప్రసాద్(30) మృత్యువాత పడ్డారు. తమ చిన్నారులతో కలసి కాలువ మెట్ల పక్కన స్నానం చేసేందుకు వెళ్లి జారి పడ్డారు. నలుగురు చిన్నారులు నీటిలో కొట్టుకుపోవడంతో అక్కడున్న వారు అప్రమత్తమై చిన్నారులను ప్రాణాలతో కాపాడారు. చివరకు ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది.

అదనపు డీజీపీ ఆకస్మిక పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ను బెటాలియన్‌ల అదనపు డీజీపీ స్వాతిలక్రా మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయుధాగారం, పరేడ్ మైదానం, ఆస్పత్రి, విశ్రాంతి భవనం, పోలీస్ క్వార్టర్లు, ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు పర్యవేక్షించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి బెటాలియన్ ఎదురుగా ఏర్పాటు చేసిన బెటాలియన్ లోగోను ఆవిష్కరించారు. డైనింగ్ హాల్, చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించి విధుల నిర్వహణలో నిబద్ధతగా వ్యవహరించాలని సూచించారు. అదనపు డీజీపీని కలెక్టర్ బాదావత్ సంతోష్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఇంచార్జీ కమాండెంట్ ఎం.ఐ.సురేశ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రఘునాథ్‌చౌహాన్, శరత్,రాందాస్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుడిపేట బెటాలియన్ ఎదుట లోగోను ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ స్వాతిలక్రా

గ్రామీణ యువతా.. చలో ఫారిన్!

- విదేశాలకు వెళ్లే విద్యార్థులకు అవకాశాల కల్పతరువు
- కెరీర్ గైడెన్స్‌తోపాటు, విదేశాల్లో పార్ట్‌టైం ఉపాధి ఏర్పాటు
- తెలుగు రాష్ట్రాల నుంచి 2,000 మందికిపైగా యువతకు అవకాశం
- విదేశీ విద్య, ఉపాధికి శాస్త్రవేత్త డా.మోహన్ గోలి ట్రస్టు చేయూత



ఇటీవల జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతతో డాక్టర్ మోహన్ గోలి తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మారుమూల పల్లెల్లో వాకిట్లో పడుకుని ఆకాశంలో వెళ్లే విమానాన్ని తదేకంగా చూసే చాలామంది యువత స్వప్నాన్ని చేరుకునేందుకు ఆయన చేయూతనిస్తారు. విమానమెక్కేందుకు కాదు.. విదేశాలకు వెళ్లేందుకు వారి ఉన్నత విద్యాభ్యాసం కల నెరవేర్చేందుకు.. ఎందుకంటే ఆయన గ్రామీణ యువతకు అంతర్జాతీయ విద్య ఆవశ్యకత, ప్రాధాన్యం వివరించడం తన బాధ్యతగా భావిస్తారు. అందుకోసం వారికి విదేశాలకు వెళ్లేందుకు కావాల్సిన నైపుణ్యాలు, మెళకువలకు తన డబ్బు వెచ్చించి శిక్షణ ఇప్పిస్తారు. విదేశీ వర్సిటీల్లో అడ్మిషన్ వచ్చిన వెంటనే తన బాధ్యత తీరిపోయిందని అనుకోరు. వారికి అక్కడ తన మిత్రుల ద్వారా నివాసం ఏర్పాటుతోపాటు పార్ట్‌టైమ్ జాబుల్లో చేర్పించాకే తన సాయం పూర్తయిందని భావించే వ్యక్తి. తెలంగాణ, ఏపీల్లో మారుమూల గ్రామాల్లో అంతర్జాతీయ విద్యపై మక్కువ పెంచుకుని, విదేశీ విద్యే లక్ష్యంగా పెట్టుకున్న పలువురు యువతకు ఆయన అవకాశాల కల్పతరువుగా మారారు. ఆయన అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ మోహన్ గోలీ.

ఎవరు మోహన్ గోలి..?

డాక్టర్ మోహన్ గోలి స్వస్థలం సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నూకలమర్రి గ్రామం. బూట్ల చప్పుళ్లు, లాఠీల దెబ్బలు, తూటాల మోతతో తెల్లవారే తెలంగాణలోని కుగ్రామం అది. 1980లో యువతకు రెండే దారులు అయితే మావోయిస్టుల వెంట నడవాలి లేదా పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా మారాలి. కానీ.. డాక్టర్ మోహన్ ఆ రెండు కాకుండా చదువును తన లక్ష్యంగా ఎంచుకున్నారు. తొలుత డీఎస్సీ రాసి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించారు. అనంతరం గ్రూప్స్ రాసి డీఎస్పీ అయ్యారు. ఇప్పుడు తన బ్యాచ్‌మేట్లు పలువురు ఎస్పీలుగా ఉన్నారు. ఉస్మానియాలో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసి అమెరికా బాట పట్టారు. అక్కడ కేన్సర్ మీద పరిశోధనలకు మెచ్చిన అమెరికా ప్రభుత్వం ఆయనకు గ్రీన్‌కార్డు కూడా ఇచ్చింది. ప్రపంచంలోని 20 మంది అత్యున్నత సైంటిస్టుల లో ఒకరిగా నిలిచారు. యూఎస్‌ఏ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, అమెరికన్ క్యాన్సర్ రీసెర్చ్ బోర్డు తదితర బృందాల్లో సభ్యుడిగా ఉన్నారు. గ్రామీణ యువతకు అంతర్జాతీయ విద్య అందించాలన్న లక్ష్యంతో 'ఆద్య గోలీ ఫౌండేషన్' స్థాపించారు. దీని ద్వారా ఇప్పటి వరకు 2,000 మంది విదేశాలకు వెళ్లే విద్యార్థులకు అనేక రకాల సాయం అందించారు.

ఏం చేస్తారు?

- విదేశాలకు వెళ్లాలన్న ఆసక్తి ఉండి.. ఆర్థిక కారణాల వల్ల వెళ్లలేకపోయే వారికి గోలి మోహన్‌కు చెందిన ఆద్య ట్రస్టు చేయూత ఇస్తుంది.
- విదేశాలకు వెళ్లేందుకు కీలకమైన జీఆర్‌ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ లాంటి పరీక్షలకు కావాల్సిన సలహాలు, సూచనలు,జాగ్రత్తలు వివరిస్తారు.
- అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వీసా ఇంటర్వ్యూ తప్పనిసరి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్లంలో ఎలాంటి బెరుకు లేకుండా ఈ ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా శిక్షణ అందిస్తారు.
- అదే విధంగా కెనడాలాంటి దేశాలు విద్యార్థి ప్రతిభను విద్యార్హతల ఆధారంగా పాయింట్లు కేటాయిస్తుంటాయి. ఈ క్రమంలో ఏ కోర్సుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో చెబుతారు. విద్యార్హతల ఆధారంగా ఏ వర్సిటీలో త్వరగా సీటు వస్తుందో కూడా అవగాహన కల్పిస్తారు.
- విదేశాల్లో ఉన్నత విద్య పూర్తి చేసిన అనంతరం త్వరగా ఉపాధి రావాలంటే ఏ కోర్సు ఎంచుకోవాలి? అన్న విషయంలోనూ ప్రత్యేక శిక్షణ ఇస్తారు.
- విద్యార్థులకు వీసా వచ్చిన అనంతరం వారు వెళ్లబోయే దేశంలో వారికి నివాసం, పార్ట్‌టైం జాబులకు కూడా ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు పలు కంపెనీలతో ఆద్య గోలి ట్రస్టు సంబంధాలు కలిగి ఉంది.
- విద్యాభ్యాసం అనంతరం ఉపాధి రాని వారికి తమకు తెలిసిన కంపెనీల్లో ట్రస్టు ద్వారా ఉద్యోగం కల్పించే ఏర్పాటు సైతం చేస్తున్నారు.

వేములవాడకు గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీలు

ఆద్య గోలి ట్రస్టు కేవలం విదేశీ విద్యలోనే కాదు, గ్రామీణ యువతకు స్థానికంగా బహుళ జాతీయ కంపెనీల్లోనూ ఉపాధి అవకాశాలు దక్కేలా చేస్తోంది. 2018, 2019లో 5000 మంది చొప్పున యువతకు జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు వచ్చేలా చేసింది. కరోనా తరువాత 2022లో నవంబరులో నిర్వహించిన జాబ్‌మేళాలో 5,164 మందికి కొలువులు దక్కాయి. వేములవాడలో నిర్వహించిన జాబ్‌మేళాలో గూగుల్, మైక్రోసాఫ్ట్, జెన్‌ప్యాక్, అన్ని బహుళజాతీయ బ్యాంకులు, సేల్స్, మార్కెటింగ్ కంపెనీలు పాల్గొన్నాయి. ఎంపికైన వారందరికీ అక్కడే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వడం గమనార్హం. ఏటా 5,000 మంది గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు ఇప్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

కెరీర్ గైడెన్స్ తిరుగులేనిది



మాది హైదరాబాద్. బ్యాచిలర్స్ పూర్తిచేశాక, మాస్టర్స్ కోసం విదేశాలకు వెళ్దామనుకున్నా. ఎలా ముందుకెళ్లాలో తెలియ లేదు. ఆ సమయంలో మోహన్ అన్న ట్రస్టును సంప్రదించా. వారి గైడెన్స్‌తో యూకే రాగలిగాను. ఇక్కడ ఐటీ రంగంలో స్థిరపడ్డాను. – మనోజ్, ఐటీ ఉద్యోగి, యునైటెడ్ కింగ్‌డమ్

అడ్మిషన్, పార్ట్‌టైం జాబ్ చూశారు



రెండేళ్ల క్రితం నేను మోహన్ ట్రస్టు సాయంతో యూకేకి వచ్చాను. వారు నాకు ఆర్థికంగా, మెళకువల పరంగా అన్ని రకాలుగా సాయం చేశారు. నాకు అడ్మిషన్‌తోపాటు, పార్ట్‌టైం జాబులో వారు చేసిన మేలు మరువలేనిది. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు ఇది చాలా పెద్ద సాయం. – అఖిల్, ఖమ్మం, యూకే

వారి సాయంతోనే..



చిన్నప్పటి నుంచి అమెరికాలో చదవాలన్నది నా కల. సరైన గైడెన్స్ లేదు. ఆ సమయంలో డాక్టర్ మోహన్ గోలి ట్రస్టు గురించి తెలుసుకున్నా. వారి సాయంతోనే నేను యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో బయోమెడికల్ రీసెర్చ్ కోర్సు చేస్తున్నాను. డాక్టర్ మోహన్ అన్నకు కృతజ్ఞతలు. – విహారిక, కరీంనగర్

జమునా టుడు... పర్యావరణ ఉద్యమకారిణి.
ఆమెకు అంత పెద్ద పదం కూడా తెలియదు.
పద్మశ్రీ పురస్కారం గురించి విననే లేదు.
సంతాల్ ఆదివాసీ మహిళ ఆమె.
పుట్టిల్లు ఒడిశా రాష్ట్రం... అత్తిల్లు జార్ఖండ్.
ఆమెకి తెలిసిందల్లా అడవి అమ్మ ఒడి అని మాత్రమే.
అడవి పచ్చగా ఉంటేనే బతుకు చల్లగా ఉంటుందని.
చెట్టు మీద పడే గొడ్డలి వేటును అడ్డుకుంది.
ఊరందరినీ కలుపుకుని మొక్కలు నాటింది.
వన సంరక్షణతో పచ్చదనానికి చిరునామా అయింది.

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమీప బంధువు జమునా టుడు తన బాల్యం, పర్యావరణ ఉద్యమం, టింబర్ మాఫియాతో పోరాటం గురించి 'సాక్షి'తో పంచుకున్న వివరాలివి.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జమునా టుడు (ఫైల్ ఫొటో)

మొక్కలే నా పిల్లలు

ఈ-మెయిల్ ఇంటర్వ్యూలో లేడీ టార్జాన్ జమున

■ **రాయ్ రంగపూర్‌లో మీ బాల్యం ఎలా గడిచింది?**

మా ఊరు ఒడిశా రాష్ట్రం, మయూర్‌భంజ్ జిల్లా, రాయ్‌రంగపూర్ తాలూకాలోని రంగ్ మటియా గ్రామం. రాయ్ రంగపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. మాది పెద్ద కుటుంబం. ఏడుగురు అక్కలు, నేను, తమ్ముడు. నాన్న రైతు, అమ్మ గృహిణి. కుటుంబ పోషణ కోసం చిన్న దుకాణం పెట్టి తవుడు, పొట్టు అమ్మేవారు. నా విద్యాభ్యాసం ఐదవ తరగతి వరకు మా ఊర్లోనే. హైస్కూల్‌కి రోజూ 5 కిలోమీటర్లు నడిచి వెళ్లేదాన్ని. అంతపెద్ద కుటుంబాన్ని పోషించాల్సిన స్థితిలో నాకు సైకిల్ కొనివ్వడం కూడా సాధ్యం కాలేదాయనకు. నేను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు అమ్మ భగవంతుని సన్నిధికి చేరుకుంది. నాన్న మమ్మల్ని బాగా చూసుకునే వారు. నన్ను, తమ్ముడిని తనతోపాటు సరదాగా పొలానికి తీసుకెళ్లేవారు. ఇలాగ కొన్ని సంతోషాలు, అనేక సర్దుబాట్ల మధ్య గడిచింది నా బాల్యం.


కలప దొంగల మీద బాణం ఎక్కుపెట్టిన జమునా టుడు

■ **బాణాలు వేయడం ఎలా నేర్చుకున్నారు?**

మా ఆదివాసీ కుటుంబాల్లో బిడ్డను మంచం మీద పడుకోబెట్టేటప్పుడు తల దగ్గర బాణాలు, విల్లు కూడా పెడతారు. అది మా సంస్కృతి. ప్రతి ఇంట్లో విల్లంబులు ఉంటాయి. ఎవరూ నేర్పించడం అంటూ ఉండదు. మాకు మేమే సాధన చేస్తూ నేర్చుకుంటాం.

■ **విద్యాభ్యాసం, పెళ్లి వివరాలు...**

జామ్‌దాలోని బాలికల హైస్కూల్‌లో చదివాను. కానీ ఇంటి సమస్యల కారణంగా చదువు కొనసాగించలేకపోయాను.అమ్మ లేకపోవడం, అక్కలకు పెళ్లిళ్లు అయి అత్తవారిళ్లకు వెళ్లిపోవడంతో ఇంట్లో నాన్న, నేను, తమ్ముడు మాత్రమే. దాంతో ఇంటి బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. ఒక అక్క టాటానగర్‌లో ఉండేది. ఆ అక్క దగ్గరకు వెళ్లి ఏదైనా పని నేర్చుకుంటానని అడిగినప్పుడు నాన్న మొదట అంగీకరించలేదు. తమ్ముడి చదువు కోసం నేను పని చేయడం అవసరమని నాన్నని ఒప్పించి వెళ్లాను. అక్కడ రోజు కూలీగా పనిలో చేరాను. అక్కడే అక్క ఒక తాపీ పని చేసే కుర్రాడితో నా పెళ్లి కుదిర్చింది. పెళ్లి తర్వాత కూడా నాన్నకు, తమ్ముడికి సహాయంగా ఉన్నాను. అత్తగారింటికి జార్ఖండ్‌కు వెళ్లిన తర్వాత నా భర్తతో కలిసి అక్కడే పనులు చేసుకోవడం మొదలు పెట్టాను.

■ **అటవీ సంరక్షణ పట్ల ఆసక్తి కలగడానికి కారణాలేమిటి?**

మా అత్తగారి ఊరి ఎదురుగా మంచి అడవి ఉంది. నాన్నతో కలిసి మొక్కలు నాటిన బాల్యం గుర్తుకు వచ్చింది. అడవిని రక్షించుకోవాల్సిన అవసరం గురించి నాన్న చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఊరి వాళ్లను సమీకరించి అటవీ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం వంటి పనులు మొదలు పెట్టాను. నేను ఇప్పుడు చేస్తున్న పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి మూలకారకుడు మా నాన్నే. ఆయన ఇప్పుడు లేరు.

■ **మిమ్మల్ని లేడీ టార్జాన్ అంటుంటే ఏమనిపిస్తుంటుంది?**

జనం నన్ను లేడీ టార్జాన్ అనడం గర్వంగా ఉంది.

■ **టింబర్ మాఫియాను ఎదుర్కొనే ధైర్యం ఎలా వచ్చింది?**

ఒకరోజు మా ఇంట్లో ఉన్న కలపను టింబర్ మాఫియా వాళ్లు ఎత్తుకెళ్లిపోయారు. అదేమని ప్రశ్నించిన నన్ను, నా భర్తను విచక్షణ రహితంగా కొట్టారు. రక్తం కారేటట్లు కొట్టినా సరే నేను భయపడలేదు. పుట్టిన వాళ్లం ఏదో ఒకరోజు పోవాల్సిందేనని తెలుసు కదా... అని మొండిగా ఎదుర్కొన్నాను. నాకంతటి ధైర్యాన్ని మొక్కలే ఇచ్చాయి. బహుశా! దేవుడు నన్ను మొక్కలను సంరక్షించడానికే భూమ్మీదకు పంపినట్లున్నాడు. అందుకే పిల్లలనివ్వలేదు. నాకు మొక్కలే పిల్లలు. భూమ్మీద బతికి ఉన్నంత వరకు, నేను శ్వాస తీసుకున్నంత కాలం మొక్కలను కాపాడుతూనే ఉంటాను.

■ **మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రశంస...**

ప్రధానమంత్రికి ధన్యవాదాలు. మన్ కీ బాత్ సందర్భంగా నన్ను 'జంగల్ కీ టార్జాన్' అన్నారు. అది పెద్ద బిరుదుగా భావిస్తున్నాను. అత్యంత సాధారణమైన ఆదివాసీ మహిళ అయిన నాకు ప్రధానమంత్రి అంతటి గుర్తింపు నివ్వడం సంతోషంగా ఉంది.

■ **పద్మశ్రీ పురస్కారం అందుకున్న సందర్భం...**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముగారు... జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో నా కార్యకలాపాల గురించి తెలుసుకుని పద్మశ్రీ పురస్కారానికి ప్రతిపాదించారు. రామ్‌నాథ్ కోవింద్ గారి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాను. ముర్ము పుట్టిన ఊరు, మా ఊరు ఒడిశాలో ఒకే ప్రాంతంలో ఉన్నాయి. ఆమె నన్ను సొంత చెల్లెలా ప్రేమిస్తారు.

■ **పద్మశ్రీ అందుకున్న తర్వాత మీ బాధ్యత పెరిగినట్లు అనిపిస్తోందా?**

నిజమే. అంతకుముందు జార్ఖండ్ వరకే పరిమితమయ్యాను. 2019లో పద్మశ్రీ అందుకున్న తర్వాత నా కార్యకలాపాల పరిధిని దేశవ్యాప్తం చేయాల్సిన అవసరం వచ్చింది. అలాగే చేస్తున్నాను కూడా.

■ **అటవీ సంరక్షణ కోసం ఉద్యమించిన తొలినాళ్లలో అత్యున్నత పురస్కారం అందుకోగలరని ఊహించారా?**

నేను చేస్తున్న పనులకు ఇంతటి గుర్తింపు వస్తుందని తెలియదు. గుర్తింపు రావాలనే ఆకాంక్షతో పని చేయలేదు కూడా. అడవిని కాపాడితేనే మనకు జీవితం ఉంటుందని పని చేశాను. పర్యావరణాన్ని పరిరక్షించాలనే మంచి మనసుతో పని చేశాను.

■ **కుటుంబం, పిల్లలు...**

నేను, నా భర్త ఇద్దరమే ఇంట్లో. మొక్కలే నా పిల్లలు.

■ **మహిళలకు మీ సందేశం...**

మహిళలకు, యువతకు నేను చెప్పగలిగిందొక్కటే... మీ జీవితంలో కొంత సమయం మొక్కలు నాటడానికి, వాటిని రక్షించడానికి కేటాయించండి. దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణాన్ని పరిరక్షించడానికి నా వంతు కృషి చేస్తామని ప్రతిన పూనండి'.

– వాకా మంజులారెడ్డి



డాక్టర్లు మందులు రాస్తారు.
శీతల్ అగర్వాల్ వాటితోపాటు తన నవ్వులను టానిక్‌లా జత చేస్తుంది.
శీతల్ బహుశా దేశంలో మొదటి మహిళా 'మెడికల్ క్లౌన్'.
అంటే ఇన్ పేషెంట్స్‌గా ఉన్న చిన్నారులను, వృద్ధులను హుషారుగా పలకరించి
ఉత్సాహపరిచే విదూషకురాలు. నిరాశ నిస్పృహలను కలిగించే
అనారోగ్యం నుంచి బయట పడాలంటే తనలాంటి వారు అవసరమని
'కౌన్సిలర్ల'కు బదులుగా 'క్లౌన్సిలర్లను' తయారు చేసే సంస్థను స్థాపించిందామె.
శీతల్ ఆలోచనను పెద్ద పెద్ద ఆస్పత్రులు ఆహ్వానిస్తున్నాయి.

డాక్టర్ స్మైల్

వినూత్న సేవ



పిల్లలో, పెద్దలో ఎక్కువ రోజులు హాస్పిటల్లో ఉండాల్సి వచ్చిందనుకోండి... అప్పుడు వారిలో ఒక రకమైన నిర్లిప్తత వచ్చేస్తుంది. వారిని అటెండ్ చేస్తున్న అయినవారిలో అలసట వచ్చేస్తుంది. నవ్వులు మర్చిపోతారు. ఉత్సాహం మర్చిపోతారు. అప్పుడు ఎవరైనా వచ్చి, వింత వింత చేష్టలు చేసి, పిచ్చి మాటలు చెప్పి హాయిగా నవ్విస్తే ఎలా ఉంటుంది? తిరిగి బలం రాదూ? శీతల్ అగర్వాల్ చేస్తున్నది అదే. నవ్వుతో రోగుల్లో జీవాన్ని తేవడం.

■ **హాస్పిటల్‌లో జోకర్**

ఇంగ్లిష్‌లో క్లౌన్ అంటే విదూషకుడు. కాని జన సామాన్యం జోకర్ అనీ బఫూన్ అనీ అంటుంటారు. అలాంటి బఫూన్ వేషంలో హాస్పిటల్‌లో ప్రవేశించి ఒక ఉత్సాహకరమైన వాతావరణం తేవడాన్నే 'మెడికల్ క్లౌనింగ్' అంటారు. ఢిల్లీకి చెందిన 36 ఏళ్ల శీతల్ అగర్వాల్‌కు ఈ మెడికల్ క్లౌనింగ్ గురించి 2016 వరకూ తెలియదు. సోషల్ ఆంత్రోపాలజీ చదివి, లాఫ్టర్ యోగా థెరపీ నేర్చుకుని, ఒక ఎన్.జి.ఓలో ఉద్యోగం చేస్తున్న శీతల్ 2016 సంవత్సరంలో అహ్మదాబాద్‌కు వెళ్లినప్పుడు అక్కడి ఒక హాస్పిటల్‌లో మెడికల్ క్లౌన్‌ను చూసింది. అతను బఫూన్ వేషం వేసుకుని పేషెంట్స్‌ను హుషారు పరచడం శీతల్‌కు చాలా నచ్చింది. ఢిల్లీకి తిరిగి వచ్చి నెట్‌లో మెడికల్ క్లౌనింగ్ గురించి తెలుసుకుంది. దేశంలో కొంత మంది ఇలాంటి సేవ చేస్తున్నారని, హాస్పిటల్స్‌లో ఇలాంటి వారి అవసరం ఉందని తెలుసుకుంది.

■ **ఒక్కతే మొదలయ్యి**

'ఢిల్లీలో అప్పటి వరకూ మెడికల్ క్లౌన్‌గా ఎవరూ పని చేయడం లేదు. ఫేస్‌బుక్‌లో నేను పోస్ట్ చేసి ఆసక్తి ఉందా ఎవరికైనా అని అడిగితే కొంతమంది స్పందించారు. నేను కేంద్ర మంత్రిత్వ శాఖ అనుమతి తీసుకుని మొదట ఐదుమందితో ఒక గ్రూప్ మొదలుపెట్టాను. మాకు ట్రైనింగ్ ఏమీ లేదు. తెలిసిందల్లా ఎదుటివారికి మనస్ఫూర్తిగా ఉల్లాసం అందించడమే. అదే సంవత్సరం నేను ఢిల్లీలోని 'చాచా నెహ్రూ హాస్పిటల్'లో మొదటిసారిగా మెడికల్ క్లౌనింగ్ చేశాను. కాని ఎలా చేయబోతామా అనే భయం చాలా కలిగింది. మేం వెళ్లేసరికి పిల్లలు చాలామంది ఏడుస్తున్నారు. పేషెంట్లు వెయిటింగ్‌లో ఈసురోమంటున్నారు. కాని ఒక్కసారి మేము రంగంలో దిగి వింత చేష్టలతో తమాషా పలకరింపులతో తిరుగాడేసరికి పిల్లలు ఏడుపు ఆపేశారు. అందరిలో కుతూహలం, ఉత్సాహం వచ్చింది. ఐదు ఫ్లోర్లలో ఐదు గంటల పాటు తిరిగితే మా వల్ల అందరి ముఖాల్లో ఆనందం చూసి ఎంతో తృప్తి కలిగింది' అంది శీతల్ అగర్వాల్.

■ **డాక్టర్లే ఆహ్వానిస్తూ**

'మొదట మేము ప్రతి శనివారం ఏదో ఒక హాస్పిటల్‌కు వెళ్లాలని అనుకున్నాం. కాని మాకు వచ్చిన స్పందన చూసి డాక్టర్లు, నర్సులు మమ్మల్ని ఆహ్వానించసాగారు. మందులకు స్పందించనివారు కూడా నవ్వులకు స్పందిస్తున్నారని వారి అభిప్రాయం. ముఖ్యంగా చిన్న పిల్లల ఆస్పత్రుల్లో మెడికల్ క్లౌన్‌ల అవసరం చాలా ఉందని మాకు అర్థమైంది. హాస్పిటల్‌లోని భయాన్ని పోగొట్టాలంటే వారికి మాలాంటి వారు కనపడుతుండాలి. అందుకే ఇన్ పేషెంట్స్‌గా ఉన్న పిల్లలు మా రాక కోసం ఎదురు చూస్తుంటారు. అంతే కాదు వారి ముఖంలో నవ్వును చూసి తల్లిదండ్రులు కార్చే ఆనంద బాష్పాలకు విలువ కట్టలేం.

– శీతల్

■ **500 వాలెంటీర్లు**

ఈ ఐదారేళ్లలో శీతల్ పిలుపు మేరకు 500 మంది వాలెంటీర్లు మెడికల్ క్లౌన్లుగా ఆమె స్థాపించిన సంస్థ 'క్లౌన్సెలర్స్'లో నమోదు అయ్యారు. వీరంతా యూనివర్సిటీ విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు. 'మా జీవితంలో ఇలాంటి పని సంతృప్తిని ఇస్తుంది' అని వారు ఈ వినూత్న సేవకు వస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, కశ్మీర్‌లలో శీతల్ బృందాల సేవలు కొనసాగుతున్నాయి. ఆస్పత్రుల్లోనే కాకుండా ఓల్డ్ ఏజ్ హోమ్‌లకు, మానసిక చికిత్సాలయాలకు కూడా వీరు వెళుతున్నారు. ఈ సేవలో మరింతమంది పాల్గొనాలని కోరుకుందాం.

బ్యూటిప్స్

మెరుగైన చర్మకాంతికి..

- యాపిల్, ద్రాక్ష గుజ్జు రెండూ సమపాళ్లలో తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. మచ్చలు తగ్గి నిగారింపు పెరుగుతుంది.
- బంగాళాదుంప గుజ్జు, శనగపిండి, అలొవెరా జెల్ కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. దీనిని ముఖానికి, మెడకు ప్యాక్‌లా వేసుకొని, పదినిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పెరుగు, నారింజ రసం సమపాళ్లలో తీసుకొని, కొద్దిగా ఆలోవెరా జెల్ కలిపి ముఖానికి అప్లై చేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.




బామ్మ చేతి సంచి

ఆలోచన ఉంటే చాలు వయసుతో పనిలేకుండా నలుగురి మేలు కోరే పని ఎంత చిన్నదైనా చేయచ్చు. ఇదే విషయాన్ని తన చేతలతో నిరూపిస్తోంది 93 ఏళ్ల మధుకాంతా భట్. వేస్ట్ క్లాత్‌తో ఎకో ఫ్రెండ్లీ బ్యాగులను తయారు చేయడమే కాదు, ఎనిమిదేళ్లుగా 35వేలకు పైగా బ్యాగులను స్వయంగా తయారుచేసి వాటిని ఉచితంగా పంపిణీ చేసింది. హైదరాబాద్‌లో ఉంటున్న ఈ గుజరాతీ బామ్మ చేస్తున్న పని పర్యావరణ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

బ్యాగ్‌లు తయారు చేస్తున్న మధుకాంతా భట్







ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి మధుకాంత భట్ తన మిషన్‌ని ప్రారంభించి ఎనిమిదేళ్లు అయ్యింది. 'పని లేకుండా కూర్చోవడం అంటే నాకు అస్సలు ఇష్టం ఉండదు. ఇదివరకటి కంటే ఇప్పుడే నేను చాలా బిజీగా ఉన్నాను. రోజూ ఉదయం టిఫిన్ చేసిన తర్వాత కుట్టు పని మొదలు పెడతాను. కుట్టు పని అంటే నాకు చాలా ఇష్టం. మాది గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లా. అక్కడ మా రోజుల్లో ఆడపిల్లలను బడికి పంపేవారు కాదు. దీంతో నేను స్కూల్లో చదువుకోలేదు. పద్దెనిమిదేళ్ల వయసులో పెళ్లయ్యి, మా వారితో కలిసి హైదరాబాద్‌కు వచ్చాను. నేను చదువుకోకపోవడంతో నా పిల్లలకు బాగా చదువులు చెప్పించాలనుకున్నాను. నాకు గుజరాతీ తప్ప మరే భాష వచ్చేది కాదు. దీంతో ఇతరులతో మాట్లాడలేక పోయేదాన్ని. నాకు ఒక కొడుకు, నలుగురు కూతుళ్లు. పిల్లలు బాగా చదువుకోవాలని కోరుకున్నాను.

పొదుపు చేసి మిషన్

మా చుట్టుపక్కల కొందరు మహిళలు కుట్టుమిషన్ వాడుతుండేవారు. కుట్టుమిషన్ పని నాకు రాదు. కానీ, ఆ మిషన్ కావాలనుకున్నాను. ఇంటి ఖర్చులకని ఇచ్చిన డబ్బులో కొద్ది కొద్దిగా పొదుపు చేయడం మొదలుపెట్టాను. అందుకోసం ఖర్చులను తగ్గించేదాన్ని. యాభై ఏళ్ల క్రితం 200 రూపాయలు పెట్టి, కుట్టు మిషన్ కొన్నాను. మిషన్ కొన్నాను కానీ, దానిని ఎలా ఉపయోగించాలో తెలియదు. కుట్టు మిషన్‌ను ఎలా వాడాలో తెలుసుకోవడానికి నెల రోజులు పట్టింది. కుట్టు, కట్టింగ్, డిజైనింగ్ వంటివి కోర్సు ద్వారా నేర్చుకున్నాను. కొద్ది నెలల్లోనే నైపుణ్యం వచ్చేసింది. నా బట్టలు, మా పిల్లలు బట్టలు, ఇరుగుపొరుగు వారి బ్లౌజులు, పెట్టీకోట్‌లు కుట్టేదాన్ని.

వేస్ట్ మెటీరియల్

పిల్లలు పెద్దవాళ్లయ్యి, వాళ్ల జీవితాల్లో స్థిరపడినా నా కుట్టు పని ఆగలేదు. కాకపోతే బయటివారికి కుట్టడం ఆగిపోయింది. మార్కెట్‌కు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ సంచులు పట్టుకెళ్లేవారిని చూసేదాన్ని. దీనికేదైనా ప్రత్యామ్నాయం చేస్తే బాగుంటుంది కదా అనుకున్నాను. దీంతో ఇంట్లో వాడకంలో లేని క్లాత్ మెటీరియల్‌ను శుభ్రం చేసి, సంచులు కుట్టేదాన్ని. ఆ తర్వాత టైలర్ షాప్‌ల నుంచి మెటీరియల్ సేకరించేదాన్ని. రోజుకు ఎనిమిది బ్యాగులు కుట్టి, వాటిని మార్కెట్‌కు వెళ్లినప్పుడు పంచేదాన్ని. లేదంటే, మా పిల్లల చేత మార్కెట్‌కు పంపించేదాన్ని. అవసరమైన వారికి ఇచ్చి వచ్చేవాళ్లు.

కొన్నేళ్ల క్రితం కాలికి గాయం అయ్యింది. కానీ, కుట్టు పనిని వదులుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో మా అబ్బాయి కుట్టుమిషన్‌కు మోటారును అమర్చాడు. కూరగాయలు అమ్మే షాప్ అతను, ప్లంబర్లు, మా పిల్లలు, ఫ్రెండ్స్ ఇళ్లలో నేను కుట్టిన బ్యాగ్ తప్పక ఉంటుంది. ఎక్కువ మొత్తం మెటీరియల్ కావాలనుకుంటే మా ప్రాంతంలో ఉన్న టైలర్లు, ఫర్నీచర్ తయారు చేసేవారి నుంచి తీసుకుంటాం. సాధారణంగా క్లాత్‌కు సంబంధించిన రంగంలో చాలా ఫ్యాబ్రిక్ వృథా అవుతుంది. మా పిల్లలు ఆ బట్టలను సేకరించి తీసుకువస్తారు. అందరం కలసి వాటిని సంచులుగా తయారు చేస్తాం. మా ఇంటికి దగ్గరలో కర్టెన్ టైలర్ ఉన్నాడు. ఐదేళ్లుగా అక్కడ నుంచి పాత కర్టెన్లు, మెటీరియల్ సేకరించి, సంచులు కుడుతున్నాం'' అని చెబుతున్న తొంభై మూడేళ్ల ఈ పర్యావరణ ప్రేమికురాలిని ప్రేమించని వారుండరేమో బహుశా!

ది ఆర్ట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్

యూత్ పల్స్

కల్లోల కరోనా సమయం డిజిటల్ రూపంలో కళాప్రపంచాన్ని యూత్‌కు దగ్గర చేసింది. ఆ ప్రభావంతో యంగ్ ఆర్ట్ కలెక్టర్‌ల సంఖ్య పెరిగింది. వారు ఆషామాషీగా ఆర్ట్ మార్కెట్‌లోకి రావడం లేదు. ఆమూలాగ్రం అధ్యయనం చేసిన తరువాతే రంగంలోకి దిగుతున్నారు...

కరోనా కరుకు కోరల ప్రభావం తీవ్రంగా లేని ఇండస్ట్రీలలో ఆర్ట్ ఇండస్ట్రీ ఒకటి. ఆ సమయంలో ఆర్టిస్ట్ కమ్యూనిటీ డిజిటల్ ప్రపంచంలోకి వచ్చింది. ఆర్ట్ లవర్స్, కలెక్టర్స్ వర్చువల్ ఆర్ట్ గ్యాలరీలోకి వచ్చి రకరకాల ఆర్ట్ వర్క్స్‌ను ఆస్వాదించారు.

డిజిటల్ ఆర్ట్స్ వరల్డ్ కొత్త క్లయింట్స్‌ను ముందుకు తీసుకువచ్చింది. వారే యంగ్ ఆర్ట్ కలెక్టర్స్.

సోషల్ మీడియా, టెక్నాలజీ ఆర్ట్ వరల్డ్‌ను యువతరానికి దగ్గర చేసింది. పెట్టుబడి పాఠాలను పరిచయం చేసింది.

రియల్ ఎస్టేట్, స్టాక్‌మార్కెట్ కంటే ఆర్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌ను భద్రమైనదిగా భావిస్తున్నవారు యూత్‌లో ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. ఆర్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌ను 'ఫాస్టర్ మనీగ్రోయర్' అని పిలుచుకుంటున్నారు.

'బై అండ్ సెల్' పాలసీకి ప్రాధాన్యత ఇస్తున్నారు.

యంగ్ ఆర్ట్ కలెక్టర్‌లు ప్రధానంగా రెండు విషయాలను దృష్టిలో పెట్టుకుంటున్నారు.

ఒకటి... నిపుణుల సలహాలు తీసుకుంటూనే తమదైన అవగాహనతో ఆర్ట్‌వర్క్స్‌ను కొనుగోలు చేయడం.

రెండు...'ఇలా కొని అలా అమ్మాలి' అనే దృష్టితో కాకుండా దీర్ఘకాలిక దృష్టితో కొనుగోలు చేయడం.

దీనికి ముందు ఆర్ట్ మ్యాగజైన్‌లు చదవడం, గ్యాలరీలకు వెళ్లడంలాంటివి చేస్తున్నారు.

దీపావేద్ పాఠక్ చిత్రాల్లో వినిపించే సంగీతం గురించి, స్వాతీ పసారి చిత్రాల్లోని సెమీ-అబ్‌స్ట్రాక్ట్ స్టైల్ ఏమిటో వారికి తెలుసు. 'ఆర్ట్ బైయింగ్ టిప్స్' ఏమిటో తెలుసు.

జాన్ నిసీ రాసిన 'ఫేమస్ వర్క్స్ ఆఫ్ ఆర్ట్' పుస్తకం ద్వారా 'మ్యాటర్ ఆఫ్ ఫైనాన్స్'ను పట్టించుకున్న ప్రసిద్ధ ఆర్టిస్ట్‌లు ఎవరో, బొత్తిగా పట్టించుకోని వారెవరో తెలుసు.



డబ్బును మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేయకుండా జాగ్రత్తగా, నెమ్మదిగా ఆర్ట్ కలెక్షన్‌ను బిల్డ్ చేసుకుంటున్నారు.

పదిహేను, ఇరవై సంవత్సరాల క్రితం గ్యాలరీలలో తలపండిన వ్యక్తులు, సంపన్న వ్యాపారులు ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు ఆ దృశ్యంలోకి యూత్ కూడా వచ్చేశారు. వారు సంపన్నులు, ఆర్టిస్ట్‌లు కాకపోవచ్చు. విశ్లేషకులు కాకపోవచ్చు. అయితే ఏది ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి వారిలో ఉంది. ఆర్ట్ కలెక్టర్స్‌గా మారడానికి ఈ రాకపోకలు కారణం అవుతున్నాయి. ఈ యంగ్ ప్రొఫెషనల్స్ విద్యావంతులు. విస్తృత ప్రయాణ అనుభవం వారి సొంతం. ఆర్ట్ కలెక్టర్స్‌గా ఎదగడానికి ఇవి వారికి ఉపయోగపడుతున్నాయి.

మార్కెట్ ట్రెండ్స్‌పై ఒక కన్నేసిన యువతరం వర్క్‌షాప్స్‌కు హాజరు కావడం ద్వారా ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకుంటోంది.

ఫేస్‌బుక్‌లో ఒక గ్రూప్‌గా మొదలైన ఆర్ట్ కలెక్టర్‌లు 'కలెక్టర్స్ క్లబ్'గా ఏర్పడుతున్నారు. ఒకరికొకరు సలహాలు ఇచ్చిపుచ్చుకుంటున్నారు.

ఈ కొత్త కొనుగోలుదారులు రకరకాల విభాగాల్లో ఆర్ట్‌వర్క్స్‌ను కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు. ఆర్ట్‌వర్క్స్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎంపిక విషయమై వీరిలో మంచి పరిణతి కనిపిస్తోంది.

ఆర్ట్ హౌజ్‌లు, గ్యాలరీలు యువ ఆర్ట్ కలెక్టర్స్ కోసం కొత్తగా ముస్తాబవుతున్నాయి. కావలసిన సమాచారం అందించడానికి సదా రెడీగా ఉన్నాయి.

యంగ్ ఆర్ట్ కలెక్టర్స్ పుణ్యమా అని 'మోజ్ ఆర్ట్.కామ్'లాంటి ఆన్‌లైన్ పోర్టల్స్ మెగా హిట్ అవుతున్నాయి.

'ఆర్ట్ కలెక్టింగ్ అంటే ఇంట్లో సోఫా, టేబుల్‌కు మ్యాచ్ అయ్యే ఇంటీరియర్స్‌ను కొనుగోలు చేయడం కాదు' అంటున్నారు ముంబైలోని ఒక ఆర్ట్ గ్యాలరీ ఫౌండర్ హేన కపాడియా.

'ఆర్ట్ అంటే అలంకారప్రాయం కాదు అంతకంటే ఎక్కువ' అని నమ్ముతున్న యువతరం ఆర్ట్ కలెక్టింగ్‌ను ఆషామాషీగా తీసుకోవడం లేదు. బాగా కసరత్తులు చేసి గానీ గోదాలోకి దిగడం లేదు.



డేవిడ్ వార్నర్‌కు జరిమానా

నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయనందుకు మరో ఐపీఎల్ కెప్టెన్‌పై భారీ జరిమానా పడింది. సోమవారం హైదరాబాద్‌లో సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్‌రేట్ కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌పై నిర్వాహకులు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 7 పరుగులతో గెలిచింది. వార్నర్ టీమ్ నిర్ణీత సమయంలో ఒక ఓవర్‌ను తక్కువగా వేసింది. ఇదే కారణంగా రైజర్స్ ఇన్నింగ్స్ 20వ ఓవర్లో 30 గజాల సర్కిల్ వెలుపల నలుగురు ఢిల్లీ ఫీల్డర్లను మాత్రమే (సాధారణంగా ఐదు) అనుమతించారు.

నాలుగో ర్యాంక్‌కు సురేఖ



ప్రపంచకప్‌లో రెండు స్వర్ణాలు సాధించి సత్తాచాటిన ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ వ్యక్తిగత విభాగంలో మరో మైలురాయిని అందుకుంది. మంగళవారం ప్రకటించిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సురేఖ 4వ స్థానానికి (కాంపౌండ్) చేరుకుంది. ఇప్పటి వరకు 11వ ర్యాంక్‌లో ఉన్న ఆమె తాజా ప్రదర్శనతో ఏకంగా ఏడు స్థానాలు ఎగబాకటం విశేషం.

సుమీత్ నగాల్ సంచలనం



రోమ్: ఏటీపీ రోమ్ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు సుమీత్ నగాల్ సంచలన ప్రదర్శన నమోదు చేశాడు. ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో మెరుగైన స్థానిక ప్రత్యర్థిని ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో క్వాలిఫయర్‌గా బరిలోకి దిగిన ప్రపంచ 347వ ర్యాంకర్ నగాల్ 6–2, 6–4 స్కోరుతో ఇటలీ ప్లేయర్, ప్రపంచ 172వ ర్యాంకర్ ఫ్రాన్సెస్కో మాసరెలీపై విజయం సాధించాడు. 1 గంటా 24 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో నగాల్ ఒక్క ఏస్ కూడా కొట్టలేదు. అయితే తన చక్కటి సర్వీస్‌తో ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా లేకుండా చూసుకున్నాడు. ఇటలీ ఆటగాడు 3 ఏస్‌లు సంధించినా...6 డబుల్‌ఫాల్ట్‌లతో ఓటమిని ఆహ్వానించాడు.

ఐర్లాండ్ 492 ఆలౌట్



గాలే: స్ఫూర్తిదాయక ఆటతీరు కనబర్చిన ఐర్లాండ్ జట్టు శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారీ స్కోరు నమోదు చేసింది. మ్యాచ్ రెండో రోజు మంగళవారం ఐర్లాండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 492 పరుగులకు ఆలౌటైంది. టెస్టుల్లో ఆ జట్టుకు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. కర్టిస్ క్యాంఫర్ (229 బంతుల్లో 111; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) పాల్ స్టిర్లింగ్ (181 బంతుల్లో 103; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలు నమోదు చేశారు. లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం శ్రీలంక ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 81 పరుగులు చేసింది.

మెయిన్ 'డ్రా'కు సిక్కి–రోహన్

దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జోడి సిక్కి రెడ్డి– రోహన్ కపూర్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. చివరి క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో సిక్కి – రోహన్ 21–15, 21–11 స్కోరుతో విష్ణు దేవ్ – తాబియా ఖాన్ (యూఏఈ) జంటపై విజయం సాధించారు. మరో వైపు మిక్స్‌డ్ డబుల్స్ ప్రధాన మ్యాచ్‌ల తొలి రౌండ్‌లో సుమీత్ రెడ్డి – అశ్విని పొన్నప్ప 21–16, 21–17తో టాంగ్ చున్ మన్ – సె యింగ్ సూట్ (హాంకాంగ్)ను ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

గుజరాత్ ఆల్‌రౌండ్ గెలుపు

- 55 పరుగులతో ముంబైపై జయభేరి
- గిల్, మిల్లర్, అభినవ్ మెరుపులు

అహ్మదాబాద్: డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో టైటాన్స్ 55 పరుగుల భారీ తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. ముందుగా గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగుల భారీస్కోరు చేసింది. శుబ్‌మన్ గిల్ (34 బంతుల్లో 56; 7 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (22 బంతుల్లో 46; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభినవ్ మనోహర్ (21 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) చెలరేగారు. పీయూష్ చావ్లా 2 వికెట్లు తీశాడు. తర్వాత ముంబై 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులే చేసింది. నేహల్ వధేరా (21 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. నూర్ అహ్మద్ 3, రషీద్‌ఖాన్ 2 వికెట్లు తీశారు.

మూకుమ్మడి విధ్వంసం

గిల్, మిల్లర్, అభినవ్... ఈ ముగ్గురి మెరుపులతో గుజరాత్ ఇన్నింగ్స్ రాకెట్ వేగంతో దూసుకుపోయింది. శుబ్‌మన్ గిల్ 11 ఓవర్ల పాటు క్రీజులో ఉండి దంచేశాడు. ఈ ఓపెనర్ చూడచక్కని బౌండరీలతో 30 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. ఆట ఆరంభంలోనే మరో ఓపెనర్ సాహా (4) విఫలమైనా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (13), విజయ్ శంకర్ (19) తక్కువే చేసినా... గిల్ జిగేల్ ఇన్నింగ్స్‌తో ఆ లోటేమీ కనపడలేదు. 12వ ఓవర్లో అతను అవుట్ కాగానే మిల్లర్ వచ్చాడు. మరుసటి ఓవర్లో అభినవ్ కలిశాడు. ఆ తర్వాత ధాటి పెరిగి 'డబుల్' దూకుడైంది. పరుగుల వరద పారింది.



గిల్

3 ఓవర్లలో 57 పరుగులు...

అప్పటికే క్రీజులో పాతుకుపోయిన అభినవ్, మిల్లర్ ఆఖరి మూడు ఓవర్లలో ముంబైని సిక్సర్లతో ముంచెత్తారు. స్టేడియాన్ని మెరుపులతో హోరెత్తించారు. గ్రీన్ వేసిన 18వ ఓవర్లో అభినవ్ రెండు వరుస సిక్సర్లు బాదితే... మిల్లర్ బ్యాట్ మరో సిక్స్ కొట్టింది. దీంతో 22 పరుగులు వచ్చేశాయి. తర్వాత ఓవర్ తొలి బంతికే మెరిడిత్... అభినవ్‌ను బోల్తాకొట్టిస్తే... తెవాటియా ఒక సిక్స్, మిల్లర్ రెండు సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. స్కోరులో మరో 19 పరుగులు చేరాయి. బెహ్రెన్‌డార్ఫ్ ఆఖరి ఓవర్లో తెవాటియా (5 బంతుల్లో 20 నాటౌట్; 3 సిక్స్‌లు) 2 సిక్సర్లు బాదడంతో 16 పరుగులు వచ్చాయి. దాంతో టైటాన్స్ చివరి మూడు ఓవర్లలోనే 57 పరుగులు పిండుకుంది.

తిప్పేసిన నూర్, రషీద్

ముంబై బ్యాటింగ్ ఆరంభం నుంచే గతి తప్పింది. పేస్‌ను ఎదుర్కోలేకపోయింది. స్పిన్‌కు దాసోహమైంది. చెత్త షాట్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ (2) వెనుదిరిగాడు. కాసేపటికి ఇషాన్ కిషన్ (13) నిష్క్రమించాడు. 'ఇంపాక్ట్ ప్లేయర్'గా దిగిన తిలక్ వర్మ (2)ను రషీద్ ఎల్బీగా పంపాడు. గ్రీన్ (26 బంతుల్లో 33; 3 సిక్సర్లు), సూర్యకుమార్ (12 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడినా... అది కాసేపే! వీరిద్దరితో పాటు టిమ్ డేవిడ్ (0) నూర్ అహ్మద్ స్పిన్ ఉచ్చులో చిక్కారు. 59/5 స్కోరు వద్దే ముంబై పనైపోయింది. వధేరా మెరిపించినా కొండంత లక్ష్యం ముందు అది ఏమాత్రం సరిపోలేదు.



మిల్లర్

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) ఇషాన్ (బి) అర్జున్ 4; గిల్ (సి) సూర్యకుమార్ (బి) కార్తికేయ 56; హార్దిక్ పాండ్యా (సి) సూర్యకుమార్ (బి) చావ్లా 13; విజయ్ శంకర్ (సి) డేవిడ్ (బి) చావ్లా 19; మిల్లర్ (సి) సూర్యకుమార్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 46; అభినవ్ (సి) బెహ్రెన్‌డార్ఫ్ (బి) మెరిడిత్ 42; తెవాటియా నాటౌట్ 20; రషీద్‌ఖాన్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1–12, 2–50, 3–91, 4–101, 5–172, 6–205. **బౌలింగ్:** అర్జున్ 2–0–9–1, బెహ్రెన్‌డార్ఫ్ 4–0–37–1, మెరిడిత్ 4–0–49–1, గ్రీన్ 2–0–39–0, పీయూష్ చావ్లా 4–0–34–2, కార్తికేయ 4–0–39–1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి అండ్ బి) 2; ఇషాన్ (సి) జోష్ (బి) రషీద్‌ఖాన్ 13; గ్రీన్ (బి) నూర్ అహ్మద్ 33; తిలక్‌వర్మ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్‌ఖాన్ 2; సూర్యకుమార్ (సి అండ్ బి) నూర్ అహ్మద్ 23; టిమ్ డేవిడ్ (సి) అభినవ్ (బి) నూర్ అహ్మద్ 0; వధేరా (సి) షమీ (బి) మోహిత్ 40; చావ్లా రనౌట్ 18; అర్జున్ (సి) జోష్ (బి) మోహిత్ 13; బెహ్రెన్‌డార్ఫ్ నాటౌట్ 3, మెరిడిత్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 152. వికెట్ల పతనం:** 1–4, 2–43, 3–45, 4–59, 5–59, 6–90, 7–135, 8–137, 9–152. **బౌలింగ్:** షమీ 4–0–18–0, పాండ్యా 2–0–10–1, రషీద్‌ఖాన్ 4–0–27–2, నూర్ అహ్మద్ 4–0–37–3, మోహిత్ 4–0–38–2, జోష్ లిటిల్ 2–0–18–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
గుజరాత్	7	5	2	10	0.580
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
బెంగళూరు	7	4	3	8	-0.008
పంజాబ్	7	4	3	8	-0.162
ముంబై	7	3	4	6	-0.620
కోల్‌కతా	7	2	5	4	-0.186
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x కోల్‌కతా (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

అజింక్య రహానే పునరాగమనం

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత జట్టు ప్రకటన



ముంబై: సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే మరోసారి భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్ కోసం మంగళవారం బీసీసీఐ ప్రకటించిన 15 మంది సభ్యుల బృందంలో రహానేకు అవకాశం లభించింది. 2022 జనవరిలో దక్షిణాఫ్రికాతో రహానే తన చివరి టెస్టు ఆడాడు. ఆ తర్వాత శ్రీలంకతో సొంతగడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌కు స్థానం కోల్పోయిన రహానే ఆ తర్వాత బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు కూడా ఎంపిక కాలేదు. పైగా ఇటీవల ప్రకటించిన బీసీసీఐ కాంట్రాక్ట్‌లలో కూడా అతనికి చోటు లభించలేదు. అయితే టీమ్‌లోని కీలక బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గాయంతో దూరం కావడంతో రహానే ఎంపిక సులువైంది. టీమిండియాకు దూరమైన తర్వాత రంజీ ట్రోఫీ తాజా సీజన్లో ముంబై తరఫున 11 ఇన్నింగ్స్‌లలో 57.63 సగటుతో 634 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. పైగా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో అజింక్య ఆట చూస్తే అతని బ్యాటింగ్‌లో దూకుడు కూడా పెరిగినట్లు కనిపిస్తోంది. 82 టెస్టుల అనుభవంతో పాటు ఇంగ్లండ్‌లాంటి వేదికలపై రహానే పదునైన ఆట కీలకంగా మారే అవకాశం ఉండటంతో మళ్లీ అతని పేరును పరిశీలించారు. ఇది మినహా టీమ్ ప్రకటనలో ఎలాంటి సంచలనాలు, ఆశ్చర్యకర ఎంపికలు లేవు. ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్ టీమ్‌లో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఆసీస్‌తో చివరి రెండు మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాని కేఎల్ రాహుల్ కూడా టీమ్‌లో ఉన్నాడు. అయితే ఆస్ట్రేలియాతో సిరీస్‌లో టీమిండియాలో భాగంగా ఉన్న సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్, ఇషాన్ కిషన్ తమ స్థానాలు కోల్పోయారు. జూన్ 7నుంచి లండన్‌లోని ఓవల్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. **జట్టు వివరాలు:** రోహిత్ (కెప్టెన్), గిల్, పుజారా, కోహ్లి, రహానే, రాహుల్, కేఎస్ భరత్, అశ్విన్, జడేజా, అక్షర్, శార్దుల్, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్.

ఢిల్లీ ప్రభుత్వానికి 'సుప్రీం' నోటీసులు

కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్ల ఫిర్యాదుకు సంబంధించి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై భారత అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. వెంటనే దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలంటూ ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఒక మైనర్ సహా మొత్తం ఏడుగురు మహిళా రెజ్లర్లు ఈ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. 'ఏడుగురు మహిళా రెజ్లర్లు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై గతంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను ఇప్పటివరకు బహిరంగ పర్చలేదు. వారిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదుచేయలేదు' అంటూ పిటిషనర్ల తరఫున న్యాయవాది కపిల్ సిబాల్ వాదించారు. దాంతో సుప్రీం కోర్టు నోటీసు గురించి ఆదేశాలు జారీ చేసింది. 'భారత్‌కు ఎన్నో విజయాలు అందించిన రెజ్లర్లు చేసిన ఆరోపణలు తీవ్రమైనవి. వీటిపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉంది. శుక్రవారం లోగా ప్రభుత్వం వివరణ ఇవ్వాలి' అంటూ ఆదేశించింది. గత జనవరిలో బ్రిజ్‌భూషణ్‌పై తమ అసంతృప్తిని ప్రకటిస్తూ రెజ్లర్లు నిరసనకు దిగారు. చివరకు కేంద్ర క్రీడాశాఖ మేరీకోమ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత బబిత ఫొగాట్‌ను చేర్చి ఆరుగురు సభ్యులుగా మార్చారు. అయితే ఇప్పటి వరకు కూడా ఆ కమిటీ ఎలాంటి నివేదిక ఇవ్వలేదు. మరో వైపు రెజ్లర్ల నిరసన కార్యక్రమానికి రాజకీయ నాయకులు కూడా వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడా, సీపీఐ నాయకురాలు బృందా కారత్, భారత్ కిసాన్ జోడో ఉద్యమకారులతో పాటు పలువురు స్వచ్ఛంద సంస్థలకు చెందిన వ్యక్తులు ఇందులో పాల్గొన్నారు.



నిరసన వేదిక వద్ద బజరంగ్, వినేశ్, సాక్షి

సినిమా

అప్పుడు కోమాలో ఉన్నట్లనిపించింది

– కార్తీక్ దండు



''ఇటీవలి కాలంలో హారర్ కామెడీ సినిమాలు వచ్చాయి కానీ ఓ స్ట్రిక్ట్ అండ్ హానెస్ట్ హారర్ ఫిల్మ్ రాలేదు. అందుకే హారర్ జానర్‌కి అభిమానిని అయిన నేను 'విరూపాక్ష' తీశాను. ప్రేక్షకులను థ్రిల్ చేయాలని సినిమాలోని మర్డర్ సీక్వెన్స్‌లను కొత్తగా డిజైన్ చేశాం'' అన్నారు దర్శకుడు కార్తీక్ దండు. సాయిధరమ్ తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'విరూపాక్ష'. సుకుమార్ రైటింగ్స్ పతాకంపై బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజైంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ– ''2016–17 సమయంలో ఓ పేపర్‌లో ఒక ఆర్టికల్ చదివాను. చేతబడి చేస్తున్నారనే ఆరోపణతో ఓ మహిళను గ్రామస్తులు కొట్టి చంపేస్తారు. ఆమెకు నిజంగా చేతబడి చేసే శక్తులు ఉంటే ఏం జరుగుతుందని ఊహించి 'విరూపాక్ష' కథ రాశాను. నా కథను నమ్మిన సుకుమార్‌గారు స్క్రీన్ ప్లే అందించి, తాను ఓ నిర్మాతగా ఉంటానని అన్నారు. అలాగే సాయితేజ్‌గారిని హీరోగా నిర్ణయించి, బీవీఎస్ఎన్ ప్రసాద్ గారిని నిర్మాతగా నిర్ణయించారు. అయితే 'విరూపాక్ష' షూటింగ్‌ను మరో రెండు మూడ్రోజుల్లో మొదలు పెడదామనుకున్న సమయంలో సాయిధరమ్ తేజ్‌గారికి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ సమయంలో సినిమా పరిస్థితి ఏంటో అని మెంటల్‌గా నాకు నేను కోమాలోనే ఉన్నట్లనిపించింది. సాయి తేజ్‌గారికి అంతా బాగానే ఉందని చెప్పగానే రిలాక్స్ అయ్యాను. 'విరూపాక్ష' విడుదలయ్యాక చాలామంది నిర్మాతలు ఫోన్ చేశారు. ఈ సినిమాను ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.



'ఆడు జీవితం'లో...

'బర్రోజ్'లో...

'మామా మశ్చీంద్ర'లో

'పుష్ప2'లో...

'తంగలాన్'లో...

శైలజ గుర్తుండిపోతుంది



పాయల్ రాజ్‌పుత్

కార్తికేయ హీరోగా నటించిన 'ఆర్ఎక్స్ 100' సినిమాతో అజయ్ భూపతి డైరెక్టర్‌గా, పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ సినిమా విడుదలైన దాదాపు ఐదేళ్లకు అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో 'మంగళవారం' అనే సినిమా రూపొందుతోంది. స్వాతి గునుపాటి, సురేష్ వర్మ .ఎం, 'ఎ' క్రియేటివ్ వర్క్స్ పతాకంపై అజయ్ భూపతి నిర్మిస్తున్న 'మంగళవారం' మూవీ ఫస్ట్ లుక్‌ని మంగళవారం విడుదల చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''గ్రామీణ నేపథ్యంలో 1990వ దశకంలో సాగే కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మన నేటివిటీతో కూడిన డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్. ఇండియాలో ఎవరూ ప్రయత్నించని కొత్త జానర్ సినిమా'' అన్నారు. ''ఆర్ఎక్స్ 100'లో పాయల్ చేసిన ఇందు పాత్ర ప్రేక్షకులకు ఎలా గుర్తుండిపోయిందో, 'మంగళవారం'లో శైలజ పాత్ర అలాగే గుర్తుంటుంది'' అన్నారు స్వాతి గునుపాటి, సురేష్ వర్మ .ఎం.

నావింకా బేబీ స్టెప్సే!

– డింపుల్ హయతి



''ఓ నటిగా నాకు అన్ని పాత్రలూ చేయాలని ఉంది. కెరీర్‌లో ఐదేళ్లు గడిచిపోయినా కూడా నేను ఇంకా బేబీ స్టెప్స్ వేస్తున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా ఉంది'' అన్నారు హీరోయిన్ డింపుల్ హయతి. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో డింపుల్ హయతి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో యూ ట్యూబ్ బ్లాగర్ భైరవి పాత్రలో నటించాను. సోషల్ మీడియాలో అంతగా యాక్టివ్‌గా ఉండని నాకు ఈ పాత్ర కొత్తగా, కాస్త చాలెంజింగ్‌గా అనిపించింది. 'ఖిలాడి' సినిమాలో నా గ్లామరస్ యాక్టింగ్‌ను చూసి శ్రీవాస్‌గారు 'రామబాణం' సినిమాలో భైరవి పాత్ర నేను చేయగలనా? అని కాస్త సంకోచించారు. దీంతో రెండు ఆడిషన్స్ ఇచ్చాను. 'భైరవి' పాత్రకు నేను సరిపోతానని ఆయన నమ్మారు. ప్రస్తుతం కొన్ని కొత్త కథలు వింటున్నాను. తెలుగు, తమిళ భాషల్లో నేను చేసిన కొత్త సినిమాల ప్రకటనలు త్వరలోనే వస్తాయి'' అన్నారు.


భాష రాకపోవడం నా బలహీనత

– డినో మోరియా



అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఏజెంట్'. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన బాలీవుడ్ నటుడు డినో మోరియా విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్) మాజీ ఏజెంట్ 'ది గాడ్' పాత్ర చేశాను. సురేందర్ రెడ్డి 'ఎంపైర్' చూసి, నాకు 'ఏజెంట్'కి చాన్స్ ఇచ్చారు. ప్రతి సీన్‌లోనూ నా నుంచి ఆయన మోర్ ఎనర్జీని కోరుకునేవారు. అయితే తెలుగు భాష రాకపోవడం నా బలహీనతగా అనిపించింది. ఇక తెలుగు ఫ్యాన్స్ తమ స్టార్స్ కోసం ప్రాణమిస్తారు. బాలీవుడ్‌లో ఇది అంతగా కనిపించదు. చిరంజీవి ఫ్యాన్స్ రామ్‌చరణ్‌ను, నాగార్జున ఫ్యాన్స్ అఖిల్‌ను అభిమానిస్తున్నారు. బాలీవుడ్‌లో నెపొటిజమ్ అంటే ఒప్పుకోను. నాది బెంగళూరు. బాలీవుడ్‌లో ఎవరూ తెలియకుండానే ముంబై వెళ్లి, అవకాశాలు తెచ్చుకుని ఇప్పుడు నటుడిగా మంచి స్థాయిలో ఉన్నాను'' అన్నారు.

రాణిగారి గదిలో...



కోమల్, అబిద్, సిరాజ్

రోషన్, కోమల్ జెన్, సాక్షి, స్రవంతి, పూజా డే కీలక పాత్రల్లో అబిద్ దర్శకత్వంలో సిరాజ్ నిర్మించిన చిత్రం 'రాణిగారి గదిలో దెయ్యం'. పీవీ సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో వస్తున్న ఐదో సినిమా 'రాణిగారి గదిలో దెయ్యం'. హారర్ కాన్సెప్ట్‌తో వినోదాత్మకంగా సాగే చిత్రమిది'' అన్నారు. ''హారర్ కథతో చక్కని సినిమా తీశాం'' అన్నారు అబిద్.

వీరి వీరి గుమ్మడిపండు
వీరి పేరేమి?

దాగుడు మూతలాట ఆడుకోని వాళ్లుండరు... కళ్లకు గంతలు కట్టి పేర్లు అడిగితే చెప్పాలి. ఇది రియల్ ఆట. రీల్ గేమ్ విషయానికి వస్తే.. గంతలు కట్టకుండా.. ఆర్టిస్ట్‌ని ఎదురుగా నిలబెట్టి, 'వీరి పేరేమి' అని అడిగితే.. ఆ ఆర్టిస్ట్‌ని గుర్తుపట్టడానికి కాస్త టైమ్ పడుతుంది. అసలు గుర్తు పట్టకపోవచ్చు కూడా. అంతలా కొందరు స్టార్స్ క్యారెక్టర్లలో ఒదిగిపోయారు. ఫిజికల్ మేకోవర్‌తో, మేకప్‌తో గుర్తుపట్టలేనంతగా మారిపోయిన ఆ హీరోల గురించి తెలుసుకుందాం.

- పాత్రల కోసం రూపాన్ని మార్చుకోవడానికి ఏమాత్రం వెనకడుగు వేయరు విక్రమ్. 'శివపుత్రుడు, అపరిచితుడు, ఐ' వంటి చిత్రాలు అందుకు నిదర్శనం. తాజాగా 'తంగలాన్'లో కొత్త అవతారంలో కనిపించనున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్ (కేజీఎఫ్) నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో మాస్ లుక్‌లో కనిపించనున్నారు విక్రమ్. గనుల తవ్వకాల పనులు చేసే వ్యక్తుల జీవితాల నేపథ్యంలో దర్శకుడు పా. రంజిత్ పాన్ ఇండియా మూవీగా 'తంగలాన్'ని తెరకెక్కిస్తున్నారు.
- క్యారెక్టర్ ఎలా డిమాండ్ చేస్తే అలా మారిపోవాలనుకుంటారు అల్లు అర్జున్. గతంలో 'దేశ ముదురు' సినిమా కోసం సిక్స్ ప్యాక్ చేశారు. తాజాగా 'పుష్ప' కోసం ఫిజికల్ మేకోవర్‌తో పాటు మేకప్ పరంగానూ వ్యత్యాసం చూపించారు. స్మగ్లర్ పుష్పరాజ్‌గా తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో రెచ్చిపోయారు అల్లు అర్జున్. మలి భాగం 'పుష్ప:ది రూల్' చిత్రీకరణ జరుగుతోంది. కాగా.. పుష్పరాజ్‌గా గుర్తు పట్టలేనంతగా అల్లు అర్జున్ మారలేదు. కానీ రెండో భాగంలో జాతర బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఒక ఫైట్‌లో గుర్తు పట్టలేని విధంగా మారిపోయారు. పండగ చివరి రోజు స్త్రీ వేషధారణలో పురుషులు చెడును నాశనం చేసే గంగమ్మ తల్లిగా మారతారని, ఈ ఫైట్‌లో అల్లు అర్జున్ గెటప్ అదే అని తెలిసింది. సుకుమార్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.
- దుర్గ, పరశురామ్, డీజే.. ఈ మూడు పాత్రల్లో సుధీర్‌బాబు కనిపించనున్న చిత్రం 'మామా మశ్చీంద్ర'.. వీటిలో దుర్గ పాత్ర డిఫరెంట్. ఏజ్డ్ గ్యాంగ్‌స్టర్ అన్నమాట. మామూలుగా సుధీర్‌బాబు చాలా స్లిమ్‌గా, ఫిట్‌గా ఉంటారు. అయితే ఈ పాత్రలో అందుకు భిన్నంగా బొద్దుగా కనబడతారు. హర్షవర్ధన్ దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది.
- అటు మలయాళంకి వెళితే సీనియర్ హీరో మోహన్‌లాల్, యంగ్ హీరో పృథ్వీ రాజ్‌కుమారన్‌లు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించనున్నారు. మోహన్‌లాల్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'బర్రోజ్'. వాస్కో డి గామా నిధిని రక్షించడానికి నియమించబడిన 400 ఏళ్ల నాటి ఆత్మ బర్రోజ్. ఆ నిధిని వాస్కో అసలు వారసునికి అప్పగించడానికి ఆ ఆత్మ వేచి ఉంటుంది. కాల్పనిక కథతో త్రీడీ చిత్రంగా 'బర్రోజ్' రూపొందుతోంది. కాగా ఈ చిత్రంలో టైటిల్ రోల్ చేయడంతో పాటు మోహన్ లాల్ దర్శకత్వం కూడా వహిస్తున్నారు.
- మరో మలయాళ హీరో–దర్శకుడు పృథ్వీ రాజ్‌కుమారన్ గొర్రెల కాపరిగా కనిపించనున్న చిత్రం 'ఆడు జీవితం'. 2008లో ఇదే పేరుతో వచ్చిన నవల నేపథ్యంలో బ్లెస్సీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నజీబ్ అనే మలయాళీ వలస కార్మికుడి పాత్రలో పృథ్వీరాజ్ కనిపిస్తారు. సౌదీ అరేబియాకి వలస వెళ్లిన నజీబ్‌ను గొర్రెల కాపరిని చేసి, బలవంతంగా బానిసత్వంలోకి నెట్టివేస్తారు. నిజజీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రం సాగుతుంది.

సవాళ్లను ఇష్టపడని స్టార్స్ ఉండరు. అయితే సవాళ్లు అరుదుగా వస్తుంటాయి. అందుకే చాలెంజింగ్ రోల్స్ వచ్చినప్పుడు 'సై' అంటూ ఎంత కష్టపడటానికైనా సిద్ధపడిపోతారు. ఈ సవాళ్లు స్టార్స్‌కి కిక్కే.. అభిమానులకూ కిక్కే. సినిమా సరిగ్గా క్లిక్ అయితే బాక్సాఫీస్‌కీ కిక్కే.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	75	60,131
నిఫ్టీ ▲	26	17,769

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,858	▽ 179
డోజోన్స్	33,578	▽ 297
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,891	▽ 21
డాక్స్	15,872	▲ 8
షాంఘై	3,265	▽ 11
నికాయ్	28,620	▲ 27

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,078	▽ 3
బంగారం (22 క్యారెట్)	59,837	▽ 3
వెండి (కిలో)	74,075	▽ 315

మారుతీ వాహనాలు అప్‌గ్రేడ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్ స్టేజ్–6 ఉద్గార ప్రమాణాలు రెండవ దశ కింద అన్ని మోడళ్లను అప్‌గ్రేడ్ చేసినట్టు వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా వెల్లడించింది. హ్యాచ్‌బ్యాక్స్, సెడాన్స్, ఎంపీవీలు, ఎస్‌యూవీలతోపాటు వాణిజ్య వాహనాలు సైతం వీటిలో ఉన్నాయని కంపెనీ తెలిపింది. ఈ20 ఇంధనం వినియోగానికి అనువుగా వీటిని తీర్చిదిద్దినట్టు పేర్కొంది. కాలుష్యం ఏ స్థాయిలో వెలువడుతుందో ఎప్పటికప్పుడు తెలిపే ఆన్‌–బోర్డ్ డయాగ్నోస్టిక్స్ (ఓబీడీ) సిస్టమ్‌ను వాహనంలో అమర్చినట్టు వివరించింది. అన్ని మోడళ్లు ఇప్పుడు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ) వ్యవస్థను కలిగి ఉన్నాయని ప్రకటించింది. కంపెనీ ఖాతాలో ప్రస్తుతం 15 మోడళ్లు ఉన్నాయి.

నెస్లే ఇండియా లాభం జూమ్

- క్యూ4లో రూ. 737 కోట్లు
- షేరుకి రూ. 27 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ1)లో నికర లాభం 25% జంప్‌చేసి రూ. 737 కోట్లకు చేరింది. గతేడాది(2022) ఇదే కాలంలో రూ. 591 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం అమ్మకాలు సైతం 20% ఎగసి రూ. 4,808 కోట్లను అధిగమించాయి. గత క్యూ1లో రూ. 3,963 కోట్ల అమ్మకాలు ప్రకటించింది. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 27 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. తాజా త్రైమాసికంలో ప్రొడక్టుల ధరలు, అమ్మకాల పరిమాణం తదితరాల్లో పటిష్ట ఫలితాలు సాధించినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు. 2016ను మినహాయిస్తే గత పదేళ్లలో ఒక త్రైమాసికానికి అత్యధిక వృద్ధిని సాధించినట్లు తెలియజేశారు. 2015లో తలెత్తిన మ్యాగీ వివాదం నేపథ్యంలో లోబేస్ కారణంగా 2016లో గరిష్ట వృద్ధిని అందుకున్నట్లు ప్రస్తావించారు.

దేశీయంగా భళా

క్యూ1లో నెస్లే ఇండియా దేశీ అమ్మకాలు 21% పైగా పుంజుకుని రూ. 4,613 కోట్లకు చేరాయి. కమోడిటీల ధరలు పెరిగినప్పటికీ మిల్క్ ప్రొడక్టులు, న్యూట్రిషన్ విభాగంలో రెండంకెల వృద్ధి నమోదైంది. ఈ బాటలో కాఫీ బ్రాండు నెస్‌కెఫే రికార్డ్ మార్కెట్ వాటాను సాధించినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో నెస్లే ఇండియా షేరు స్వల్ప నష్టంతో రూ. 20,670 వద్ద ముగిసింది.

నాస్కామ్ చైర్‌పర్సన్‌గా అనంత్ మహేశ్వరి

- 2023–24 సంవత్సరానికి ఎంపిక
- వైస్ చైర్‌పర్సన్‌గా రాజేష్ నంబియార్



న్యూఢిల్లీ: ఐటీ పరిశ్రమ అత్యున్నత సంఘమైన నాస్కామ్ చైర్‌పర్సన్‌గా 2023–24 సంవత్సరానికి అనంత్ మహేశ్వరి ఎంపికయ్యారు. మహేశ్వరి ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. అంతేకాదు నాస్కామ్ వైస్ చైర్మన్‌గానూ ఇప్పటి వరకు సేవలు అందించారు. టీసీఎస్ బిజినెస్, టెక్నాలజీ విభాగం ప్రెసిడెంట్ అయిన కృష్ణన్ రామానుజం ఇప్పటి వరకు నాస్కామ్ చైర్ పర్సన్‌గా సేవలు అందించగా, ఆయన స్థానంలో అనంత్ మహేశ్వరి పని చేయనున్నారు. కాగ్నిజంట్ ఇండియా చైర్మన్, ఎండీగా ఉన్న రాజేష్ నంబియార్‌ను నాస్కామ్ వైస్ చైర్మన్‌గా నియమించారు.

రెండో రోజూ లాభాల్లో

- సెన్సెక్స్ 75 పాయింట్లు ప్లస్
- 60,131 వద్ద ముగింపు
- నిఫ్టీ 26 పాయింట్లు అప్
- ప్రభుత్వ బ్యాంకులకు డిమాండ్



ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. తొలుత నేలచూపులతో మొదలైనప్పటికీ వెనువెంటనే ఊపందుకున్నాయి. చివరికి సెన్సెక్స్ 75 పాయింట్లు పుంజుకుని 60,131 వద్ద నిలిచింది. నిఫ్టీ 26 పాయింట్లు లాభపడి 17,769 వద్ద ముగిసింది. ముందురోజు భారీ డిమాండును అందుకున్న ప్రభుత్వ రంగ బ్యాంక్ కౌంటర్లకు వరుసగా రెండో రోజూ కొనుగోళ్ల మద్దతు లభించింది. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో ఐటీ, బ్యాంకింగ్ తదితర రంగాల బ్లూచిప్ కంపెనీలు ఆకర్షణీయ ఫలితాలు సాధిస్తుండటంతో సెంటిమెంటుకు జోష్ వచ్చినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దీంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. అయితే గురువారం ఏప్రిల్ డెరివేటివ్ సిరీస్ ముగియనుండటంతో కొంతమేర హెచ్చుతగ్గులు నమోదవుతున్నట్లు వివరించారు.

కన్జూమర్ డ్యురబుల్స్ వీక్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా పీఎస్‌యూ బ్యాంక్స్, ఆయిల్, మెటల్, రియల్టీ 1.3–0.5 శాతం మధ్య బలపడగా.. మీడియా, కన్జూమర్ డ్యురబుల్స్ 1.2 శాతం, మీడియా 0.7 శాతం చొప్పున డీలాపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, బజాజ్ ఫైనాన్స్, ఫిన్‌సర్వ్, బ్రిటానియా, ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్, ఐషర్, ఎస్‌బీఐ, దివీస్, ఐసీఐసీఐ, ఆర్‌ఐఎల్, ఐటీసీ 2.5–0.6 శాతం మధ్య ఎగశాయి.

ఫోన్లు ఎన్నయినా ఒకటే వాట్సాప్

అమల్లోకి కొత్త ఫీచర్



న్యూఢిల్లీ: వాట్సాప్ ఓ అనుకూల సదుపాయాన్ని తన యూజర్ల కోసం రూపొందించింది. ఒకటికి మించిన ఫోన్లలో ఒక్కటే వాట్సాప్ ఖాతాను ఉపయోగించుకోవచ్చని ప్రకటించింది. అంతర్జాతీయంగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు, రానున్న వారాల్లో ప్రతి ఒక్కరికీ ఇది వినియోగంలోకి వస్తుందని పేర్కొంది. ఈ ఫీచర్ కావాలంటూ వాట్సాప్ యూజర్లలో ఎక్కువ మంది నుంచి వినతులు రావడంతో దీన్ని రూపొందించినట్టు సంస్థ తెలపింది. వాట్సాప్‌ను వెబ్ బ్రౌజర్‌కు కనెక్ట్ చేసిన మాదిరే, ఒకటికి మించిన ఫోన్లలోనూ అనుసంధానించడం ద్వారా కొత్త ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు. ఇలా ఒకే ఖాతా అనుసంధానమై ఉన్న ఏ ఫోన్లో అయినా చాట్, మీడియా, కాల్స్ సేవలు వాడుకోవచ్చని వాట్సాప్ తెలిపింది. ఒకవేళ ప్రైమరీ ఫోన్ (మొదట ఇన్‌స్టాల్ చేసుకున్న)లో వాట్సాప్ చాలా కాలంగా యాక్టివ్‌గా లేకపోతే, అప్పుడు ఆ అకౌంట్ కనెక్ట్ అయి ఉన్న ఇతర ఫోన్లలోనూ దానంతట అదే లాగవుట్ అవుతుందని పేర్కొంది. సైనవుట్ చేయాల్సిన అవసరం లేకుండా, ఒక ఫోన్ నుంచి ఇంకో ఫోన్‌కు 'నౌ స్విచ్'ను ఎంపిక చేసుకోవచ్చని వాట్సాప్ తెలిపింది.

ఆటో ఎల్‌పీజీ కథ ముగిసినట్టే!

- గణనీయంగా తగ్గిపోయిన విక్రయాలు
- ఇంధన ధరలూ అధికమే
- సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వైపు మొగ్గు

న్యూఢిల్లీ: దేశ ఆటోమొబైల్ మార్కెట్ క్రమంగా పర్యావరణ అనుకూల పరిష్కారాల వైపు అడుగులు వేస్తోంది. ఎక్కువ మంది పెట్రోల్, ఎలక్ట్రిక్ వాహనాలు, సీఎన్‌జీ కార్లకు ప్రాధాన్యం ఇస్తుండడంతో.. ఆటోమొబైల్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ తర్వాత సీఎన్‌జీ వాహనాలకే ఎక్కువ డిమాండ్ నెలకొంది. దీంతో ఎల్‌పీజీ కార్ల విక్రయాలు ఐదేళ్ల కాలంలో (2018–19 నుంచి చూస్తే) 82 శాతం తగ్గిపోయాయి. 2022–23లో కేవలం 23,618 ఎల్‌పీజీ కార్లు మాత్రమే అమ్ముడయ్యాయి. కానీ, 2018–19లో 1,28,144 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం. కేంద్ర రవాణా శాఖ పరిధిలోని వాహన్ పోర్టల్ గణాంకాలు ఈ విషయాన్ని తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం మీద 2,22,24,702 యూనిట్ల వాహనాలు అమ్ముడుపోతే, ఇందులో ఎల్‌పీజీ వాహనాలు కేవలం 0.11 శాతంగా ఉండడం వినియోగదారులు వీటి పట్ల ఆసక్తిగా లేరని తెలుస్తోంది. అదే సమయంలో సీఎన్‌జీ వాహన విక్రయాలు ఇందులో 3 శాతంగా ఉంటే, ఎలక్ట్రిక్ వాహనాలు 5 శాతంగా ఉండడం, కస్టమర్లు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నట్టు తెలియజేస్తోంది.



ఎగసి పడిన డిమాండ్

ఎల్‌పీజీ పుష్కలంగా అందుబాటులో ఉండడమే కాదు, ఎక్కువ ఆక్టేన్ కలిగి, చాలా తక్కువ ఉద్గారాలను విడుదల చేసే ఇంధనం కావడంతో.. ఆటోమొబైల్ పరిశ్రమకు ప్రత్యామ్నాయ ఇంధనంగా లోగడ భావించారు. దీంతో ఎల్‌పీజీ కార్లు, ఎల్‌పీజీ త్రిచక్ర వాహనాలు 2019లో ఎక్కువగా అమ్ముడుపోయాయి. కానీ, దేశంలో ఎల్‌పీజీ వాహనాల వినియోగం చట్టబద్ధంగా అమల్లోకి వచ్చింది మాత్రం 2020 ఏప్రిల్ నుంచి కావడం గమనార్హం. నాలుగు చక్రాల ప్యాసింజర్ వాహనాలకుతోడు, ఎల్‌పీజీ త్రిచక్ర వాహనాలు (80 శాతానికి పైగా) 2019లో రికార్డు స్థాయి ఎల్‌పీజీ వాహన అమ్మకాలకు దోహదపడినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కానీ, 2022–23 సంవత్సరంలో ఎల్‌పీజీ వాహనాల డిమాండ్ 14 శాతానికి పరిమితమైంది. 2018–19లో ఇది 18 శాతంగా ఉంది. 2022–23లో కేవలం 3,495 ఎల్‌పీజీ నాలుగు చక్రాల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. 2018–19లో ఇలా రిజిస్టర్ అయిన నాలుగు చక్రాల వాహనాలు 23,965 యూనిట్లుగా ఉండడం గమనించాలి. ''విక్రయానంతరం ప్యాసింజర్ వాహనాలకు ఉన్న డిమాండ్ ఇది. 2018 నుంచి 2020 వరకు ప్యాసింజర్ వాహన విభాగమే ఎల్‌పీజీకి పెద్ద మద్దతుగా నిలిచింది. నిబంధనలు అనుకూలంగా లేకపోవడం, కిట్ ఆధారిత అనుమతులకు అధిక వ్యయాలు చేయాల్సి రావడం, ప్రతి మూడేళ్లకోసారి తిరిగి సర్టిఫై చేయించుకోవాల్సి రావడం, ఎల్‌పీజీ మోడళ్లు పెద్దగా అందుబాటులో లేకపోవడం వినియోగదారుల్లో ఆసక్తి ఆవిరైపోవడానికి కారణం''అని ఇండియన్ ఆటో ఎల్‌పీజీ కొయిలిషన్ డైరెక్టర్ జనరల్ సుయాష్ గుప్తా వివరించారు.

వసతులు కూడా తక్కువే..

2023 మార్చి నాటికి దేశవ్యాప్తంగా కేవలం 1,177 ఎల్‌పీజీ స్టేషన్లే ఉన్నాయి. అదే సీఎన్‌జీ స్టేషన్లు అయితే 4,600 ఉంటే, ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు 5,200 ఉన్నాయి. పెట్రోల్ పంపులు 80,000 పైగా ఉన్నాయి. అంటే ఎల్‌పీజీ విషయంలో సరైన రీఫిల్లింగ్ వసతులు కూడా లేవని తెలుస్తోంది. మరోవైపు ధరలు కూడా అనుకూలంగా లేని పరిస్థితి నెలకొంది. ఢిల్లీలో కిలో ఎల్‌పీజీ ధర లీటర్‌కు రూ.68కి చేరుకోగా, 2019లో రూ.40 మాత్రమే ఉంది. ఇతర రాష్ట్రాల్లో దీని ధర ఇంకా ఎక్కువే. ''ప్రభుత్వం వైపు నుంచి ప్రోత్సాహం కొరవడడంతో వాహన తయారీదారులు ఎల్‌పీజీ మోడళ్లను తీసుకొచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. నేడు దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా అయితే ఎల్‌పీజీ కార్ల తయారీని నిలిపివేసింది. ప్రజలు సీఎన్‌జీ, ఈవీల పట్ల ఆసక్తి చూపిస్తుండడం దేశంలో ఎల్‌పీజీ వాహన రంగానికి గొడ్డలి పెట్టుగా మారింది''అని పరిశ్రమకు చెందిన నిపుణుడు ఒకరు పేర్కొన్నారు. ఈవీ, సీఎన్‌జీ వాహనాలను కేంద్రం సబ్సిడీలతో ప్రోత్సాహిస్తుండడాన్ని పరిశ్రమ ప్రస్తావిస్తోంది.

అపోలో జీనోమిక్ ఇన్‌స్టిట్యూట్స్

చెన్నై: వైద్య సేవల రంగంలో ఉన్న అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఈ ఏడాది చివరినాటికి హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్‌లో జీనోమిక్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే సంస్థకు ముంబై, ఢిల్లీలో ఇటువంటి ఫెసిలిటీస్ ఉన్నాయి. చెన్నై సెంటర్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ కేంద్రాల్లో జన్యు మూల్యాంకనం, క్లినికల్ డయాగ్నోస్టిక్స్, ప్రసూతి జన్యుశాస్త్రం, క్యాన్సర్ జీనోమిక్స్ వంటి సేవలను అందిస్తారు.

గ్రాన్యూల్స్ రూపంలో కాయం చూర్ణ



హైదరాబాద్: మలబద్ధకానికి ఔషధంగా గత 50 సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న తమ ప్రతిష్టాత్మక 'కాయం చూర్ణ' ఇక గ్రాన్యూల్స్ (గుళికలు లేదా పలుకులు) రూపంలోనూ అందుబాటులోనికి రానుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అడ్వాన్స్‌డ్ ఫార్ములా వల్ల చూర్ణ గొంతులో అతుక్కుపోవడం, అసౌకర్యం వంటి సమస్యలు తొలగిపోతాయని భావ్‌నగర్ కేంద్రంగా ఈ ఉత్పత్తిలో ఉన్న సేథ్ బ్రదర్స్ సంస్థ వివరించింది. జీలకర్ర రుచితో ఉండే ఈ కొత్త ప్రాడక్ట్ కడుపును శుద్ధి చేయడానికి మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని ప్రకటన పేర్కొంటూ.. ఆముదం, గులాబీ ఆకుల మేళవింపుతో ప్రాడక్ట్ రూపొందడం దీనికి కారణమని వివరించింది.

భవిత

నేడే ఇంటర్ ఫస్ట్, సెకండియర్ ఫలితాలు–2023
ఫలితాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వెంటనే ఫలితాలు పొందండి.
పూర్తి వివరాల కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తెలంగాణ గురుకులాల్లో 132 ఆర్ట్ టీచర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ)..తెలంగాణ సాంఘిక సంక్షేమం,గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 132
» **సొసైటీల వారీగా ఖాళీలు:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు–16, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు–6, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు–72, తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకులాలు–38.
» **అర్హత:** పదో తరగతి, డిప్లొమా, టీసీసీ, బీఎఫ్‌ఏ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.31,040 నుంచి రూ.92,050 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డెమాన్‌స్ట్రేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023 నుంచి 24.05.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 1276 పీజీటీ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఆర్‌ఈఐఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1276
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** తెలుగు–183, హిందీ–168, ఇంగ్లిష్–180, గణితం–231, ఫిజికల్ సైన్స్–142, బయోలాజికల్ సైన్స్–161, సోషల్ స్టడీస్–202.
» **అర్హత:** కనీసం 50% మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీతోపాటు సంబంధిత మెథడాలజీ సబ్జెక్టులో బీఈడీ, బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ట్రెనింగ్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.45,960 నుంచి రూ.1,24,150 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్–1, 2, 3), ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023 నుంచి 24.05.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

సత్వర ఉపాధికి.. సర్టిఫికేషన్స్!

» పదో తరగతి, ఇంటర్ అర్హతగా జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు
» సైబర్ సెక్యూరిటీ నుంచి ఫొటోగ్రఫీ వరకు పలు సర్టిఫికేషన్స్
» సర్టిఫికెట్ సొంతం చేసుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



ఆఫ్టర్ టెన్త్/ఇంటర్

పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన విద్యార్థుల్లో అనేకమంది వివిధ కారణాలతో సత్వర ఉపాధి కోసం అన్వేషిస్తున్నారు. ఇలాంటి వారు తమ ఉద్యోగ లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదం చేస్తున్నాయి.. స్వల్పకాలిక సర్టిఫికేషన్ కోర్సులు! వీటిని పూర్తి చేసుకుంటే..అదనపు నైపుణ్యాలతో ఉద్యోగాన్వేషణలో ముందంజలో నిలిచే అవకాశం లభిస్తోంది! ఇటీవల పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్న జాబ్ ఓరియెంటెడ్ షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సుల వివరాలు..

పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో..ఎన్నో షార్ట్‌టర్మ్ కోర్సుల్లో చేరే అవకాశముంది. విద్యార్థులు కొంత సమయాన్ని ఈ సర్టిఫికేషన్స్ కోసం కేటాయిస్తే.. మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చు. కంప్యూటర్స్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ మొదలు ఫోటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, బ్యుటీషియన్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటి వ్యవధి ఆరు నెలల నుంచి సంవత్సరం. వీటిని పూర్తి చేసుకుంటే ఉపాధికి అవసరమైన క్షేత్ర నైపుణ్యాలు లభిస్తాయి. ఫలితంగా ఉద్యోగ సాధనతోపాటు మెరుగైన వేతనాలు అందుకునేందుకు మార్గం ఏర్పడుతుంది.

సైబర్ సెక్యూరిటీ

- సైబర్ సెక్యూరిటీ..ప్రస్తుత టెక్ యుగంలో అత్యంత కీలక నైపుణ్యం. ప్రస్తుతం సంస్థలు ఆన్‌లైన్ విధానంలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయి. ఆ క్రమంలో విలువైన సమాచారం తస్కరణకు గురికాకుండా.. సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలు అవసరమవుతున్నాయి. ఈ స్కిల్స్‌ను అందుకునేందుకు ఆరు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో ఉండే సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.
- పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆయా సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ అనాలిసిస్, అప్లికేషన్స్ ఆఫ్ అటాక్స్, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ అనాలిసిస్, డేటా ప్రొటెక్షన్, హార్డ్‌వేర్ ప్రొటెక్షన్ వంటి అంశాల్లో నైపుణ్యాలు పొందొచ్చు.
- ఈ సర్టిఫికేషన్ పూర్తి చేసుకున్న వారికి ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు, లేదా ఇతర రంగాల్లోని కంపెనీల్లో ఐటీ విభాగాల్లో సైబర్ సెక్యూరిటీ టీమ్ అసిస్టెంట్స్, అసోసియేట్స్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.
- కోర్సెరా, యుడెమీ వంటి సంస్థలు సర్టిఫికెట్ ఇన్ సైబర్ సెక్యూరిటీ కోర్సును ఆరు నెలల వ్యవధిలో అందిస్తున్నాయి.

హార్డ్‌వేర్ మెయింటనెన్స్

- ఐటీలోనే ఉద్యోగావకాశాలు కల్పించే మరో కోర్సు.. హార్డ్‌వేర్ మెయింటనెన్స్. కంప్యూటర్‌ను ఆపరేట్ చేయడానికి అవసరమైన సీపీయూ, నెట్ వర్కింగ్, లోకల్ ఏరియా నెట్‌వర్క్ నిర్వహణ వంటి వాటికి సంబంధించిన నైపుణ్యాలు హార్డ్‌వేర్ మెయింటనెన్స్ కోర్సు ద్వారా సొంతం చేసుకోవచ్చు. దీనికి సంబంధించి ప్రస్తుతం పీసీ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, పీసీ అసెంబ్లీ అండ్ మెయింటనెన్స్ తదితర విభాగాల్లో సర్టిఫికేషన్స్ అందుబాటులో ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ అండ్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ రిపెయిర్ అండ్ మెయింటనెన్స్ ఆఫ్ సిస్టమ్స్ వంటి కోర్సులు ఉన్నాయి.
- ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నిమ్స్‌మే, సెట్విన్ వంటి సంస్థలు ఈ కోర్సులను బోధిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. చిన్న, మధ్య తరహా సంస్థల్లో హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ అసిస్టెంట్స్, సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

కంప్యూటర్ కోర్సులు

పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతో మరెన్నో కంప్యూటర్ సర్టిఫికేషన్స్ అందుబాటులోకి వస్తున్నాయి. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో.. సీసీఎన్‌ఏ, సీసీఎన్‌పీ, ఎస్‌ఏపీ, కోర్–జావా ప్రోగ్రామింగ్, అడ్వాన్స్‌డ్ జావా ప్రోగ్రామింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, సీ++, ఎంఎస్ ఆఫీస్ అండ్ ఇంటర్నెట్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ వంటి కోర్సులున్నాయి. ఆయా కోర్సులను బట్టి మూడు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో వీటిని బోధిస్తున్నారు. అదే విధంగా ఎన్‌ఎస్‌డీసీ ఐటీ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆధ్వర్యంలోనూ వీటిని అభ్యసించే అవకాశం ఉంది. వీటిని పూర్తి చేసుకుంటే..ఐటీ, ఐటీ అనుబంధ విభాగాల్లో అసిస్టెంట్స్, సపోర్టింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలు దక్కుతాయి.

మైక్రోసాఫ్ట్ ఆఫీస్ స్పెషలిస్ట్

- సంస్థల్లో క్లరికల్ కేడర్‌లో విధులు నిర్వహించే వారికి ఉపయోగపడే కోర్సు.. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ స్పెషలిస్ట్. ఈ కోర్సును పూర్తిచేసుకుంటే..ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్‌గా పిలిచే వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ తదితర బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ లభిస్తాయి. ఇది ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకు అనుకూలమైన కోర్సుగా పేర్కొనొచ్చు. ప్రస్తుతం అన్ని సంస్థల్లో ఉద్యోగుల హాజరు నుంచి వేతన జాబితా రూపకల్పన వరకూ.. అన్నింటికీ కంప్యూటర్ ఆధారంగా మారింది. అంతేకాకుండా డాక్యుమెంటేషన్, ఎక్సెల్ షీట్ ప్రిపరేషన్స్ వంటివి సర్వ సాధారణంగా మారాయి.
- ప్రస్తుతం యుడెమీ, కోర్సెరా వంటి పలు ఇన్‌స్టిట్యూట్‌లు ఈ కోర్సులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్నాయి.
- ఈ సర్టిఫికేషన్ చేతిలో ఉంటే ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. అడ్మినిస్ట్రేషన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి కొలువులు లభిస్తాయి. నెలకు కనీసం రూ.12 నుంచి రూ.15 వేల ప్రారంభ వేతనం అందుతుంది.

డెస్క్‌టాప్ పబ్లిషింగ్

డీటీపీలో సర్టిఫికేషన్లు పూర్తి చేస్తే డేటాఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ అసిస్టెంట్లుగా ఉపాధి లభిస్తుంది. డేటాఎంట్రీ ఆపరేటర్లకు ప్రారంభంలో నెలకు రూ.ఆరు వేల నుంచి రూ.పది వేల వరకు వేతనం అందుతుంది. సొంతగా డీటీపీ సెంటర్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందొచ్చు. డేటాఎంట్రీ ఆపరేటర్‌గా కొలువు పొందాలంటే.. ఎంఎస్ ఆఫీస్ టూల్స్, టైపింగ్, ఫోటోషాప్ వంటి అంశాల్లో పరిజ్ఞానం తప్పనిసరి.

వీడియో ఎడిటింగ్

- ప్రస్తుతం సంస్థలు తమ ఉత్పత్తులకు సంబంధించిన సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్ ద్వారా,ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా వీడియోల రూపంలో అందిస్తున్నాయి. సదరు వీడియోలు, వాటిలో వినియోగించాల్సిన చిత్రాలను ఆకర్షణీయంగా రూపొందించే స్కిల్ ఉన్న వారికి డిమాండ్ నెలకొంది. అలాగే వీడియో ఎడిటింగ్‌పై పట్టుంటే.. టీవీ మీడియా, వెబ్ మీడియా, సినిమాలు, అడ్వర్‌టైజింగ్ తదితర విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. వీడియో ఎడిటింగ్‌కు సంబంధించి ప్రత్యేక నైపుణ్యాలు అందించే షార్ట్ టర్మ్ కోర్సులు ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతోనే వీటిని పూర్తి చేసుకోవచ్చు.
- వీడియో ఎడిటింగ్‌కు సంబంధించి కూడా యుడెమీ, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్, కోర్సెరా వంటి సంస్థలు మూడు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో ఉండే వీడియో ఎడిటింగ్, లీనియర్, నాన్–లీనియర్ ఎడిటింగ్ వంటి కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకోవడం ద్వారా మీడియా సంస్థలు, యానిమేషన్ సంస్థలు, అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలలో వీడియో ఎడిటర్స్, అసిస్టెంట్ వీడియో ఎడిటర్స్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్

- హోటల్ మేనేజ్‌మెంట్..ఇటీవల ఉద్యోగ కల్పనలో ముందంజలో ఉంటోంది. ఇంటర్మీడియెట్ అర్హతతో డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ, టూరిజం వంటి కోర్సుల్లో చేరొచ్చు. ఏడాది వ్యవధి ఉండే ఈ కోర్సులను పూర్తి చేసుకోవడం ద్వారా హోటల్స్, రిసార్ట్స్, టూరిజం సంస్థల్లో అసిస్టెంట్ చెఫ్, స్టివార్ట్, గైడ్, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్, గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ వంటి కొలువులు లభిస్తాయి.
- డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ ప్రొడక్షన్, డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లలో వీటిని అభ్యసించొచ్చు.

ఫొటోగ్రఫీ

మాటల్లో వర్ణించలేని భావాలను వ్యక్తం చేయడానికి చక్కటి సాధనం..ఫొటోగ్రఫీ. ఇలాంటి అద్భుతమైన మాధ్యమాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారు ఫొటోగ్రఫీ సర్టిఫికేషన్ల ద్వారా రాణించొచ్చు. ఫొటోగ్రఫీకి సంబంధించి ఆరు నెలల షార్ట్ టర్మ్ కోర్సులతోపాటు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫోటో జర్నలిజం, కమర్షియల్ ఫోటోగ్రఫీ, అడ్వర్టైజింగ్, ఫ్యాషన్ ఫొటోగ్రఫీ, ఇండస్ట్రియల్ ఫొటోగ్రఫీ, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ, ఏరియల్ ఫొటోగ్రఫీ, సైంటిఫిక్ ఫొటోగ్రఫీ.. వంటి విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. వీరికి మీడియా సంస్థలు, పబ్లిషింగ్ సంస్థలు, అడ్వర్టయిజింగ్ కంపెనీలు ప్రధాన ఉపాధి వేదికలు. వీరు సొంతంగా స్టూడియోలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా కూడా పని చేయవచ్చు. సత్యజిత్ రే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, ఏఏఎఫ్‌టీ, పిక్సెల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫొటోగ్రఫీ వంటి పలు సంస్థలు ఫోటోగ్రఫీలో డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి.

బ్యుటీషియన్

- వివిధ కారణాలతో బ్యూటీషియన్‌లకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ రంగానికి సంబంధించి కోర్సులు పూర్తి చేసిన వారు చక్కటి ఉపాధి పొందే అవకాశముంది. ప్రస్తుతం బ్యుటీషియన్ విభాగంలో సర్టిఫికెట్, డిప్లొమా స్థాయిలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి మీడియా సంస్థలు, ఫిల్మ్ ఇండస్ట్రీలో..హెయిర్ డ్రెస్సర్, స్కిన్ కేర్ స్పెషలిస్ట్, మేకప్ ఆర్టిస్ట్, కాస్మొటిక్ కన్సల్టెంట్ అండ్ బ్యూటీ అడ్వైజర్, సెలూన్ అండ్ స్పా డైరెక్టర్, నెయిల్ టెక్నీషియన్ అండ్ మేనిక్యూరిస్ట్, బ్యూటీ కన్సల్టెంట్, బ్యూటీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, కాస్మోటాలజిస్ట్, డెర్మటాలజీ అసిస్టెంట్, మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్ స్పెషలిస్ట్ ఇన్ బ్యూటీ ఇండస్ట్రీ, ఆరోమ్ థెరపిస్ట్‌లుగా స్థిరపడవచ్చు. లేదా సొంతంగా బ్యూటీపార్లర్ నిర్వహించవచ్చు. వివాహాలు, జన్మదిన వేడుకలు వంటి సందర్భాల్లో బ్యుటీషియన్లకు చక్కని ఆదాయం లభిస్తోంది. కొంత సృజనాత్మకత ఉంటే ఫ్యాషన్ రంగంలో అవకాశాలను కూడా అంది పుచ్చుకోవచ్చు.
- సెట్విన్, నిమ్స్‌మే వంటి సంస్థలు గ్రూమింగ్, పర్సనల్ గ్రూమింగ్, బ్యుటీషియన్, అడ్వాన్స్ బ్యుటీషియన్, బ్యూటీ కేర్‌లో కోర్సులను బోధిస్తున్నాయి.

యానిమేషన్

ఇటీవల అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విభాగాల్లో యానిమేషన్ ఒకటి. వీడియో గేమ్స్, కార్టూన్స్, మోషన్ కార్టూన్స్ పట్ల చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఆసక్తి పెరుగుతుండడంతో యానిమేషన్ రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది. దీంతో.. ఈ విభాగంలో నైపుణ్యాలు సొంతం చేసుకున్న వారికి చక్కటి ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం 3డి గేమింగ్, వీడియోలకు ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో.. వీటికి సంబంధించి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. మాడ్యులర్(మోడలింగ్), రిగ్గింగ్, టెక్స్చరింగ్ సెట్ డిజైనర్(ఎ–యానిమేటర్, బి–లిప్సింగ్), కంపోజిటింగ్ కోర్సులు వీటిలో ముఖ్యమైనవి. నిమ్స్‌మే ఇతర యానిమేషన్ సంస్థలు మూడు నుంచి సంవత్సరం వ్యవధిలోని కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకుంటే..వీడియో గేమింగ్ సంస్థలు, మీడియా సంస్థలు, యానిమేషన్ సంస్థలు, ఫిల్మ్ ఇండస్ట్రీలో అవకాశాలు లభిస్తాయి.

క్లుప్తంగా...

2 నుంచి నృసింహ జయంత్యుత్సవాలు



యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి ఆలయంలో మే 2 నుంచి 4 వరకు శ్రీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గీతారెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తితో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మే 2న ఉదయం 9 గంటలకు స్వస్తి వాచనం, విష్వక్సేనారాధనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని.. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రధానాలయంలో 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలను రద్దు చేసినట్లు తెలిపారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోనూ మే 2 నుంచి 4 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

అదనంగా 500 పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్స్

సాక్షి, హైదరాబాద్: కొత్త పాస్‌పోర్టుల కోసం, పాస్‌పోర్టుల రెన్యువల్ కోసం వచ్చే వినియోగదారులు గంటల తరబడి ఎదురుచూసే పరిస్థితి నుంచి ఉపశమనం కల్పించేందుకు రెండు వారాల పాటు అదనపు అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం నిర్ణయించింది. పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, పాస్‌పోర్టు ఆఫీస్ సేవా కేంద్రాల్లో ఎప్పుడూ ఇచ్చే రోజువారీ పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్స్‌కు అదనంగా ఈ నెల 27 నుంచి రెండు వారాల పాటు మరో 500 అపాయింట్‌మెంట్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. www. passportindia. gov. in వెబ్‌సైట్ ద్వారా లేదా mPassportseva మొబైల్ అప్లికేషన్ ద్వారా లేదా పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, పాస్‌పోర్టు ఆఫీస్ సేవా కేంద్రాలను నేరుగా సంప్రదించడం ద్వారా ఈ అదనపు 500 అపాయింట్‌మెంట్స్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

మే 31 నుంచి అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ మూడు, రెండు, మొదటి సంవత్సరం ఓల్డ్ బ్యాచ్ 2016, అంతకుముందు బ్యాచ్‌ల విద్యార్థులకు మే 31వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో ఏడాది పరీక్షలు మే 31 నుంచి జూన్ 5 వరకు, రెండో ఏడాది పరీక్షలు జూన్ 7 నుంచి 14 వరకు. మొదటి ఏడాది పరీక్షలు జూన్ 16 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల సమయం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ మే 10గా గడువు విధించినట్లు వివరించారు.మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు వారి సంబంధిత అధ్యయన కేంద్రంలో విశ్వవిద్యాలయ కాల్ సెంటర్‌లో హెల్ప్ డెస్క్ 7382929570 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

14 వరకు పాలిసెట్ దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలిసెట్) దరఖాస్తు గడువును పెంచినట్లు సాంకేతిక విద్య కార్యదర్శి డాక్టర్ సి.శ్రీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 14 వరకు రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. మే 17న పాలిసెట్ పరీక్ష నిర్వహించనుండగా, ఫలితాలను పరీక్ష జరిగిన పదిరోజుల్లో వెల్లడిస్తామని వెల్లడించారు.

గ్రూప్-1 అభ్యర్థులకు ఉచిత భోజనం: దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: పేపర్ల లీకేజీలతో ఆర్థికంగా నష్టపోయిన అభ్యర్థులను ఆదుకోవడానికి తమ వంతు సాయంగా మే 1 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు పూర్తయ్యే వరకు రెండు పూటలా ఉచిత భోజనాన్ని తమ కేంద్ర కార్యాలయం బాగ్ లింగంపల్లిలో అందిచనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.క్వాలిఫైడ్ అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకొని ఉచిత భోజన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్పీడీసీఎల్ ఆపరేటర్ రాత పరీక్ష జూన్ 4న

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్ రాత పరీక్ష వాయిదా పడింది. ఈ నెల 28న నిర్వహించనున్న రాత పరీక్షను వాయిదా వేసి, తిరిగి జూన్ 4న నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.


కొత్తగా 52 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం 7,006 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 52 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది.

అందనంత దూరాన ఆవాసం..

నగరాలు, పట్టణాల్లో తీవ్రమవుతున్న గృహాల సమస్య

- ప్రస్తుతం దేశంలో 1.9 కోట్ల గృహాల కొరత
- ఉపాధి కోసం సామాన్య జనం పట్టణాలకు పోటెత్తుతుండటమే కారణం
- దేశంలో దాదాపు 36 శాతానికి పైగా జనాభా పట్టణ ప్రాంతాల్లోనే నివాసం
- 2050 నాటికి దేశ జనాభాలో సగం నగరాలు, పట్టణాల్లోనే..



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ గృహాల కొరతను తీవ్రం చేస్తోంది. ప్రస్తుతం పట్టణాలు, నగరాల్లో 1.9 కోట్ల గృహాల కొరత ఉంటే.. 2030 నాటికి ఇది 3.8 కోట్లుగా ఉండనుందని పలు దేశీయ, అంతర్జాతీయ సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర గృహ, పట్టణ మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది. రాబోయే ఏడేళ్లలో ఏకంగా దాదాపు నాలుగు కోట్ల గృహాల కొరత ఏర్పడుతుందని పేర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. దేశంలో దాదాపు 36 శాతానికి పైగా జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. 2050 నాటికి ఇది 50 శాతానికి చేరుతుందని అధ్యయనాలు స్పష్టం చేస్తుండగా, నిపుణులు సైతం ఇదే అంచనా వేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తుండడమే పట్టణీకరణకు ప్రధాన కారణమని, గ్రామీణ ప్రాంతాల నుంచి సామాన్య జనం నగరాల బాట పడుతున్నారని చెబుతున్నారు.

భూముల ధరలు, నిర్మాణ వ్యయం పెరగడంతో..

పట్టణ ప్రాంతాల్లో భూముల విలువలు అమాంతంగా పెరగడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న వారికి సొంతంగా ఓ గూడు దొరకడం గగనమవుతోంది. పట్టణాలు, నగరాల్లో వివాద రహిత భూములు లేకపోవడం, పెరుగుతున్న నిర్మాణ వ్యయం, ఆచరణ సాధ్యమైన రెంటల్ మార్కెట్ లేకపోవడం తదితర అంశాలు గృహాల కొరతకు కారణమవుతున్నాయి, అందరికీ అందుబాటు ధరలో గృహాలు ఉండేందుకు వీలుగా భూముల ధరలు, నిర్మాణ వ్యయం తగ్గేలా చర్యలు తీసుకోవడమేగాక, ఆర్థిక సహకారం కూడా అందిస్తే ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని గృహ నిర్మాణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. పట్టణాల్లో ఒకప్పుడు భారీగా స్థలాలు సేకరించిన పలు కేంద్ర, ప్రభుత్వ రంగ సంస్థలు వాటిని పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకుని రాలేకపోయాయి. అలాంటి స్థలాలను గృహ నిర్మాణ రంగానికి కేటాయిస్తే పరిస్థితులు మెరుగు అవుతాయని అంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి 2030 నాటికి అదనంగా 8.33 కోట్ల మంది ప్రజలు నగరాలకు చేరుకుంటారని అంచనా వేస్తున్నారు. దీంతో అందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒక్క గృహవసతే కాకుం

మౌలిక సదుపాయాలూ సమస్యే..

డా పరిశుభ్రమైన నీరు, మురుగునీటి పారుదల, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కూడా ప్రధాన సమస్యగా మారుతోంది. పట్టణాలు, నగర జనాభాలో 17% మంది (అల్పాదాయ వర్గాలు) మురికివాడల్లోనే నివసిస్తున్నట్లు అంచనా. 71 శాతం ప్రజలకు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ లేదు. 60 శాతం ప్రజలకు ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ ఉంటే.. మరుగుదొడ్ల సౌకర్యం లేని మురికివాడలు సైతం ఉన్నాయి. గ్రామాల నుంచి నగరాలు, పట్టణాలకు వస్తున్న వారి ఆదాయాల్లో మార్పుల కారణంగా నివాస గృహాలకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

సింగిల్ విండో పద్ధతి బెటర్..

రియల్ ఎస్టేట్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టే వ్యాపారులకు త్వరగా అనుమతులు రావడానికి వీలుగా సింగిల్ విండో పద్ధతిని కూడా అమలు చేయాలని అంటున్నారు. ప్రస్తుతం 'రెరా'(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) అనుమతుల పేరిట కొంతవరకు అలాంటి వెసులుబాటు వచ్చినా.. అది భారీ ప్రాజెక్టులకు మాత్రమే ఉపయోగపడుతోంది. మధ్య, దిగువ తరగతులకు అనుకూలంగా గృహాల నిర్మాణానికి అవసరమైన లే అవుట్‌లు, ఇళ్ల నిర్మాణానికి సులువుగా అనుమతులు వచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. అనుమతుల కోసం పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం, సకాలంలో అనుమతులు రాక నిర్మాణ వ్యయం విపరీతంగా పెరగడం వల్ల కూడా పేదలకు గృహాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం, క్రెడిట్ లింక్ సబ్సిడీ పథకం కేవలం ఆర్థికంగా వెనుకబడిన, దిగువ ఆదాయ వర్గాలకు మాత్రమే ఉపయోగ పడుతున్నాయని, వీటిని మధ్యాదాయ వర్గాలకు కూడా వర్తింప చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

భూ సేకరణ వ్యయానికీ ప్రోత్సాహకాలు ఇవ్వాలి



అందుబాటులో ఉండే గృహాలకు సంబంధించి నిర్మాణదారులను, కొనుగోలుదారులను ఇద్దరినీ ఆకర్షించేందుకు కేంద్రం పలు రాయితీలను ప్రకటించింది. పన్ను ప్రోత్సాహకాలతో డెవలపర్లను, వడ్డీ రాయితీలతో కొనుగోలుదారులను సంతృప్తి పరుస్తోంది. అయితే ప్రధాన నగరాల్లో ఈ ప్రాజెక్టులకు భూమి సేకరణ ప్రధాన సమస్యగా మారుతోంది. అందువల్ల కేంద్రం ఆయా ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూ సేకరణ వ్యయాలపై కూడా ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉంది.

- అన్షుల్ జైన్, ఎండీ, కుష్‌మన్ వేక్‌ఫీల్డ్ ఇండియా

నెరవేరని పీఎంఏవై లక్ష్యం

పీఎంఏవై పథకం కింద 2015 నుంచి 2022 మధ్య మొత్తంగా 1.23 కోట్ల గృహాలు నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటివరకు లబ్ధిదారులకు అప్పగించింది అందులో సగమే. 61 లక్షల గృహాలను మాత్రమే అందించినట్లు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమీక్షలో బయటపడింది. వాస్తవానికి 1.07 కోట్ల గృహాల పనులు ప్రారంభించినా.. అన్నీ పూర్తి కాలేదు. నిర్మాణం పూర్తయినా మౌలిక సదుపాయాలు లేని కారణంగా 5.61 గృహాలను లబ్ధిదారులకు అందించలేకపోవడం గమనార్హం. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల వాటాతో పాటు లబ్ధిదారుల వాటా కూడా ఉంటుంది. అయితే పలు రాష్ట్రాలు తమ వాటాను చెల్లించడంలో జాప్యం చేస్తున్నట్లు పార్లమెంటరీ కమిటీ గుర్తించింది.

మౌలిక వసతులు కల్పించాలి



నగరంలో అందరికీ అందుబాటులో ఉండేలా గృహాలను నిర్మించాలంటే స్థలం కొరత ప్రధాన సమస్య. దీంతో శివారు ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి. అలా వెళ్లాలంటే శివారుల్లో ముందుగా రహదారులు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలి. అప్పుడే డెవలపర్లు, కొనుగోలుదారులు ఇద్దరూ ముందుకొస్తారు. హైదరాబాద్ డెవలపర్ల విషయానికొస్తే.. ముందుగా ఔటర్ రింగ్ రోడ్డు గ్రిడ్ రోడ్లు, మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేయాలి. అప్పుడే ఓఆర్ఆర్ పరిధిలో ఈ తరహా గృహాల నిర్మాణం ఊపందుకుంటుంది. అలాగే ఈ తరహా నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చార్జీలను నామమాత్రంగా వసూలు చేయాలి. స్థానిక సంస్థల ఫీజులను తగ్గించాలి.

- శేఖర్‌రెడ్డి, మాజీ జాతీయ అధ్యక్షుడు, క్రెడాయ్

29 ఏళ్ల తర్వాత జైలుకు..

- పరారీలో ఉన్న ఇద్దరు ఆర్థిక నేరగాళ్ల అరెస్టు
- కేరళలో నిందితులను పట్టుకున్న సీఐడీ



సాక్షి,, హైదరాబాద్ : అధిక వడ్డీ ఆశజూపి డబ్బులు కాజేసి పరారైన ఇద్దరు ఆర్థిక నేరగాళ్లను తెలంగాణ సీఐడీ పోలీసులు 29 ఏళ్ల తర్వాత కటకటాల వెనక్కి నెట్టారు. ఈ కేసులో నిందితులు ఎంఎం టామీ, సీఐ జోయ్ అలియాస్ జోసెఫ్‌లను తెలంగాణ సీఐడీ అధికారుల బృందం కేరళలోని ఎర్నాకుళంలో అరెస్టు చేసింది. సీఐడీ అడిషనల్ డీజీ మహేష్ భగవత్ మంగళవారం తెలిపిన వివరాలివి. కేరళకు చెందిన ఎంఎం టామీ, షెర్లీ టామీలు మరో ఎనిమిదిమందితో కలిసి ట్రావెన్‌కోర్ ఫైనాన్స్ అండ్ లీజింగ్ కంపెనీని హైదరాబాద్‌లో 1986లో స్థాపించారు. అధిక మొత్తంలో వడ్డీలు ఆశజూపి పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. తొలుత కొద్దిమందికి సకాలంలో వడ్డీ చెల్లించిన సదరు కంపెనీ ప్రతినిధులు.. ఆతర్వాత రూ.11,57,994 మొత్తాన్ని ఖాతాదారులకు చెల్లించకుండా బోర్డు తిప్పేశారు. ఈ ఆర్థిక మోసంపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత 1994 జనవరిలో ఎంఎం టామీ, షెర్లీటామీ, సీఐ జోసెఫ్‌లను అరెస్టు చేసి కోర్టు అనుమతిలో జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటికి వచ్చిన నిందితులు కోర్టుకు రాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. కోర్టు 1994లో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుల్లో ఇద్దరిని 29 ఏళ్ల తర్వాత అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితుల అరెస్టులో కీలకంగా పనిచేసిన ఇన్‌స్పెక్టర్ జేఎల్ లింగస్వామి, ఎస్‌ఐ డి.రమేష్, హెడ్‌కానిస్టేబుల్ డి.నర్సయ్య, కానిస్టేబుల్ ఆనంద్, మహిళా కానిస్టేబుల్ అనితలను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్టీసీలో గ్రాట్యుటీ గల్లంతు

- జనవరి నుంచి దాని చెల్లింపులకు అడ్డంకులు
- ఆర్థిక ఇబ్బందులతో చరిత్రలో తొలిసారి చెల్లింపుల నిలిపివేత
- రిటైర్ అయిన వెంటనే చెల్లించాల్సిన బెనిఫిట్ కోసం ఎదురుచూపులు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చరిత్రలో తొలిసారి గ్రాట్యుటీకి గండిపడింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగుల హక్కుగా పొందే ఈ గ్రాట్యుటీని ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపి నిలిపేసింది. గతంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా గ్రాట్యుటీని మాత్రం ఆపలేదు. గత జనవరి నుంచి వీటి చెల్లింపుల్లో ప్రతిష్టంభన నెలకొంది. డిసెంబర్‌లో పదవీ విరమణ పొందినవారికి కాస్త ఆలస్యంగా చెల్లించారు. జనవరి నుంచి రిటైర్ అవుతున్నవారికి చెల్లించే విషయంలో ఆర్టీసీ వెనకాముందు ఆడుతోంది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీలను వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. వారు రిటైర్ అయ్యే సమయానికల్లా సెటిల్‌మెంట్లను సిద్ధం చేస్తారు. కానీ, ఇప్పుడు మొదటిసారి గతి తప్పింది. ఒక్కో ఉద్యోగికి వారి బేసిక్ ఆధారంగా రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు గ్రాట్యుటీ అందుతుంది. ఆర్టీసీలో ప్రస్తుతం పింఛన్ విధానం లేనందున గ్రాట్యుటీ పెద్ద ఊరట, దాన్ని భవిష్యత్తు ఆసరాకు వీలుగా డిపాజిట్ చేసుకునేవాళ్లు, ఇంటి ప్రధాన అవసరాలకు వాడేవారు ఎక్కువగా ఉంటారు. అలాంటిది ఇప్పుడు గ్రాట్యుటీ నిలిచిపోవటం, ఎప్పుడు విడుదలవుతుందో తెలియని అయోమయం నెలకొనటంతో రిటైర్ అవుతున్న ఉద్యోగులలో తీవ్ర ఆవేదన నెలకొంది. తక్కువ వేతనాలుండే శ్రామిక్, డ్రైవర్, కండక్టర్ కుటుంబాల్లో ఇప్పుడు గందరగోళం నెలకొంది.

చివరి నెల వేతనం కూడా గల్లంతేనా..


ఆర్టీసీలో తొలి నుంచి రిటైర్ అయ్యేచివరి నెలవేతనం ఆలస్యంగా చెల్లిస్తూ వచ్చే పద్ధతి ఉంది. వారు జాయిన్ అయినప్పుడు నెల మధ్యలోనో, చివరలోనో విధుల్లో చేరినప్పుడు ఆ నెల మొత్తానికి అడ్వాన్సుగా పూర్తి మొత్తం చెల్లిస్తున్నారు. రిటైర్ అయ్యే చివరి నెల వేతనం నుంచి నాటి అడ్వాన్స్ మొత్తాన్ని సర్దుబాటు చేస్తారు. ఈ లెక్కలు చూసేందుకు సమయం పట్టనున్నందున ఓ నెల ఆలస్యంగా చివరి వేతనం చెల్లించేవారు. ఇప్పుడు గ్రాట్యుటీతోపాటు ఆ నెల వేతనం చెల్లింపునకు కూడా ఆటంకం ఏర్పడింది. వెరసి ఇటు గ్రాట్యుటీ రాక, చివరి వేతనం అందక ఉద్యోగులు తీవ్ర నిరాశతో ఇళ్లకు వెళ్తున్నారు. రిటైర్‌మెంట్ ఫంక్షన్‌రోజు కుటుంబసభ్యులను పిలిపించి సన్మానం చేసి సెటిల్‌మెంట్ల తాలూకు డబ్బు అందజేసి పంపించేరోజులు పోయి, ఖాళీ చేతులతో పంపటం ఇప్పుడు ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆవేదనకు కారణమవుతోంది.

సిబ్బందిలో అవగాహన లేక..: ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యం ఉచితంగా అందుతోంది. రిటైర్ అవగానే ఆ వెసులుబాటు నిలిచిపోతుంది. అప్పుడు సిబ్బంది హోదా ఆధారంగా రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకు నిర్ధారిత మొత్తాన్ని వసూలు చేసుకుని 'రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ బెనిఫిట్ స్కీం(ఆర్ఈఎంఎస్)'లో సభ్యత్వం కల్పిస్తారు. అప్పుడు వారికి తార్నాక ఆసుపత్రి ద్వారా మెరుగైన చికిత్సకు వేరే ప్రైవేటు ఆసుపత్రికి రిఫర్ చేస్తే రూ.4 లక్షల వరకు బిల్లు కవర్ అవుతుంది. ఆర్ఈఎంఎస్ సభ్యత్వం కోసం ఉద్యోగులు చెల్లించాల్సిన మొత్తాన్ని గ్రాట్యుటీ నుంచి మినహాయిస్తూ వస్తున్నారు. ఇప్పుడు గ్రాట్యుటీ నిలిచిపోవటంతో కొన్ని డిపోల్లో సంబంధిత సెక్షన్ ఉద్యోగులు ఆర్ఈఎంఎస్ సభ్యత్వం కోసం ఏర్పాట్లు చేయటం లేదు. కొన్నిచోట్ల మాత్రం, నిర్ధారిత మొత్తాన్ని తగ్గించి గ్రాట్యుటీ సెటిల్‌మెంట్ కోసం ఉన్నతాధికారులకు ఫైల్ పంపుతున్నారు. దీంతో కొన్ని డిపోల్లో రిటైర్ అయినవారికి ఆర్ఈఎంఎస్ సభ్యత్వం లభించటం లేదు. ఏప్రిల్‌లో శుభకార్యాలు లేకపోవటంతో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య కూడా తగ్గించి ఫలితంగా రోజువారీ టికెట్ ఆదాయం రూ.14.50 కోట్లు రావాల్సి ఉండగా, రూ.12 కోట్ల వద్దే ఆగిపోతోంది. ఇలాంటి తరుణంలో ఈ నెల తాలూకు జీతాల చెల్లింపు ఎలా అన్న విషయంలో ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జీతాలకే దిక్కులేని తరుణంలో గ్రాట్యుటీ సెటిల్‌మెంట్ కష్టంగా మారింది.

నేటి నుంచి కొత్త సచివాలయానికి

శాఖల తరలింపు

- 28లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశం
- శాఖలవారీగా స్థలాలు కేటాయింపు
- 30న ప్రారంభానికి చురుగ్గా ఏర్పాట్లు
- సుదర్శన యాగంతో కార్యకలాపాలు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వశాఖ తరలింపు ప్రక్రియను ప్రారంభించి 28లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆరు అంతస్తుల కొత్త సచివాలయ భవన సముదాయంలోని ఒక్కో అంతస్తులో కనీసం మూడు శాఖలకు స్థలం కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెవెన్యూ, మొదటి అంతస్తులో హోం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెండో అంతస్తులో ఆర్థిక, మూడో అంతస్తులో వ్యవసాయం, ఎస్సీల అభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, నాలుగో అంతస్తులో నీటిపారుదల, న్యాయశాఖలు, ఐదో అంతస్తులో రోడ్లు, భవనాలు, సాధారణ పరిపాలన శాఖలు, ఆరో అంతస్తులో సీఎం, సీఎస్‌లకు స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సుదర్శనయాగంతో కార్యకలాపాలు షురూ

ఈ నెల 30న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కొత్త సచివాలయాన్ని ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందే ఉదయం కొత్త సచివాలయం ప్రాంగణంలో సుదర్శన యాగం నిర్వహించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా యాగశాలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త సచివాలయానికి శాఖల తరలింపు, సచివాలయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి మంగళవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో అన్ని శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి శాఖలవారీగా బాధ్యతలను అప్పగించారు.

అయ్యో.. అముద

- క్యాన్సర్ మహమ్మారితో క్షీణిస్తున్న ఆరోగ్యం
- ఆపన్నహస్తం కోసం అభాగ్యురాలి ఎదురుచూపు



పదేళ్ల క్రితం చెత్త కుప్పల మధ్య అముద



కోదాడ: అముదకు మళ్లీ ఆపదొచ్చింది. పదేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న చెత్త కుప్పల్లో మతిస్థిమితం లేకుండా కనిపించిన చిన్నారి అముదను అక్కడే చెప్పులు కుట్టుకునే పల్లా వెంకటేశ్వర్లు చేరదీశారు. చికిత్స చేయించి చదువు చెప్పించారు. ఆ తర్వాత మంత్రి హరీశ్‌రావు చొరవతో కోదాడ మార్కెట్ కార్యాలయంలో ఆమె అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమె జీవిత చరిత్రను సినిమాగా కూడా తీశారు. ఇలా సాఫీగా సాగుతున్న అముద జీవితంలో క్యాన్సర్ మహమ్మారి కల్లోలం సృష్టిస్తోంది. హైదరాబాద్‌లోని బసవతారకం వైద్యశాలలో చికిత్స చేయించినా రేడియేషన్‌ను తట్టుకోలేక పోవడంతో కేరళ వైద్యుడి పర్యవేక్షణలో ఆయుర్వేద చికిత్స పొందుతోంది. అయితే దీనికి ఖర్చు ఎక్కువగా ఉండడంతో ఆమెను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సాయం చేయదలిచిన వారు.. సంప్రదించాల్సిన వివరాలు	పల్లె అముద నారాయణ నాడర్, బ్యాంక్ ఖాతా నంబర్: 6247 897 1579, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0020181 ఫోన్ నంబర్ : 93915 42070

గేమ్‌ఛేంజర్‌గా ఆర్ఆర్ఆర్



- అవాంతరాలు అధిగమించి ప్రాజెక్టును టెండర్లకు సిద్ధం చేశాం
- ఎన్‌హెచ్ఏఐ తెలంగాణ రీజనల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్
- చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఢిల్లీకి బదిలీ

సాక్షి, హైదరాబాద్: ''హైదరాబాద్ రీజనల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్) అందుబాటులోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రంలో భారీ మార్పులకు అవకాశం ఉంటుంది. ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్) వల్ల హైదరాబాద్‌కు కలిగిన లాభం కంటే ఆర్ఆర్ఆర్ వల్ల ఏర్పడే లబ్ధి ఇంకా ఎక్కువగా ఉండనుంది. ఎక్స్‌ప్రెస్ వే తరహాలో రూపుదిద్దుకోనున్న ఆ రోడ్డును ఆసరాగా చేసుకొని పారిశ్రామిక క్లస్టర్లు రావడమే కాకుండా శాటిలైట్ టౌన్‌షిప్‌లు, టూరిజం ప్రాజెక్టులు ఏర్పడనున్నాయి. ఇది హైదరాబాద్‌పై జనాభా ఒత్తిడిని తగ్గించటమే కాకుండా ఎందరికో ఉపాధి కల్పించనుంది. ఇలాంటి ప్రాజెక్టు సాకారమయ్యేందుకు అవసరమైన ప్రాథమిక, కీలక ఏర్పాట్లు నా ఆధ్వర్యంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నా'' అని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తెలంగాణ రీజనల్ ఆఫీసర్ ఎ.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. 2017 నుంచి రాష్ట్రానికి ఎన్‌హెచ్ఏఐ ఆర్ఓగా ఉన్న ఆయన ఇప్పుడు ఎన్‌హెచ్ఏఐ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతిపై ఢిల్లీ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం కృష్ణప్రసాద్ విలేకరులతో మాట్లాడారు.

నాగ్‌పూర్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేతోనూ మేలు

నాగ్‌పూర్-విజయవాడ మధ్య రూపుదిద్దుకొనే ఎక్స్‌ప్రెస్ వే మంచిర్యాల నుంచి విజయవాడ వరకు పూర్తి గ్రీన్‌ఫీల్డ్ హైవేగా రానుండటం కూడా రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అది ప్రస్తుతం హైదరాబాద్ మీదుగా విజయవాడకున్న హైవేకు ప్రత్యామ్నాయ మార్గంగా మారి ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తుందని, దీనివల్ల కూడా కొత్త ఉపాధి మార్గాలు ఏర్పడతాయన్నారు. ఈ కీలక ప్రాజెక్టు పర్యావరణ అనుమతులు సాధించడం తమకు సవాల్‌గా మారినా అడ్డంకులను అధిగమించి ఇప్పుడు పనులు ప్రారంభించే స్థాయికి తెచ్చామన్నారు.

రూ. కోట్ల విలువైన రోడ్డు ప్రాజెక్టులు పూర్తి చేశాం..

తాను తెలంగాణలో పనిచేసిన ఆరున్నరేళ్లలో రూ.10,764 కోట్ల విలువైన 335.45 కి.మీ. నిడివిగాల రోడ్లను పూర్తి చేశామని, రూ.13,664.21 కోట్ల విలువైన 432.49 కి.మీ. నిడివిగల ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా అవార్డ్ పాస్ చేయించామని, రూ.9102 కోట్ల విలువైన 294 కి.మీ. నిడివి గల ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రూ.14696 కోట్ల విలువైన 275 కి.మీ. నిడివి గల ప్రాజెక్టు పనులు డీపీఆర్ తయారీ దశలో ఉన్నాయన్నారు.

సంగారెడ్డి - తూప్రాన్ మధ్య

తొలి 'రింగు' నిర్మాణం

- రెండు ప్యాకేజీలుగా 60 కిలోమీటర్ల రోడ్డు
- త్వరలో టెండర్లు.. చకచకా ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తరభాగం నిర్మాణ పనులు తొలుత సంగారెడ్డి-తూప్రాన్ మధ్య ప్రారంభం కానున్నాయి. ఈమేరకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు పట్టణాల మధ్య ఉన్న 60 కిలోమీటర్ల నిడివికి సంబంధించి రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒక్కోటి 30 కిలోమీటర్లుగా రెండు ప్యాకేజీలకు త్వరలో టెండర్లు పిలవనున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధం చేసిన ఎన్‌హెచ్ఏఐ తాజాగా మూడు కాంపిటెంట్ అథారిటీ ఫర్ లాండ్ అక్విజిషన్ (కాలా)లకు సంబంధించి భూ పరిహార 3-డీ గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడం తెలిసిందే. మిగతా ఐదు కాలాలకు కూడా త్వరలో గెజిట్ నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. గతేడాది ఏప్రిల్‌లో మూడు కాలాలకు 3-ఏ గెజిట్ నోటిఫికేషన్లు విడుదల కాగా, ఈ ఏప్రిల్‌తో వాటి గడువు తీరిపోనుంది. దీంతో ఏప్రిల్ ముగిసేలోపు 3-డీ గెజిట్ నోటిఫికేషన్లు జారీ కావలసి ఉంది. ఇదే విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ అధికారులు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, భూపరిహారంలో తనవంతు వాటా డబ్బులు జమ చేయాలని కోరారు. ఈమేరకు ఇటీవల ఢిల్లీలో ఎన్‌హెచ్ఏఐ-రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల మధ్య జరిగిన భేటీలో సయోధ్య కుదిరింది. రూ.2900 కోట్లకు తొలుత రూ.100 కోట్లు చెల్లించనున్నట్టు రాష్ట్ర అధికారులు పేర్కొనగా ఎన్‌హెచ్ఏఐ అంగీకరించింది. ఈమేరకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ-ఎన్‌హెచ్ఏఐ-రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. సంతకాల ప్రక్రియ పూర్తి కాగానే, మిగతా గెజిట్ నోటిఫికేషన్లు జారీ కానున్నాయి. ఆ వెంటనే సంగారెడ్డి-తూప్రాన్ మధ్య రెండు ప్యాకేజీలుగా 60 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవనున్నారు.

ఇక నాలుగేళ్ల బీఈడీ కోర్సు!

27న ఎన్‌సీటీఈ సమావేశం



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సులో మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. బీఏ-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సులను నాలుగేళ్ల కాలపరిమితితో రూపొందించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిని 2022లోనే రూపొందించింది. దీనిపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది. వీటిలో మార్పులు చేర్పులతో తుది ప్రతిని రూపొందించే ప్రయత్నంలో ఉంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) దీనిపై ఈ నెల 27న ఢిల్లీలో సమావేశం కానుంది. ఈ భేటీలో నాలుగేళ్ల సమీకృత బీఈడీ కోర్సులపై చర్చించనున్నా రు. 2024-25 నుంచి కొత్త బీఈడీ కోర్సులను అమల్లోకి తేవాలనే లక్ష్యంతో ఉన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.